



www.prajapaksham.in


# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

సంపుటి 08, సంచిక: 267 | బుధవారం | 27-08-2025 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## శుభాకాంక్షలు



పాఠకులు, ప్రకటనకర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు 'ప్రజాపక్షం' వినాయక చవితి శుభాకాంక్షలు

### సెలవు

వినాయక చవితి సందర్భంగా 'ప్రజాపక్షం' కార్యాలయానికి బుధవారం సెలవు. గురువారం పత్రిక వెలువడదు. పునర్దర్శనం శుక్రవారం.

- ఎడిటర్

# స్థానిక కసరత్తు



## పంచాయతీ ఎన్నికలకు ఎన్నికల సంఘం ముమ్మర ఏర్పాట్లు

- పోలింగ్ కేంద్రాలు, తుది ఓటర్ల జాబితా విడుదలకు నోటిఫికేషన్ జారీ
- ఫొటో ఓటర్ల జాబితా తయారుచేసి ప్రచురించాలని ఆదేశం
- 28న ఓటర్ల జాబితా తయారీ, 29న ఎంపిడిఒల ద్వారా మండల స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు
- 30న ఓటర్ల జాబితాపై అభ్యంతరాల స్వీకరణ
- సెప్టెంబర్ 2న తుది ఓటర్ల జాబితా ప్రచురణ

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల కోసం కసరత్తును రాష్ట్ర ఎన్నికల సంఘం ముమ్మరం చేసింది. అందులో భాగంగా మంగళవారం గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం పోలింగ్ కేంద్రాలు, తుది ఓటర్ల జాబితా విడుదలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆ క్రమంలో నోటిఫై చేయబడిన అన్ని గ్రామ పంచాయతీల్లోని ఫొటో ఓటర్ల జాబితాను తయారు చేసి ప్రచురించాలని పంచాయతీ అధికారులను రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. గ్రామ పంచాయతీల ఓటర్ల జాబితా తయారీ ప్రచురణ కోసం షెడ్యూల్ సైతం విడుదల చేసింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఐ.రాణి కుముదిని జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం, సెప్టెంబర్ 2న తుది ఓటరు జాబితాలను ప్రచురించనున్నారు. ఈ ప్రక్రియలో భాగంగా, జూలై 1, 2025 నాటికి ఉన్న అసెంబ్లీ నియోజకవర్గాల ఫొటో ఓటరు జాబితాలను ఆధారంగా చేసుకుని గ్రామ పంచాయతీలకు వార్డుల వారీగా ఓటరు జాబితాలను తరువాయి 2లో



## భారత్ ఎగుమతులపై నేటి నుండి అదనపు సుంకాలు

- 50 శాతం టారిఫ్‌లు అమలుచేయనున్న అమెరికా
- 48.2 బి.డాలర్లు పైగా విలువైన సరుకులపై వసూళ్ళు

**వాషింగ్టన్/న్యూఢిల్లీ :** భారత్ ఎగుమతులపై అమెరికా అదనంగా విధించిన 50 శాతం పూర్తి టారిఫ్‌లు బుధవారం నుండి అమలులోకి వస్తాయి. భారత్ చేసే ఎగుమతులపై విధించిన 25 శాతం అదనపు సుంకాలు ఈనెల మొదటివారంలోనే అమలులోకి రాగా, మరో 25 శాతం పెనాల్టీ సుంకాలు బుధవారం నుండి అమలులోకి వస్తాయి. అమెరికా హోంల్యాండ్ సెక్యూరిటీ డిపార్ట్‌మెంట్ మంగళవారం తరువాయి 2లో

## బాలికపై అత్యాచారం నిందితుడికి 51 ఏళ్లు జైలు

- పోక్సో కింద 20, అట్రాసిటి 20, మైనర్ బాలిక కిడ్నాప్ 10, బెదిరింపునకు ఏడాది జైలు
- బాధితురాలికి రూ.7 లక్షల రూపాయల పరిహారం
- నల్లగొండ కోర్టు సంచలన తీర్పు

ప్రజాపక్షం/నల్లగొండ

మైనర్ బాలిక ను బలవంతంగా అత్యాచారం చేసిన నిందితునికి 51 ఏళ్ల జైలు శిక్షతోపాటు జరిమానా విధించడం జరిగిందని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలానికి తరువాయి 2లో

## 30 నుంచి అసెంబ్లీ

- ఉభయ సభలు ఉదయం 10 గంటలకు భేటీ
- 29న మంత్రివర్గ సమావేశం
- స్థానిక ఎన్నికల నిర్వహణ, బిసిలకు 40శాతం రిజర్వేషన్లు, కాళేశ్వరంపై ఘోష్ కమిషన్ నివేదికపై చర్చ

ప్రజాపక్షం/హైదరాబాద్




తెలంగాణ రాష్ట్ర శాసనసభ, శాసనమండలి వర్షాకాల సమావేశాలు ఈ నెల 30వ తేదీ నుంచి జరగనున్నాయి. ఉభయ సభలు ఆరోజు ఉదయం 10.30 గంటలకు సమావేశం కానున్నాయి. తెలంగాణ 3వ శాసనసభ 6వ సమావేశాలను, శాసనమండలి 24వ సమావేశాలను 30వ తేదీ నుంచి నిర్వహించాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆదేశాలను జారీ చేశారు. ఈ మేరకు తెలంగాణ లెజిస్లేచర్ సెక్రటరీ డాక్టర్ వి.నరసింహాచార్యులు మంగళవారం సర్క్యులర్ జారీ చేశారు. కాగా తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఆగస్టు 29 మధ్యాహ్నం తరువాయి 2లో

## సాదా బైనామాలకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్

- 2020 అక్టోబర్ 12 నుంచి నవంబర్ 10 వరకు స్వీకరించిన దరఖాస్తుల పరిష్కారానికి అనుమతులు
- 9 లక్షలకు పైగా దరఖాస్తులకు మోక్షం : మంత్రి పొంగులేటి
- సాధ్యమైనంత త్వరగా సాదాబైనామాలు పరిష్కరిస్తామని వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్



కొన్నేళ్లుగా అమలుకాకుండా ఉన్న సాదా బైనామాల క్రమబద్ధీకరణకు అవరోధాలు తొలగిపోయాయి. హైకోర్టులో ఉన్న స్టే తొలగింపుతో రెగ్యులరైజేషన్‌కు గ్రీన్ సిగ్నల్ లభించింది. సాదాబైనామా క్రమబద్ధీకరణ నిమిత్తం ఐదేళ్ల క్రితం రాష్ట్ర సర్కార్ జీవో 112ను జారీ చేయగానిర్మల్ జిల్లాకు చెందిన షిండే దేవిదాస్ సవాలు చేస్తూ పిల్ దాఖలు తరువాయి 2లో



## బంగాళాఖాతంలో అల్పపీడనం

- రానున్న ఐదురోజులు భారీ వర్షాలు
- పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరిక

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో రాగల ఐదురోజులు భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరించారు. ఒడిశా తీరాన్ని ఆనుకొని వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని వెల్లడించారు. తుఫాను ప్రసరణ సముద్రమట్టానికి సగటున 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉందన్నారు. ఎత్తుకు వెళ్లేకొద్దీ నైరుతి వైపునకు వంగి ఉందని తెలిపారు. పశ్చిమ వాయువ్య దిశగా కదిలి రాబోయే రెండురోజుల్లో మరింత బలపడే అవకాశం ఉందన్నారు. ఈ క్రమంలో మంగళవారం భూపాలపల్లి, ములుగు తరువాయి 2లో

## రాజ్యాంగాన్ని రక్షించాలంటే... ఓటు హక్కు కాపాడుకోవాలి

- ఓటు చోరీ వల్లే మరో 50 ఏళ్లు పాలిస్తామంటున్న అమిత్ షా
- 'ఓట్ అధికార్ యాత్ర'లో రాహుల్‌గాంధీ విమర్శ
- యాత్రలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**సుపాల్ :** బిహార్‌లో జరుగుతున్న ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)పై కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వంపై ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ మాటల దాడిని ముమ్మరం చేశారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి ప్రజలు తమ ఓటు హక్కును కాపాడుకోవాలని అన్నారు. బిహార్‌లోని ఎస్ఐఆర్ బిజెపి, ఇసి చర్యలను బహిర్గతం చేసింది, అందువల్ల ప్రజలు కాషాయ పార్టీ నాయకులను 'ఓటు చోర్' అని పిలవడం ప్రారంభించారని, కాంగ్రెస్ 'ఓటర్ అధికార్ యాత్ర'లో భాగంగా మధుబని జిల్లాలో మంగళవారం జరిగిన తరువాయి 2లో



## దొంగ ఓట్లు తొలగించి ఎన్నికలకు వెళదామా?

- కాంగ్రెస్ గెలిస్తే రాజకీయ సన్యాసం
- హిందూ ఓటు బ్యాంకుతోనే గెలిచా
- కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు

ప్రజాపక్షం/కరీంనగర్



దొంగ ఓట్లతో బిజెపి నేతలు గెలిచారని, దేవుళ్ల పేరుచెప్పి ఓట్లడుగుతారని, దేవుళ్ల పేరుతో రాజకీయాలు చేస్తారని జనహిత కార్యక్రమంలో పిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ చేసిన ఆరోపణలపై మంగళవారం కరీంనగర్‌లో కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్రంగా స్పందించారు. ఓట్ల కోసం బిచ్చమెత్తుకునే పార్టీ కాంగ్రెస్ పార్టీ అని, తరువాయి 2లో

## రాజకీయ సన్యాసానికి సిద్ధంగా ఉండు



- రాముడి పేరు చెప్పకుండా గెలవగలవా?
- బిజెపి, కాంగ్రెస్ పాలనలపై చర్చకు సిద్ధమా?
- బండి సంజయ్‌కి మహేష్‌కుమార్ సవాల్

ప్రజాపక్షం / హైదరాబాద్

దేశంలో 12 ఏళ్ల బిజెపి పాలన, తెలంగాణ రాష్ట్రంలో ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనపై కరీంనగర్ నడిబొడ్డున చర్చకు సిద్ధమా? అని టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్ కేంద్ర మంత్రి బండి సంజయ్‌ని సవాల్ చేశారు. బిజెపి ఇచ్చిన హామీ మేరకు గత 12 ఏళ్ల బిజెపి పాలనలో 24 కోట్ల ఉద్యోగాలు భర్తీ కావాలని, తెలంగాణకు తరువాయి 2లో

## రాజ్యాంగ సంస్థలపై తీవ్ర ప్రభావం

- వాటిని తిరిగి గాడిలో పెట్టేందుకు దృఢంగా ఆలోచించాలి
- ఇండియా కూటమి వెలుపలి వ్యక్తులూ తనకు మద్దతు ఇస్తున్నందుకు కృతజ్ఞతలు
- జస్టిస్ బి. సుదర్శన్‌రెడ్డి



**న్యూఢిల్లీ :** రాజ్యాంగ సంస్థలపై తీవ్ర ప్రభావం ఉందని, వాటిని తిరిగి గాడిలో పెట్టేందుకు దృఢంగా ఆలోచించాల్సిన అవసరం ఉందని ప్రతిపక్షాల రాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి అన్నారు. ఉపరాష్ట్రపతి పదవి రాజ్యాంగ పదవి అని పునరుద్ఘాటించారు. రాష్ట్రపతి తర్వాత అత్యున్నతపదవి అయిన ఉపరాష్ట్రపతి పదవి రాజకీయ పదవి కాదని, అది ఉన్నతమైన రాజ్యాంగ పదవి అని సుదర్శన్‌రెడ్డి అన్నారు. తాను రాజ్యాంగ విలువలకు దృఢంగా కట్టుబడి ఉన్నానని, వాటిని తరువాయి 12లో

## రెండు,మూడు వారాల్లో గాజా యుద్ధం ముగియొచ్చు

డొనాల్డ్ ట్రంప్ సంకేతాలు

**వాషింగ్టన్ :** గాజాలో యుద్ధం రెండు మూడు వారాలలో ముగిసిపోవచ్చునని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సంకేతాలు ఇచ్చారు. గాజాలో జర్నిస్టుల మరణాలపట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ''రాబోయే రెండు మూడు వారాల్లో యుద్ధం మంచి ముగింపునకు రావడం మీరు చూడొచ్చు, యుద్ధ పరిష్కారం కోసం చాలా ఉద్ధృతంగా, చిత్తశుద్ధితో ప్రయత్నాలు జరుగుతున్నాయి'' అని వాషింగ్టన్ ఓవల్ ఆఫీసులో మంగళవారం పాత్రికేయులతో ట్రంప్ చెప్పారు. ఆగస్టునెలలో 15 రోజుల తేడాలో తరువాయి 12లో





# ప్రపంచం
WORLD NEWS

## పాలస్తీనాను గుర్తించేందుకు జర్మనీ తిరస్కృతి

**బెర్లిన్:** పాలస్తీనాను సార్వభౌమాధికార,స్వయంప్రతిపత్తిదేశంగా గుర్తించేందుకు జర్మనీ తిరస్కరించింది. సెప్టెంబరునెలలో పలు యూరప్ దేశాలు పాలస్తీనాను స్వయంప్రతిపత్తిగల దేశంగా గుర్తించేందుకు సిద్ధమవుతున్న తరుణంలో జర్మనీ ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్ మాట్లాడుతూ, ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో పాలస్తీనాను ఒక దేశంగా గుర్తించేందుకు పశ్చిమ దేశాలు చొరవ చేసి తీసుకున్న నిర్ణయంలో తమదేశం భాగస్వామి కావడంలేదని స్పష్టం చేశారు. కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీతో సంయుక్త పత్రికాగోష్ఠిలో ఆయన ఈ విషయం ప్రకటించారు. "తమ ఫెడరల్ ప్రభుత్వ వైఖరి చాలా స్పష్టంగా ఉంది, మార్క్ కార్నీకి తెలుసు, ఆ పరిస్థితులు ఇంకా వచ్చినట్లు మాకు అనిపించడంలేదు, పశ్చిమ దేశాలు తీసుకున్న చొరవలో మేం భాగస్వామ్యం కావడంలేదు" అన్నారు. గతనెలలో బ్రిటన్, ఫ్రాన్స్‌దేశాలు పాలస్తీనాను ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో ఒక స్వయంప్రతిపత్తిగల దేశంగా గుర్తిస్తామని ప్రకటించిన తర్వాత కెనడా కూడా అదేబాటలో పయనిస్తుందని, పాలస్తీనాను గుర్తించిన మూడవ జి–7 దేశం తమదేనని ప్రధానమంత్రి మార్క్ కార్నీ ప్రకటించారు. 193దేశాలలో 147 దేశాలు ఇప్పటికే లాంఛనంగా పాలస్తీనాను స్వయంప్రతిపత్తిగల దేశంగా గుర్తించాయి.

## ఇజ్రాయెల్‌లో మిన్నంటిన నిరసన ప్రదర్శనలు

### స్తంభించిన ప్రధాన రహదారులు, కూడళ్ళు
### ఒప్పందం చేసుకోవాలని నెతన్యాహూపై ఒత్తిడి




**టెల్‌అవీవ్:** హమాస్ చెరలో ఉన్న బందీలను విడుదల చేయాలని, కాల్పుల విరమణ ఒప్పందం చేసుకోవాలని నెతన్యాహూ ప్రభుత్వంపై ఒత్తిడిచేస్తూ ఇజ్రాయెల్ వ్యాప్తంగా మంగళవారం నిరసనలు మిన్నంటాయి. దక్షిణగాజాలోని నస్సెర్ ఆసుపత్రిపై ఐడిఎఫ్ భీకర హింసాత్మకదాడికి పాల్పడిన మరునాడే ఇజ్రాయెల్ అంతటా నిరసన వెల్లువ పెల్లుబికింది. అనేక ప్రాంతాలలో రోజంతా నిరసనలు కొనసాగాయి. కాల్పుల విరమణను ఖరారు చేయాలని డోనాల్డ్ ట్రంప్‌ను కోరుతూ ప్రదర్శకులు నినాదాలు చేశారు. దేశంలో దాదాపు ప్రధాన రహదారులన్నీ స్తంభించిపోయినట్లు పోలీసులు చెప్పారు. ప్రజలకున్న నిరసన తెలియజేసే హక్కును కాపాడేందుకు తాము అన్ని భద్రతా చర్యలూ తీసుకున్నట్లు పోలీసులు చెప్పారు. బందీల బంధువులు, గల్లంతైనవారి కుటుంబీకులు, మిత్రుల వేదిక ఆధ్వర్యంలో టెల్‌అవీవ్‌లో భారీ నిరసన ప్రదర్శనలు జరిగాయి. మంగళవారం రోజంతా నగరం అంతటా ఈ ప్రదర్శనలు కొనసాగాయి. సాయంత్రం టెల్‌అవీవ్‌లోని సావిడోర్ ట్రైన్ స్టేషన్ నుండి హోస్టేజెస్ స్కేవర్ వరకు జరిగిన భారీ ప్రదర్శన, సమావేశం తర్వాత నిరసనలు ముగిశాయి. ఉదయం ఆరున్నర గంటలకే ప్రదర్శకులు వీధుల్లోకి దూసుకువచ్చారు. అన్ని ప్రధాన కూడలి ప్రాంతాలకూ చేరుకుని వాహనాలు కదలకుండా అడ్డుకున్నారు. ట్రాఫిక్‌ను స్తంభింపజేశారు. తక్షణం యుద్ధం నిలిపివేయాలని, బందీల విడుదలకు ఒప్పందం చేసుకోవాలని కోరారు. రహదారులపై రాకపోకలు స్తంభించాయి. 30 కి.మీ మేరకు ట్రాఫిక్ రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. అయోలైన్ హైవేపై దక్షిణ దిశగా వెళ్ళే వాహనాలను ప్రదర్శకులు నిలిపివేశారు. రాజధాని టెల్‌అవీవ్‌లో అమెరికా దౌత్య కార్యాలయంవద్ద ప్రదర్శకులు గుమిగూడి ఇజ్రాయెల్ పతాకాలను ప్రదర్శిస్తూ, నిరసన తెలియజేశారు. బందీల విడుదలకు తక్షణం ఒప్పందం చేసుకోవాలని, అసలు హమాస్ చెరలో ఎంత మంది బందీలు సజీవులుగా ఉన్నారో తాజా గణాంకాలు విడుదల చేయాలని కోరుతూ ప్రదర్శకులు వేలాదిమంది వీధుల్లోకి వచ్చారు. గడచిన మూడు నెలలుగా బందీల బంధువులు, మిత్రుల వేదిక నెతన్యాహూ ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి పెంచింది. హమాస్ ఉగ్రవాదులు తమ చెరలో ఉన్న బక్కచిక్కిన బందీల వీడియోలను విడుదల చేయడంతో బందీల బంధువులలో ఆందోళన తీవ్ర భావోద్వేగాలు పెల్లుబుకుతున్నాయి. బందీలు సజీవంగా ఉండగానే వారి సమాధులను వారిచేతే తవ్వించే దృశ్యాలున్న వీడియోలు పోస్టు చేయడంతో బంధువులు తమ అందోళన ఉద్ధృతి పెంచారు. నెతన్యాహూ తక్షణం హమాస్‌తో ఒప్పందం చేసుకుని యుద్ధం విరమించాలని కోరుతూ ఇటీవల తరచు నిరసనలు తెలియజేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలలో కూడా గాజాలో యుద్ధం విరమించాలని నెతన్యాహూపై ఒత్తిడిచేస్తూ ప్రతిరోజూ నిరసన ప్రదర్శనలు జరుగుతున్నప్పటికీ గాజా ఆక్రమణ ప్రణాళికను ఐడిఎఫ్ ముందుకు తీసుకువెళుతూ పాలస్తీనా ప్రజలను ఆకలితో మార్చిచంపే కుట్రలకు పాల్పడుతున్నది. గాజాలో 50 మంది బందీలు ఇంకా ఉండిపోయారు. కానీ వీరిలో సగం మంది మరణించారని ఇజ్రాయెల్ అధికారికంగా నమ్ముతున్నది. ఇటీవల ట్రంప్ ఒక ప్రకటన చేస్తూ, కేవలం 20 మంది బందీలు మాత్రమే సజీవంగా ఉన్నారని, వీరిలో మరో ఇద్దరు తాజాగా మరణించారని ప్రకటించడంతో ఇజ్రాయెల్‌లో బందీల బంధువులు, మిత్రు ల వేదిక నిజమైన గణాంకాలు వెల్లడించాలంటూ నిరసన ప్రదర్శనలను ఉద్ధృతం చేసింది.

## యుద్ధ నివారణకు భారత్ తనవంతు కృషి చేయాలి:జెలెన్‌స్కీ



**కీవ్:** రష్యా చేస్తున్న యుద్ధాన్ని నివారించడంలో భారతదేశ తనవంతు కృషి చేయాలని, తాము ఈ కృషిని పరిగణనలోకి తీసుకుంటామని ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ పేర్కొన్నారు. యుద్ధాన్ని నివారించేందుకు ఉక్రేన్‌కు భారతదేశం కూడా సహకరించాలని కోరారు. ఉక్రేన్ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ సందేశం పంపారు. ఇందుకు ప్రతిగా ఎక్స్ వేదిక ద్వారా మోదీకి జెలెన్‌స్కీ కృతజ్ఞతలు తెలియజేస్తూ పైవిధంగా స్పందించారు. శాంతి సాధనకు, చర్చల ద్వారా సమస్యల పరిష్కారంపట్ల భారత్ కనబరుస్తున్న చిత్తశుద్ధి ఎంతో శ్లాఘనీయమైనదని ఆయన ప్రశంసించారు. "రష్యా చేస్తున్న భీకర యుద్ధాన్ని ఎంతో హుందాగా, మర్యాదకరమైన పద్ధతులలో ముగించి, దీర్ఘకాలిక శాంతి సాధించేందుకు ఇప్పుడు యావత్ ప్రపంచం పోరాటం చేస్తోంది, ఇందులో భారతదేశం చేసే కృషిని కూడా ఉక్రేన్ దేశం పరిగణనలోకి తీసుకుంటుంది" అని జెలెన్‌స్కీ ఎక్స్ పోస్టింగ్‌లో పేర్కొన్నారు. "తీసుకునే ప్రతి నిర్ణయం దౌత్యమార్గాలను మరింత పటిష్టవంతం చేసేందుకు దారితీస్తాయి, ఇది యూరప్ ప్రాంత భద్రతకు మాత్రమే కాకుండా, ఇండో–పసిఫిక్, అంతకుమించి ఇతర ప్రాంతాల భద్రతకు కూడా ఉత్తమస్థాయిలో భద్రతకు ఉపయోగపడుతుంది" అని పేర్కొన్నారు. ఈనెల 16వ తేదీన ఉక్రేన్ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మోదీ ఆ దేశ ప్రజలకు, అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఉక్రేన్ శాంతి సాధించి అభివృద్ధి మార్గంలో పయనించాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. జెలెన్‌స్కీ పోస్టింగ్‌పై మోదీ కూడా ప్రతిస్పందించారు. భారత్–ఉక్రేన్ మధ్య సన్నిహిత సంబంధాలు నెలకొనేందుకు మన ఉమ్మడి చిత్తశుద్ధికి ఎంతో విలువ ఇస్తామని మోదీ పేర్కొన్నారు.

## శ్రీలంక మాజీ అధ్యక్షుడు విక్రమసింఘేకు బెయిలు



**కొలంబో:** ప్రభుత్వ నిధుల దుర్వినియోగం కేసులో అరెస్టైన శ్రీలంక మాజీ అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘే (76)కు బెయిలు లభించింది. ముగ్గురు ష్యూరిటీలు, 50 లక్షల శ్రీలంక రూపాయల పూచీకత్తుపై ఆయనను విడుదల చేయాలని కొలంబో ఫస్ట్ మెజిస్ట్రేట్ నిలుపులి లంకపుర మంగళవారంనాడు ఆదేశించారు. కొలంబో నేషనల్ ఆసుపత్రిలోని ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో చికిత్సపొందుతున్న విక్రమసింఘే ఆసుపత్రి పడకమీద నుండే దృశ్యమాధ్యమ పద్ధతిలో కోర్టు విచారణ ప్రక్రియలో పాల్గొన్నారు. ఐతే విక్రమసింఘేకు బెయిలు మంజూరు చేయడాన్ని ప్రభుత్వ తరపు న్యాయవాది తీవ్రంగా వ్యతిరేకించారు. విచారణ పూర్తయ్యేవరకూ ఆయన రిమాండ్‌లో ఉండాల్సిందేనని పట్టుపట్టారు. ఐతే ఈ కేసును తిరిగి అక్టోబరు నెలాఖరులో విచారణకు చేపడతామని న్యాయమూర్తి ప్రకటించారు. విక్రమసింఘే తరపున కోర్టుకు హాజరైన న్యాయవాది థిలక్ మరపన, అనుజ ప్రేమరత్నే న్యాయమూర్తి ఎదుట వాదిస్తూ, విక్రమసింఘే గుండెలకు రక్తం సరఫరా చేసే నాలుగు నాళాలు మూసుకుపోయాయని, సరిగ్గా పనిచేయడంలేదని, ఆయన ఆరోగ్య పరిస్థితి బాగోలేదని తెలియజేశారు. భారీభద్రతా ఏర్పాట్లమధ్య కోర్టులో ఈ కేసు విచారణ జరిగింది. ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేశారన్న ఆరోపణలపై సిఐడి అధికారులు ఈనెల 22వ తేదీన విక్రమసింఘేను అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. తొలుత ఆయనను ప్రిజన్ ఆసుపత్రిలో చేర్చారు. అక్కడి నుండి నేషనల్ ఆసుపత్రి ఐసియుకు తరలించారు. 2023లో కుటుంబ సమేతంగా బ్రిటన్ పర్యటన సందర్భంగా 16.6 మిలియన్ శ్రీలంక రూపాయలను దుర్వినియోగం చేశారన్నది ఆయనపై ప్రధాన ఆరోపణ.

## 30 నుంచి అసెంబ్లీ

(మొదటి పేజీ తరువాయి)

1 గంటకు అసెంబ్లీ కమిటీ హాలులో జరుగనుంది. మంత్రివర్గ సమావేశం నిర్వహణకు తగిన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు మంగళవారం సర్క్యులర్ జారీ చేశారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహణ, వెనుకబడిన తరగతుల (బిసి)కు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడం, కాళేశ్వరంపై జస్టిస్ పిసి.ఘోష్ కమిషన్ నివేదిక, అసెంబ్లీ వర్షాకాల సమావేల నిర్వహణ తేదీల ఖరారు తదితర అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకోవచ్చని సమాచారం. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు హైకోర్టు నిర్ణయించిన కాలపరిమితి సెప్టెంబర్ 30వ తేదీతో ముగియనుంది. ఈ నేపథ్యంలో రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్న బిసి రిజర్వేషన్ బిల్లులు ఆమోదం పొందకపోతే, అధికార కాంగ్రెస్ పార్టీ పరంగా బిసి వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని ఇప్పటికే సూత్రప్రాయంగా నిర్ణయించిన సంగతి తెలిసిందే. అయితే ఈ విషయంపై న్యాయ నిపుణుల అభిప్రాయం తీసుకోవడానికి అధికార కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. మంత్రివర్గ సమావేశానికి ముందు, ఈ కమిటీ తన నివేదికను టిపిసిసికి, అలాగే ప్రభుత్వానికి సమర్పిస్తుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ నివేదికను కేబినెట్ సమావేశంలో చర్చించిన తరువాత ప్రభుత్వం ఈ అంశంపై ఒక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. దీనితో పాటు, కాళేశ్వరంపై జస్టిస్ పిసి.ఘోష్ కమిషన్ నివేదికను కూడా క్యాబినెట్ సమావేశంలో చర్చించి, తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. రైతులకు యూరియా సరఫరా, ఇతర అంశాలపై కూడా ఈ సమావేశంలో చర్చించనున్నారు.

## ఎన్నికలకు వెళదామా? (మొదటి పేజీ తరువాయి)

ఓట్ల కోసం మసీదులకు పోయి ప్రార్థనలు చేస్తున్నట్లు నటించి జీవించే పార్టీ కాంగ్రెస్ అని విమర్శించారు. బరాబార్ హిందూ ధర్మం కోసం పనిచేస్తానని హిందూ ఓటు బ్యాంకుతోనే తాను కరీంనగర్ ఎంపిగా గెలిచానని, గల్లా ఎగిరేసి గర్వంగా చెబుతానని అన్నారు. తెలంగాణలోనూ హిందూ ఓటు బ్యాంకును తయారు చేస్తానని స్పష్టం చేశారు.

రాష్ట్రంలో అధికారంలోఉన్న కాంగ్రెస్ పార్టీ దొంగ ఓట్ల జాబితాను బయటపెట్టాలని, దొంగ ఓట్లను తొలగించాలని ఎలక్షన్ కమిషన్‌కు లేఖ రాయాలని డిమాండ్ చేశారు. అనంతరం అసెంబ్లీ రద్దుచేసి ఎన్నికలు నిర్వహించాలని... ఒకవేళ కాంగ్రెస్ ఎన్నికల్లో గెలిస్తే తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని.. ఇందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమా..? అంటూ సవాల్ విసిరారు. పార్లమెంట్ ఎన్నికల్లో 2 లక్షల 25 వేల భారీ మెజారిటీతో గెలిస్తే దొంగ ఓట్లతో గెలిచావంటూ కరీంనగర్ ప్రజలను అవమాన పరుస్తున్నారని మండిపడ్డారు. ఓట్ల చోరీ జరిగిందని చెబుతున్న పీసీసీ అధ్యక్షునికి ఓట్ల గురించి ఏం తెలుసని ఎద్దేవా చేశారు. దొంగ ఓట్లతో గెలిస్తే 8 ఎంపీలు మాత్రమే ఎందుకు గెలుస్తం.. మొత్తం ఎంపీలు మేమే గెలిచేవాళ్లం కదా..? అని అన్నారు. కర్నాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారంలోకి ఎలా వస్తుందని ప్రశ్నించారు.

గ్రామ పంచాయతీలకు కాంగ్రెస్ ప్రభుత్వం 20నెలల పాలనలో నయాపైసా ఇవ్వలేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధుల కోసమే పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తున్నారని.. పంచాయతీ ఎన్నికలపై కాగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదని విమర్శించారు.

## అల్పపీడనం (మొదటి పేజీ తరువాయి)

జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేశామన్నారు. కొత్తగూడెం, హన్మకొండ, జనగాం, కామారెడ్డి, కరీంనగర్, ఖమ్మం, ఆసిఫాబాద్, మంచిర్యాల, నల్లగొండ, పెద్దపల్లి, సూర్యాపేట, వరంగల్, భువనగిరి, మహబూబాబాద్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయనే అంచనా ఉందన్నారు. బుధవారం కొత్తగూడెం, భూపాలపల్లి, ఆసిఫాబాద్, మంచిర్యాల, ములుగు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయన్నారు. గురువారం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయన్నారు. పలుచోట్ల ఉరుములు, మెరుపులు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని తెలిపారు. శుక్రవారం ఆదిలాబాద్, కొత్తగూడెం, హన్మకొండ, హైదరాబాద్, జగిత్యాల, జనగాం, భూపాలపల్లి, కామారెడ్డి, కరీంనగర్, ఖమ్మం, ఆసిఫాబాద్, మహబూబాబాద్, మంచిర్యాల, మెదక్, మేడ్చల్ మల్కాజిగిరి, ములుగు, నల్లగొండ, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, రంగారెడ్డి, సంగారెడ్డి, సిద్దిపేట, సూర్యాపేట, వికారాబాద్, వరంగల్, భువనగిరి జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. శనివారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, భూపాలపల్లి, కామారెడ్డి, ఆసిఫాబాద్, మంచిర్యాల, మెదక్, ములుగు, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని తెలిపారు.

## 51 ఏళ్ల జైలు (మొదటి పేజీ తరువాయి)

చెందిన మైనర్ బాలికపై అత్యాచారం కేసు మూడున్నర ఏండ్లు అనంతరం ఫోక్సో న్యాయస్థానం ఇన్చార్జి రోజా రమణి మంగళవారం తుది తీర్పు వెల్లడించిందన్నారు.ఘటనలో నిందితుడు ఖయ్యూం పై న 2015 న తిప్పర్తి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి విచారణ అనంతరం కోర్టులో ఛార్జ్ సీట్ దాఖలు చేయగా మంగళవారం ఏడిజె2 కమ్ ఎస్‌సి,ఎస్‌టి కోర్టు అత్యాచారం ఫోక్సో కేసుల కోర్ట్ నిందితున్ని దోషిగా నిర్ధారించి,సెక్షన్376 ఐపిసి అండ్ పోక్సో చట్టం2012 యాక్ట్ ప్రకారం 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష,రూ.25వేలు జరిమానా అదేవిదంగా ఎస్‌సి,ఎస్‌టి చట్టం ప్రకారం 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష,రూ.25వేలు జరిమానాతో పాటు మైనర్ బాలిక కిడ్నాప్ కింద 10 సంవత్సరాల కారాగార శిక్ష,రూ.25వేలు జరిమానా,నేరమైన బెదిరింపుకు1 సంవత్సరపు కారాగార శిక్ష రూ.5వేలు జరిమానా మొత్తం గా 51 సంవత్సరాల కారాగార శిక్ష రూ.85వూలు జరిమానా విదించడం జరిగింది.కేసులో బాధితురాలికి రూ.7 లక్షల రూపాయల పరిహారంగా జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ద్వారా అందించాలని తీర్పు వెలువడిందని తెలిపారు.ఈ కేసులో సరి అయిన సాక్ష్యదారలు సేకరించి కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు సమర్పించి నిందితునికి శిక్ష పడే విధంగా చేసిన ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ డిఎస్‌పి వెంకట్ రెడ్డి, ఏఎస్‌ఐ మట్టయ్య,ప్రాసెక్యూషన్ కు సహకరించిన నల్లగొండ డిఎస్‌పి కె.శివరాం రెడ్డి, సిఐ కె.కొండల్ రెడ్డి, తిప్పర్తి ఎస్ఐ వి.శంకర్,పబ్లిక్ ప్రాసిక్యూటర్స్‌వేముల రంజిత్ కుమార్, సిడిఓ కిరణ్ కుమార్ ,లైజన్ అధికారులు పి.నరేందర్, మల్లికార్జున్ లను జిల్లా ఎస్‌పి అభినందించారు.

## స్థానిక కసరత్తు (మొదటి పేజీ తరువాయి)

రూపొందించనున్నారు. ఆగస్టు 28వ తేదీ లోపు గ్రామ పంచాయతీల ముసాయిదా ఓటర్ల జాబితా తయారీ చేసి గ్రామ పంచాయతీ, మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వార్డుల వారీగా ఓటర్ల జాబితాలను ప్రదర్శించాలని నోటిఫికేషన్‌లో స్పష్టం చేశారు. ఆగస్టు 29వ తేదీన ఎంపిడిఓల ద్వారా మండల స్థాయిలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించనున్నారు. ఆగస్టు 30వ తేదీ న ఓటర్ల జాబితాపై అభ్యంతరాల స్వీకరిస్తామని ఎన్నికల సంఘం వెల్లడించింది. అలాగే ఆగస్టు 31వ తేదీన జిల్లా పంచాయతీ అధికారి గ్రామ పంచాయతీ ల వార్డుల వారీగా ఫొటో ఓటర్ల తుది జాబితాలను ప్రచురణ చేస్తారని ఎన్నికల సంఘం తెలిపింది. ఈ ఏడాది సెప్టెంబర్ 30వ తేదీలోపు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని తెలంగాణ హైకోర్టు ఆదేశించిన విషయం తెల్సిందే. గడువు ముగిసిన స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడం లేదంటూ పలువురు తెలంగాణ హైకోర్టులో పిటిషన్‌లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లను విచారించిన హైకోర్టు సెప్టెంబర్ 30వ తేదీలోపు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించింది.

## సిద్ధంగా ఉండు (మొదటి పేజీ తరువాయి)

ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో చర్చిద్దామా? అని నిలదీశారు. కేంద్రం నుండి రాష్ట్రానికి నిధులు, ప్రాజెక్టుల కేటాయింపులో అన్యాయం జరగుతుందని ప్రశ్నిస్తే సమాధానం చెప్పలేక దాట వేస్తూ పక్కదారి పట్టిస్తున్నారని ఆయన విమర్శించారు. స్థానిక ఎన్నికల్లో బిజెపికి ఘోర పరాజయం తప్పదని, రాజకీయ సన్యాసం తీసుకోవడానికి బండి సంజయ్ సిద్ధంగా ఉండా లన్నారు. ఈ మేరకు మహేష్ కుమార్‌గౌడ్ మంగళవారం ఒక ప్రకటన విడేదల చేశారు. 'కేంద్ర మంత్రిగా తెలంగాణకు, కరీంనగర్‌కు ఏమీ చెశారో లెక్కలు చెప్పగలవా? కరీంనగర్‌కు ఎన్ని ప్రాజెక్టులు తెచ్చారు? ఎంతమంది యువత కు ఉద్యాగాలు ఇప్పించారు? బిసిలకు 42 శాతం రిజర్వేషన్లపై కేంద్రం అన్యాయం చేస్తున్నా బిసి బిడ్డగా ఎందుకు ప్రశ్నించడంలేదు? మతం పేరుతో గెలుస్తూ భావోద్వేగాలను రెచ్చగొడు తుంది మీరు కాదా?' ముస్లిం పేరుతో బిసి రిజర్వేషన్లు అడ్డుకుంటున్న బిజెపి నేతలు బిజెపి అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ముస్లింలు బిసిల్లో ఉండడంపై ఏమి సమాధానం చెబుతారు? అక్కడ ముస్లింలకు రిజర్వేషన్లు ఇస్తే అభ్యంతరం లేనిది తెలంగాణాలో ఇస్తే తప్పేటి? ముస్లింలలో పేదలు లేరా? వారికి న్యాయం జరగకూడదా? అని బండి సంజయ్‌కి మహేష్‌కుమార్ గౌడ్ ప్రశ్నల వర్షం కురిపించారు. 'ఈ ప్రశ్నలకు సమాధానం లేని బండి సంజయ్ రాజకీయ సన్యాసం తీసుకోవడానికి సిద్ధంగా ఉండాలి. సంజయ్‌కి సన్యాసం ఖాయం. మఠంలో ఆయనకు స్థిర నివాసం ఖాయం' అని ఆయన పేర్కొన్నారు. ఓట్ల చోరీపై రాహుల్ గాంధీ నిర్దిష్టంగా ఆధారాలతో నిరూపించడంతో సమా ధానం చెప్పుకులేక బిజెపి విషయాన్ని పక్కదారి పట్టిస్తుందన్నారు.

యూరియా కొరతతో రైతులు అనేక అవస్థలు పడుతుంటే చొరవ తీసుకొని మాట్లాడలేని కేంద్ర మంత్రి బండి సంజయ్ అని మహేష్‌కుమార్ విమర్శించారు. బండి సంజయ్ కేంద్ర హోం మంత్రిగా ఉండి రోహింగ్యాల గురించి మాట్లాడితే ఎలా అని ప్రశ్నించారు. బండి సంజయ్ కార్పొరేటర్ కాదని, కేంద్ర మంత్రి అనే సంగతి మర్చిపోవద్దని, కరీంనగర్ ఎంఎల్‌ఏగా ఎన్నిసార్లు పోటీ చేసి ఓడిపోయారో గుర్తు లేదా అన్నారు.

## కాపాడుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

బహిరంగ ర్యాలీలో రాహుల్ పేర్కొన్నారు. బిజెపి నాయకులు ఎన్నికల కమిషన్ ద్వారా ఓటు చోరీలో మునిగిపోతున్నారని మండిపడ్డా రు. ప్రజలు తమ ఓటు హక్కును కాపాడుకోవడానికి, భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవడానికి ముందుకు రావాలి అని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు అన్నారు. ప్రజలు తమ ఓటు హక్కును కోల్పోతే, రాజ్యాంగాన్ని రక్షించలేరని గుర్తుంచుకోవాలన్నారు. బిజెపికి సహాయం చేయడానికి బిహార్‌లోని 65 లక్షల మంది ఓటర్ల పేర్లను ఇసి ఓటర్ల జాబితా నుండి తొలగించిందని, ఇప్పుడు 65 లక్షల మంది ఓటర్లను చేర్చుతామని ఆయన అన్నారు. బిజెపి ప్రభుత్వం మరో 40–50 సంవత్సరాలు కొనసాగుతుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా చెప్పారని, వారు 'ఓటు చోరీ'లో పాల్గొంటున్నందున ఆయన అలా చెప్పారని ఇప్పుడు తమకు అర్థమైందని ఎద్దేవా చేశారు. అది గుజరాత్ నుండే ప్రారంభమైందన్నారు. బిజెపి 'ఓటు దొంగతనం' చేసిందని తాను చేసిన ఆరోపణపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లేదా అమిత్ షా ఒక్క మాట కూడా మాట్లాడలేదన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ రాజ్యాంగాన్ని గౌరవించదని, ఎందుకంటే ప్రతి ఒక్కరికి సమాన హక్కులను ఇవ్వడం వారికి నచ్చదని విమర్శించారు. కాగా, 'ఓటర్ అధికార్ యాత్ర'లో కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా మంగళవారం తన సోదరుడితో కలిసి పాల్గొన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆర్‌జెడి నాయకుడు తేజస్వి యాదవ్, ఇండియా కూటమికి చెందిన ఇతర ప్రతినిధులతో పాటు వాద్రా, గాంధీ ఎస్‌యువి పైకప్పుపై కూర్చుని కనిపించారు. ఒక రోజు విరామం తర్వాత మంగళవారం యాత్ర తిరిగి ప్రారంభమైంది. ఆదివారం అరారియాలో విలేకరుల సమావేశంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ బిహార్‌లోని అన్ని ఇండియా కూటమి నియోజకవర్గాలు రాబోయే అసెంబ్లీ ఎన్నికల కోసం ఐక్యంగా పనిచేస్తున్నాయని, ఫలితాలు ఫలవంతంగా ఉంటాయని ఆయన నొక్కి చెప్పారు.

## అదనపు సుంకాలు (మొదటి పేజీ తరువాయి)

ఈ ముసాయిదా ఉత్తర్వు జారీ చేసింది. మనదేశం నుండి ఎగుమతయ్యే 48.2 బిలియన్ డాలర్లు కంటే ఎక్కువ విలువైన సరుకులపై ఈ అదనపు సుంకాల భారం పడుతుంది. భారత్ నుండి అమెరికాలోకి ప్రవేశించే మొత్తం సరుకులపై కొన్ని మినహాయింపులతో 50 శాతం సుంకాలను ఇకపై చెల్లించాల్సి ఉంటుంది. ట్రంప్ విధించిన 25 శాతం అదనపు సుంకాలు ఆగస్టు ఏడో తేదీనుండి అమలులోకి వచ్చాయి. రష్యాతో భారీ వాణిజ్యం చేస్తూ ఉక్రేన్‌లో యుద్ధానికి పరోక్షంగా భారత్ ఆజ్యం పోస్తోందని ఆరోపిస్తూ విధించిన మరో 25 శాతం జరిమానా సుంకాలు ఆగస్టు 27 నుండి అమలులోకి వస్తాయని ప్రకటించారు. రష్యా నుండి ముడి చమురు, సైనిక సామాగ్రి దిగుమతి చేసుకుంటున్నందుకుగాను ఈ జరిమానా విధించారు. అమెరికా కాలమానం ప్రకారం మంగళవారం అర్థరాత్రి దాటిన తర్వాత 12.01 గంటల నుండి (ఆగస్టు 27) అమెరికాలోకి ప్రవేశించే భారత సరుకులపై ఈ పెనాల్టీ సుంకాలు అమలులోకి వస్తాయని ప్రకటించింది. టెక్స్‌టైల్స్, క్లోతింగ్,వజ్రాలు, ఆభరణాలు, రొయ్యలు, తోలు వస్తువులు, చెప్పులు, జంతు ఉత్పత్తు, రసాయనాలు, ఎలక్ట్రికల్స్, మెకానికల్ యంత్రాల దిగుమతులపై అమెరికా ఈ అదనపు సుంకాలను వసూలు చేస్తుంది. ఔషధరంగం, ఇంధన ఉత్పత్తులు, ఎలక్ట్రానిక్ వస్తువులు కూడా ఈ సుంకాల పరిధిలోకి వస్తాయి. ఐతే పైన పేర్కొన్న అమెరికా కాలమానం కంటే ముందుగానే నౌకల్లోకి ఎగుమతి చేసిన సరుకులకు ఈ సుంకాల నుండి మినహాయింపు లభిస్తుందని కూడా అమెరికా జారీ చేసిన ముసాయిదా నోటీసు వెల్లడించింది.

ప్రపంచంలో అమెరికాతో వాణిజ్యం చేస్తున్న దేశాలలో బ్రెజిల్‌పై అత్యధికంగా ట్రంప్ సుంకాలు విధించారు. ఆ తర్వాత రెండో స్థానంలో భారత్‌పై భారీగా సుంకాలు విధిం చారు. మిగిలిన దేశాలన్నీ అమెరికా వసూలు చేసే సుంకాలలో తర్వాతస్థానాల్లోనే ఉన్నాయి. భారత వాణిజ్య మంత్రిత్వశాఖ సమాచారం ప్రకారం 48.2 బిలియన్ డాలర్లు విలువైన సరుకులపై ఈ అదనపు సుంకాలభారం పడుతుంది. ఈ విధంగా సుంకాలు విధించడం అన్యాయం, అక్రమం అని భారతదేశం ఆగస్టు ఆరోతేదీన ప్రకటించింది. అన్నిదేశాలూ తమ తమ ప్రయోజనాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నాయని, భారత్ కూడా అదే మార్గంలో ప్రయాణించిందని వివరణ ఇచ్చింది. 2021–22 నుండి భారతదేశం అమెరికాకు అతిపెద్ద వాణిజ్యభాగస్వామిగా కొనసాగుతోంది. 2024–25లో రెండు దేశాల మధ్యా ద్వైపాక్షిక వాణిజ్య ఎగుమతులు 131.8 బిలియన్ డాలర్లుకు చేరుకున్నాయి.

## హైకోర్టు గ్రీన్ సిగ్నల్ (మొదటి పేజీ తరువాయి)

చేశారు. 2020లో వెలువడిన జీవోను రద్దు చేయాలని కోరగా అదే ఏడాది నవంబర్‌లో హైకోర్టు స్టే ఇచ్చింది. ఆర్‌ఓఆర్ యాక్ట్ 71 రద్దు అవ్వడంతో భూభారతి చట్టం అమల్లోకి వచ్చిందని ప్రభుత్వం చెప్పింది. పాత చట్టం మేరకు వేసిన పిల్‌లోని స్టే ఎత్తివేయాలని కోరింది. ఈ మేరకు అనుబంధ పిటిషన్ వేసింది. కొత్త చట్ట నిబంధనలకు అనుగుణంగా తాము కూడా సవరణ పిటిషన్ వేశామని, స్టేను కొనసాగించాలని పిటిషనర్ కోరారు. దీనిపై స్పందించిన హైకోర్టు, పాత చట్టంలోని నిబంధనలను సవాల్ చేసిన పిల్ విషయంలో కొత్త చట్ట నిబంధనలను కూడా ఎందుకు ఉత్తర్వులు ఎలా కోరతారని ప్రశ్నించింది. గతంలో పలుసార్లు వాయిదాలు తీసుకుని ఇప్పుడు సవరణ పిటిషన్ వేయడంలో ఉద్దేశ్యం ఏమిటని కూడా అడిగింది. ఇప్పుడు సవరణ పిటిషన్‌ను అనుమతిస్తే, మరింత జాప్యం అవుతుందని చెప్పింది. పాత చట్టం స్థానంలో కొత్త చట్టం వచ్చినందున కొత్తగా పిల్ దాఖలు చేసుకోవచ్చునని పిటిషనర్‌కు వెసులుబాటు కల్పించింది. పాత పిల్‌లోని విషయాలను ఆధారంగా చేసుకుని కొత్త చట్టంలోని అంశాలపై ఉత్తర్వులు కోరడం సబబు కాదని పేర్కొంది కొత్త అంశాలతో దాఖలు చేసిన సవరణ పిటిషన్‌ను అనుమతి ఇవ్వలేమని వెల్లడించింది. కొత్త చట్టం తీసుకువచ్చిన ప్రభుత్వం సన్న, మధ్యతరగతి రైతులకు చెందిన సాదా బైనామాల క్రమబద్ధీకరణకు గత మధ్యంతర ఉత్తర్వులు అడ్డంకిగా ఉన్నాయని చెబుతోందని గుర్తు చేసింది. పాత చట్టం మేరకు దాఖలైన పిల్‌ను విచారణ కొనసాగింపు వ్యర్థం అవుతుందని స్పష్టం చేసింది. దీంతో సాదా జైనామాల క్రమబద్ధీకరణకు అవరోధాలు తొలగిపోయాయి. ఈ మేరకు చీఫ్ జస్టిస్ ఏకే సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్లతో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం తుది ఉత్తర్వులను జారీ చేసింది. పిల్‌పై విచారణను కొనసాగించేందుకు నిరాకరించింది. ఇకపై విచారించాల్సిన అవసరంలేదంది. పాత చట్టానికి బదులుగా వచ్చిన కొత్త చట్ట నిబంధనలను కూడా సవాల్ చేస్తూ పిల్‌ను సవరిస్తూ అనుబంధ అఫిడవిట్ వేశామన్న పిటిషనర్ అభ్యర్థనను తిరస్కరించింది. కొత్త చట్ట నిబంధనలపై పిటిషన్ వేసుకోవచ్చునని హితవు చెప్పింది. సాదా బైనామాల క్రమబద్ధీకరణ జీవోను సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిల్‌ను గతంలో విచారించిన హైకోర్టు, క్రమబద్ధీకరణకు జీవో అమలును నిలిపివేస్తూ. 2020 నవంబర్ 11న మధ్యంతర స్టే ఇచ్చింది. కొత్త చట్టం తెచ్చామని, గతంలోని స్టేను రద్దు చేయాలని కోరుతూ ప్రభుత్వం మధ్యంతర పిటిషన్ దాఖలు చేసింది.దీనితోపాటు ప్రధాన పిటిషన్‌లను కలిపి బెంచ్ విచారణ జరిపి ఈ ఉత్తర్వులను వెలువరించింది. అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి వాదిస్తూ, 2014కు ముందు 12 ఏళ్లుగా సాదా బైనామాల కింద కొనుగోలు చేసిన భూములను క్రమబద్ధీకరణకు ప్రభుత్వం జీవో ఇచ్చిందన్నారు. ప్రభుత్వ గడువు మేరకు సుమారు 9.25 లక్షల అప్లికేషన్లు ప్రభుత్వానికి అందాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా భూభారతి చట్టం తీసుకువచ్చిందని, ఇందులో సెక్షన్ 6 ప్రకారం 2014కు ముందు 12 ఏళ్లపాటు భూమి స్వాధీనంలో ఉన్నవారికి క్రమబద్ధీకరణ చేసేందుకు ఆస్కారం ఉందన్నారు.
పిటిషనర్ తరపు సీనియర్ అడ్వకేట్ ప్రభాకర్ వాదిస్తూ, పాత చట్టంలోని నిబంధనల మేరకు పిల్ వేసిన మాట వాస్తవమేనని, అయితే, ప్రభుత్వం కొత్తగా రూపొందించిన భూభారతి చట్ట నిబంధనను కూడా సవాలు చేస్తూ సవరణ పిటిషన్ వేసినట్లు చెప్పారు. పిల్‌ను విచారించాకే తుది ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. పాత చట్టం బదులు కొత్తచట్టంలోని నిబంధన వచ్చిందని ప్రభుత్వం చెప్పి స్టే ఎత్తివేయాలని కోరడం చెల్లదన్నారు. సవరణ పిటిషన్‌లోని అంశాలను పరిశీలిస్తే స్టే ఎత్తివేయాల్సిన అవసరం లేదన్నారు. సవరణ పిటిషన్‌పై వాదనలకు అనుమతి ఇవ్వాలని కోరారు. కొత్త చట్టంలో కూడా పాతదరఖాస్తులను మాత్రమే అనుమతిస్తున్నారని చెప్పారు. కొత్తవాటిని తీసుకోకపోవడం లేదన్నారు. ఇది వివక్ష కిందకే వస్తుందన్నారు. కొత్తగా పిల్ దాఖలు చేస్తామని, కనీసం వారం రోజుల వరకు సాదా బైనామాల క్రమబద్ధీకరణకు ఆదేశాలు ఇవ్వొద్దని కోరారు. ఇరుపక్షాల వాదనల తర్వాత హైకోర్టు పిల్‌పై విచారణ అవసరం లేదని చెప్పి గతంలోని స్టేను ఎత్తివేయడంతో సాదా జైనామాల క్రమబద్ధీకరణకు అడ్డంకులు తొలగిపోయాయి.

భూభారతి చట్టం ద్వారా సాదా బైనామాల దరఖాస్తులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటించారు. సాదా బైనామాల దరఖాస్తులను పరిష్కరించి, పేదలకు న్యాయం చేయాలన్న ఆలోచనతో తమ ప్రభుత్వం నిరంతరం హైకోర్టులో కేసుకు సంబంధించిన అంశాలపై ప్రత్యేక కృషి చేసిందని పేర్కొన్నారు. సాదాబైనామాలపై ఉన్న స్టేను హైకోర్టు తొలగించిన నేపథ్యంలో లక్షలాది మంది పేద ప్రజల కలలను సాకారం చేస్తుందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాదా బై నామాల విషయంలో గత ప్రభుత్వం పేద ప్రజలను నమ్మించి మోసం చేసిందన్నారు. ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించినప్పటికీ 2020 ఆర్ ఓ ఆర్ చట్టంలో ఆ దరఖాస్తుల పరిష్కారానికి మార్గం చూపించలేదని ఆరోపించారు. తద్వారా 9.26 లక్షల దరఖాస్తులు పరిష్కారం కాలేదన్నారు. సాధాబైనాలమకు భూభారతి చట్టంలో స్పష్టమైన నిబంధనలను పొందుపరిచామని, ఇప్పటికే దీనికి సంబంధించిన గ్రౌండ్ వర్క్ పూర్తి చేశామన్నారు. రోల్ మోడల్‌గా నిలిచిన ఈ భూభారతి చట్టం మేరకు రైతులు, ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు సదస్సులు నిర్వహించగా 8.60 లక్షల దరఖాస్తులు వచ్చాయని వివరించారు. ప్రతి దరఖాస్తుకూ పరిష్కారాన్ని చూపించాలనే కృత నిశ్చయంతో తమ ప్రభుత్వం పని చేస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## లొంగిపోయిన ఎనిమిది మంది మావోయిస్టు దళసభ్యులు

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** నిషేధిత మావోయిస్టు పార్టీకి చెందిన ఎనిమిది మంది దళసభ్యులు మంగళవారం ఎస్‌పి రోహిత్ రాజ్ ముందు లొంగిపోయారు. ఈ మేరకు ఎస్‌పి వారిని మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ఆపరేషన్ చేయూతలో భాగంగా పోలీసులు కల్పిస్తున్న సదుపాయాలను తెలుసుకుని నక్సలిజాన్ని వీడి జన జీవన స్రవంతిలో కలిసేందుకు ఎనిమిది మంది లొంగిపోయినట్లు చెప్పారు. ఇప్పటి వరకు 314 మంది లొంగిపోయారని, వారికి ప్రభుత్వం తరుపున పునరావాసం కల్పించామన్నారు. ప్రస్తుతం భద్రాద్రికొత్తగూడెం జిల్లా నుండి ఐదుగురు సభ్యులు మావోయిస్టు పార్టీలో పనిచేస్తున్నారని, దళంలో ఉన్న వారు మావోయిస్టు పార్టీని వీడి కుటుంబ సభ్యులతో కలిసి ప్రశాంతమైన జీవితాన్ని గడిపేందుకు ముందుకు రావాలన్నారు. తక్షణ సహాయం కింద ఒక్కొక్కరికి రూ. 25వేలు చొప్పున మొత్తం రూ.2 లక్షలు ఇచ్చారు. వారి ర్యాంకుల ఆధారంగా మిగతా నగదు, ఆధార్ కార్డులు, బ్యాంకుఖాతాలు ఇచ్చిన తర్వాత బ్యాంకులో జమ చేస్తామని చెప్పారు.

## టియు అభివృద్ధి కోసం రూ.వెయ్యి కోట్లు కేటాయించాలి




ఎఐఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షులు విరాజ్

**ప్రజాపక్షం/జక్రాన్‌పల్లి :** డిచ్‌పల్లి మండలంలోని తెలంగాణ యూనివర్సిటీ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం వెయ్యి కోట్ల ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని ఎఐఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షులు విరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఎఐఎస్ఎఫ్ తెలంగాణ యూనివర్సిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ విద్యా వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేశారని ఆరోపించారు. నూతన జాతీయ విద్యావిధానాన్ని అమలు చేస్తూ, విద్యా ప్రైవేటీకరణ, విద్యా కాషాయీకరణను అమలు చేస్తున్నారని విమర్శించారు. విద్యార్థులు పోరాడి సాధించుకున్న తెలంగాణలో సైతం ప్రజా ప్రభుత్వమని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం విద్యాశాఖ మంత్రి నియమించలేదని ప్రభుత్వ యూనివర్సిటీల పట్ల తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలిపారు.

టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ చేయాలని, లేదంటే యూనివర్సిటీలకు భవిష్యత్ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ పేరుతో నిజామాబాద్ జిల్లాలోని తెలంగాణ యూనివర్సిటీలో మౌలిక సదుపాయాలు లేవని, మెడికల్ ఎమర్జెన్సీ వస్తే నర్స్, డాక్టర్ లేరని, ఎమర్జెన్సీ వాహనం కూడా లేదని ఆరోపించారు. తెలంగాణ యూనివర్సిటీతో రాష్ట్రంలోని ప్రభుత్వ యూనివర్సిటీల పరిరక్షణ, ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యమాలు నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో ఎఐఎస్ఎఫ్ యూనివర్సిటీల ఇన్‌చార్జి రహమాన్, జిల్లా కార్యదర్శి రఘురాం, టియు ఎఐఎస్ఎఫ్ మాజీ నాయకులు భరత్, కన్వీనర్ సంజీవ్, చందు, సాయి, అజయ్, భార్గవి, మోక్షిత్, భీమేష్, ప్రభాస్, పీర్ సింగ్ పాల్గొన్నారు.

## వరల్డ్ ఛాంపియన్ చికితకు సిఎం అభినందన




**ప్రజాపక్షం/హైదరాబాద్:** కెనడాలో జరుగుతున్న ప్రపంచ యూత్ చాంపియనిన్‌షిప్‌లో స్వర్ణ పతకం సాధించి వరల్డ్ చాంపియన్‌గా నిలిచిన పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన చికిత తానిపర్తికి తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అభినందనలు తెలియజేశారు. అండర్ 21 కేటగిరీ ఫైనల్‌లో కొరియాకు చెందిన పార్క్ యెర్పి విజయం సాధించి స్వర్ణం చేజిక్కించుకుని చికిత వరల్డ్ ఛాంపియన్‌గా నిలవడం దేశానికే గర్వకారణమని సిఎం అన్నారు. ఆత్మవిశ్వాసం, ఏకాగ్రత, లక్ష్యాన్ని సాధించాలన్న చికిత సంకల్పం యువతీ యువకులకు స్ఫూర్తిదాయమని అన్నారు. ఆటుపోట్లను తట్టుకుంటూ గ్రామీణ ప్రాంతం నుంచి ఒక్కో మెట్టు ఎక్కుతూ ఆర్చరీలో రాణించిన చికిత భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. చిన్ననాటి నుంచి చికితలోని ప్రతిభను గుర్తించి అందుకు అనుగుణంగా ప్రోత్సహించిన తల్లిదండ్రులకు రేవంత్‌రెడ్డి అభినందనలు తెలియజేశారు.

# మహేంద్ర వర్సిటీలో డ్రగ్స్ కలకలం

## నార్కోటిక్ పోలీసుల వలలో ముఠా

**ప్రజాపక్షం/దుండిగల్ :** దుండిగల్ మున్సిపాలిటీ బహదూరపల్లిలోని టెక్ మహీంద్రా యూనివర్సిటీలో డ్రగ్స్ కలకలం రేపాయి. మంగళవారం యాంటీ ఆక్సిడెంట్ నార్కోటిక్ డీసీపీ సైదులు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో 1.5 కేజీల గంజాయి, 45 గ్రాముల ఓడీ వీడ్, 28 డ్రగ్స్ ప్యాకెట్లు, వెయింగ్ మిషన్, స్మార్ట్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 14 మంది విద్యార్థులను పరీక్షించగా ఐదుగురు విద్యార్థులకు పాజిటివ్ అని నిర్ధారణ అయ్యింది ముగ్గురి ఆటతో విద్యార్థులు, స్థానిక పెడ్లర్స్ కలిసి పెద్ద ఎత్తున డ్రగ్ వ్యాపారమే నడిపారు. ఎట్టకేలకు తెలంగాణ నార్కోటిక్ బృందం జాగ్రత్తగా వారి రహస్య రాకెట్‌ను గుట్టురట్టు చేసింది. ఢిల్లీ, బీదర్‌ల నుంచి గంజాయి, ఓజి వీడ్ కొరియర్ సేవల ద్వారా హైదరాబాద్‌కు తరలించారు. నైజీరియాకు చెందిన నిక్ అనే వ్యక్తి ఎండిఎంఏ మాత్రలు సరఫరా చేస్తూ ఉండగా, దుండిగల్ మహీంద్రా యూనివర్సిటీ విద్యార్థులు భాస్కర్, దినేష్ అతనితో సంప్రదింపులు జరిపారు. ఫోన్‌పే, ఎటిఎం లావాదేవీల ద్వారా చెల్లింపులు చేసి, కొరియర్ ద్వారా వాటిని తెప్పించారు. క్యాంపస్‌లో చదువుతున్న విద్యార్థులని, స్నేహితుల నమ్మకాన్ని ఆయుధంగా మార్చుకొని హాస్టళ్లలో, గుమిగూడి మత్తు పదార్థాలను పంచారు. ఒక్క గ్రాము ఓజి వీడ్‌ను 2,500కి అమ్ముతూ, విద్యార్థులు రోజూ భారీగా ఖర్చు చేస్తు నార్కోటిక్ పోలీసులకు పట్టుబడ్డారు. నిందితులపై పోలీసులు క్రైమ్ నం.8/2025 కింద, సెక్షన్లు 8(సి), 20(బి), 2(బి)(2)(ఏ), 27, 29 ఎన్‌డీపీఎస్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేశారు. డ్రగ్స్ రవాణా, వినియోగం కేసులో ప్రధాన నిర్వాహకుడు మణిపూర్‌కు చెందిన నెవెల్ టోంగ్‌బ్రామ్ (21) , జీడీమెట్లలో నివసించే అంబటి గణేష్ (24) హైదరాబాదులో పంపిణీ కార్యక్రమం చూసే వాడు, ఇక్కడే నివసించే బూసా శివకుమార్ (26) బీదర్, కర్ణాటక నుండి గంజాయి తెచ్చి గణేష్‌కు సరఫరా చేసేవాడు, ఇక ఢిల్లీకు చెందిన మొహమ్మద్ అషర్ జావెద్ (21) క్యాంపస్ డిస్ట్రిబ్యూటర్ పాత్ర పోషించాడు. 1.15 కిలోల గంజాయి, 47 గ్రాముల ఓజి వీడ్, డ్రగ్





ప్యాకింగ్ పౌచ్‌లు, డిజిటల్ తూకం యంత్రం, పలు మొబైల్ ఫోన్లు స్వాధీనం. 50 మంది విద్యార్థులు డ్రగ్స్ వినియోగిస్తున్నట్లు ఈగిల్ గుర్తించిందనీ మత్తు పదార్థాలను సామాగ్రిని ఈగల్ టీం సీజ్ చేసింది. గంజాయి అనేది మత్తు వ్యసనానికి ద్వారం అదే విద్యార్థులను నరక కూపంలోకి నెడుతోందనీ. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, యూనివర్సిటీ అధికారులు, సమాజం కలిసి మాత్రమే యువతను రక్షించగలరు" అని ఈగిల్ అధికారులు విద్యార్థుల తల్లిదండ్రులకు సూచిస్తున్నారు. డ్రగ్ సమాచారాన్ని ఈగల్‌కు (1908, 8712671111) తెలియజేయాలని నార్కోటిక్ బృందం పిలుపునిచ్చింది.


ఫారం - 6
(ప్రాథమిక ప్రకటన)
(తెలంగాణ సవరణ చట్టం 2016 లోని చాప్టర్ III ఎ లోని 10ఎ అనుసరించి)
(చట్టంలోని సెక్షన్-11 క్రింద దీనిలో 10ఎ మినహాయింపు కలదు)
(నిబంధన 6/12 చూడుము)

తెలంగాణ ప్రభుత్వం
రెవిన్యూ (భూసేకరణ) శాఖ

**గెజిట్ నెం. 61/2025** **తేది: 23.08.2025**

**జిల్లా కలెక్టరు యాదాద్రి భువనగిరి**
**ఫైలు: G4/3919/2025** **తేది: 19.08.2025**

**ప్రత్యేక ఉప కలెక్టరు (భూ.సే), యాదాద్రిభువనగిరి**
**ఫైల్ నెం.సి/1189/4/2017** **తేది: 12.08.2025**

తెలంగాణ ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి గారి ఆదేశానుసారం యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం బండకొత్తపల్లి గ్రామములో **విస్తీర్ణం ఎ.1.00 గుంటల** భూమి ప్రజా ప్రయోజనార్ధం JCRGLIP-Phase-III 24 R of L2 of Main Canal Package-7 Nawabpeta Reservoir నిర్మాణములో దిగువ చూపిన భూమి అవసరమైయున్నదని భావించినందున సదరు భూసేకరణ ప్రకటన జారీచేయనైనది.

ప్రభుత్వము ఉత్తర్వుల నెం. 63 1 & CAD (LA.R&R/A2) శాఖ తేది: 29-07-2017 ద్వారా JCRGLIP-Phase-III 24 R of L2 of Main Canal Package-7 Nawabpeta Reservoir కొరకు భూసేకరణ నష్టపరిహారం మరియు పునరుపాధి కల్పన (పారదర్శకత మరియు న్యాయబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు) చట్టం- 2013 లోని చాప్టర్-11 (సామాజిక ప్రభావ లెక్కింపు అధ్యయనం) మరియు పరిరక్షణ) వర్తింపు నుండి మినహాయింపు ఇవ్వనైనది.

చాప్టర్- 111 (ఆహార భద్రత కావున, పైన తెలిపిన భాగముగా JCRGLIP-Phase-III 24 R of L2 of Main Canal Package - 7 Nawabpeta Reservoir నిర్మాణ నిమిత్తం యాదాద్రి భువనగిరి జిల్లా, గుండాల మండలం, బండకొత్తపల్లి గ్రామములో **విస్తీర్ణం ఎ.1.00 గుంటల** భూమి యొక్క వివరములు ఈ దిగువ చూపిన విధముగా భూసేకరణ నిమిత్తం ప్రాథమిక ప్రకటన జారీచేయమైనది.

షెడ్యూల్
గ్రామం: బండకొత్తపల్లి మండలం: గుండాల జిల్లా: యాదాద్రి భువనగిరి

| సర్వే నెం. విస్తీర్ణం | [illegible] | పట్టాదారుని పేరు తండ్రి/ భర్త పేరు | అనుభవదారుని పేరు తండ్రి/ భర్త పేరు | [illegible] | [illegible] | రిమార్కు |
|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 |
| 268/ 0.29 | ఖుష్కి/ పట్టా | మెండే శంకర్ | మెండే శంకర్ | 0.29 | | Court Case |
| 269/ 0.11 | ఖుష్కి/ పట్టా | యస్. సుందీప్‌రెడ్డి | మెండే సుందీప్‌రెడ్డి | 0.11 | | Court Case |
| | | | మొత్తం | 1.00 | | |

భూసేకరణ పునరావాసం మరియు పునస్థాపనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన నష్ట పరిహారాన్నిపొందే హక్కు (తెలంగాణ సవరణ) చట్టం, 2016 (చట్టం 21/2017) ద్వారా సవరించబడిన భూసేకరణ పునరావాసం మరియు పునస్థాపనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన నష్ట పరిహారాన్ని పొందే హక్కు 2013 (కేంద్ర చట్టం 30/2013) యొక్క సెక్షన్ 11(1) యొక్క నిభందనలను అనుసరించి సంబధిత వ్యక్తులు అందరికీ తెలియజేయుటకుగాను ఈ ప్రకటన జారీ చేయడమైనది.

భూమి యొక్క ప్లాన్, ఏదైనా పని దినము మరియు పని వేళలలో **జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి మరియు ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే), ఆర్ అండ్ ఆర్, విభాగము-2, ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, యాదాద్రి భువనగిరి జిల్లా** వారి కార్యాలయములో తనిఖీ చేసుకొనవచ్చును. **తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి గారు, ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సి), విభాగము-2, యాదాద్రి భువనగిరి జిల్లా** గారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూసేకరణకు సంబంధించిన సెక్షన్ 12 ప్రకారం పై తెలిపిన భూములలో ఏదైనా ప్రదేశములో ప్రవేశించి సర్వే భూమి కొలతలు తీసుకొనుటకు మరియు ఇతర పనులు చేపట్టడానికి అనుమతించనైనది.

సెక్షన్ 11(4) ప్రకారం **జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి** గారి అనుమతి లేకుండా ఇట్టి ప్రకటన జారీచేసిన తేదీ నుండి నోటిఫికేషనులో ప్రకటించిన భూములకు సంబంధించి ఎవరూ ఎటువంటి లావాదేవీలు / తాకట్లు మొదలగు చర్యలు చేపట్టరాదు.

సదరు చట్టంలోని సెక్షన్ (15) అనుసరించి ప్రతిపాదిత భూసేకరణపై ఏవైనా అభ్యంతరాలుగానీ, ఆక్షేపణలుగానీ ఉన్నట్లయితే సేకరణలో ఉన్న భూమితో ఎలాంటి సంబంధం ఉన్న వ్యక్తులైనా, పరిహారం నిర్ణయం కొరకు జరిపే సంప్రదింపుల వల్ల ప్రభావితులయ్యే వారెవరైనా ఇట్టి ప్రకటన జారీచేసిన తేదీ నుండి 60 (అరవై) దినములలోపు **జిల్లా కలెక్టరు / అధీకృత అధికారి** గారికి వారి అభ్యంతరములు వ్రాత పూర్వకంగా తెలియజేయవచ్చును.

సం/- ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే), ఆర్ అండ్ ఆర్, విభాగము-2, ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, యాదాద్రి భువనగిరి జిల్లా.
సం/- అదనపు కలెక్టర్, యాదాద్రి భువనగిరి
సం/- జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి

DIPR RO NO. 531/LA/PP/Advt/Pub/2025-26


# తెలంగాణ విద్యుత్ విధానాలు భేష్



డాక్టర్ జి.చిన్నారెడ్డితో అమెరికా ప్రముఖ విద్యుత్ రంగ నిపుణులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ విధానాలు చాలా బాగున్నాయని తెలంగాణ రాష్ట్రానికి వచ్చిన అమెరికా ప్రతినిధి బృందం కొనియాడిం ది. తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, సిబ్బంది నైపుణ్యాన్ని ప్రశంసించింది. ఇక్క డి విద్యుత్ పద్ధతులను అమెరికాలో అమలు చేసేందుకు తమ దేశ ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామని అమెరికా దేశ ప్రముఖ విద్యుత్ రంగ నిపుణులు ఎడ్ స్కాట్, మైక్ హెండార్సన్, కాన్ స్టసిరెన్, బడ్ ఏరూక, వంగూర్ అమర్‌నాథ్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ విధానాలు, టెక్నాలజీ, విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, నిపుణులైన విద్యుత్ ఇంజనీర్లు, సిబ్బంది పని తీరు అమెరికా దేశానికి స్ఫూర్తిదాయకమని వారు తెలిపారు. హైదరాబాద్‌లోని జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డితో అమెరికా విద్యుత్ నిపుణుల బృందం మంగళవారం సమావేశమైంది. తెలంగాణ రాష్ట్రానికి అమెరికా నూతన టెక్నాలజీని అందజేస్తామని వారు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న విద్యుత్ విధానాలపై చిన్నారెడ్డితో అమెరికా బృందం సభ్యులు చర్చించారు. అనంతరం చిన్నారెడ్డి నేతృత్వంలోని అమెరికా బృందం సభ్యులు ఎస్‌పి, డిసిఎల్ సిఎండి ముసారఫ్ అలీతో సమావేశమయ్యారు.

# రూ.వెయ్యి కోట్లు దాటిన 'ఇందిరమ్మ ఇండ్ల' చెల్లింపులు

అక్రమాలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తాం
కేసును ఎసిబికి అప్పగిస్తాం....
గృహ నిర్మాణ సంస్థ ఎండి వి.పి.గౌతం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'ఇందిరమ్మ ఇండ్ల' పథకంలో భాగంగా లబ్ధిదారులకు ఇప్పటివరకు వెయ్యి కోట్ల రూపాయలను అందచేశామని, 2.04 లక్షల ఇళ్ల పనులను ప్రారంభించగా, వాటిలో ఒక లక్ష ఇళ్లు బేస్‌మెంట్ స్థాయిలో ఉన్నాయని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వి.పి గౌతం తెలిపారు. 'ఇందిరమ్మ ఇండ్ల'కు సంబంధించి ఎటువంటి అవినీతి అక్రమాలకు పాల్పడినా కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఇటీవలి కాలంలో బిల్లుల విడుదలకు కొంత మంది డబ్బులు డిమాండ్ చేసిన ఉదంతాలను ప్రస్తావిస్తూ, ఇలాంటి అక్రమాలకు పాల్పడిన వారిపై, శాఖ పరమైన చర్యలతో పాటు ఈ కేసును అవినీతి నిరోధక శాఖకు (ఎసిబి) అప్పగిస్తామని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్లు, డిప్యూటీ ఇంజనీర్లతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా వి.పి. గౌతం మాట్లాడుతూ మూడు నెలల కాలంలోనే రెండు లక్షలకు పైగా ఇందిరమ్మ ఇళ్ల పనులు ప్రారంభం కావడం, గృహ నిర్మాణ కార్యక్రమాలకు ప్రభుత్వం ఇస్తున్న అత్యంత ప్రాధాన్యతకు నిదర్శనమన్నారు. 'ఇందిరమ్మ పథకం' అమలుపైన రాష్ట్ర వ్యాప్తంగా ఇందిరమ్మ ఇండ్ల పథకం జోరుగా అమలు జరుగుతున్నదని పిడిలు, డిఇఇలు నిరంతరం క్షేత్ర స్థాయిలో పర్యటించాలన్నారు. క్షేత్ర స్థాయి నిరంతర పర్యవేక్షణతో పాటు పథకం అమలులోని లోటుపాట్లపైన అధికారులకు స్పష్టమైన అవగాహన వస్తుందని, సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవచ్చని, తద్వారా ఈ పథకం మరింత విజయవంతమైన ఫలితాలు వస్తాయని ఆయన తెలిపారు. ముఖ్యంగా డిఇఇలు తమకు నిర్దేశించిన విధులను సక్రమంగా, సమర్థంగా నిర్వహించాలన్నారు.




### బిల్లుల కోసం లంచాలు ఇవ్వొద్దు :

బిల్లుల కోసం ప్రభుత్వ సిబ్బంది ఎవరికీ లంచాలు ఇవ్వవద్దని, ఈ విషయమై విస్తృతంగా ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తూ లబ్ధిదారులను చైతన్యవంతులను చేయాలని వి.పి గౌతం పిడిలకు, డిఇఇలను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల పనులకు సంబంధించిన పురోగతి బిల్లుల విడుదలకు అవసరమైన ఫోటోలను ఆయా గ్రామ కార్యదర్శులే కాకుండా, నేరుగా లబ్ధిదారులే రికార్డు చేసి/అప్‌లోడ్ చేసే సౌలభ్యం 'ఇందిరమ్మ ఇండ్ల యాప్'లో ఉన్నదని వివరించారు. ఈ యాప్‌ను విస్తృతంగా ప్రచారం నిర్వహించి, లబ్ధిదారులకు సమగ్రమైన అవగాహన కల్పించాలన్నారు. అనేక గ్రామాల్లో గ్రామ కార్యదర్శులు/ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి ఫోటోలు తీయడం, వాటిని యాప్‌లో అప్‌లోడ్ చేయడంలో జాప్యం జరుగుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందని, గ్రామ కార్యదర్శులు/ఇతర సిబ్బంది కావాలనే ఆలస్యం చేస్తున్నా, ఇతరత్రా వాటికి అడ్డుకట్ట వేయడానికి ఇది మంచి మార్గమని ఆయన తెలిపారు. జిల్లా స్థాయిలో సోమవారం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఇసుక, సిమెంట్, స్టీల్ ధరల నియంత్రణ కమిటీల సమావేశాలను నిర్వహించాలని, అలాగే రెవెన్యూ, మండల స్థాయిలో కూడా సమావేశాలు నిర్వహించాలని వి.పి.గౌతం సూచించారు. రెండు పడకల ఇళ్ల మంజూరు, కేటాయింపులతో పాటు, ఆయా కాలనీల్లో మంచినీరు, కరెంటు వంటి మౌలిక వసతుల కల్పన పనులపై సమావేశంలో సమీక్షించారు. ఈ సమీక్షా సమావేశంలో హౌసింగ్ కార్పొరేషన్ సలహాదారు ఈశ్వరయ్య, చీఫ్ ఇంజనీర్ ఎం.చైతన్య కుమార్, సూపరింటెండింగ్ ఇంజనీర్లు వెంకటదాస్ రెడ్డి, భాస్కర రెడ్డితో పాటు పలు జిల్లాల ప్రాజెక్టు డైరెక్టర్లు పాల్గొన్నారు.

# మట్టి వినాయకులనే పూజిద్దాం




ఎఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి నెర్లకంటి శ్రీకాంత్

**ప్రజాప క్షం/హైదరాబాద్ :** వినాయక చవితి సందర్భంగా మట్టి వినాయకులను పూజించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రజలందరూ కృషి చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య(ఎఐవైఎఫ్) హైదరాబాద్ జిల్లా కార్యదర్శి నెర్లకంటి శ్రీకాంత్ కోరారు. ఎఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితితో పాటు ఖైరతాబాద్ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో హెచ్ఎండిఎ సహకారంతో ఏర్పాటు చేసిన మట్టి గణపతులను హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణ భవన్‌తో పాటు జూబ్లీహిల్స్ డివిజన్‌లోని గురుబ్రహ్మనగర్‌లో వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నెర్లకంటి శ్రీకాంత్ మాట్లాడుతూ మాట్లాడుతూ రసాయనాలతో చేసిన వినాయక విగ్రహాలు అందంగా కనిపించినా పూజల అనంతరం వాటిని చెరువుల్లో నిమజ్జనం చేయడం వలన నీరంతా కలుషితమై నీటి రంగు మారడమే కాక తాగడానికి పనికి రాకుండ పోతున్నవిషయం తెలిసిందే అన్నా. పైగా ఆయా చెరువులు నాళాలలో ఉండే చిన్నజీవులు నీటి కాలుష్యంతో అవి ప్రమాదాల భారిన పడుతున్నాయని ఆయన వివరించారు. పూజలు అందుకున్న మట్టి వినాయక ప్రతిమలను ప్రతిష్టించి పూజల తర్వాత మన ఇంట్లోనే నిమజ్జనం చేసి ఆ నీటిని మొక్కలలో మొక్కల కుండీలలో పోయాలని, తద్వారా పర్యావరణాన్ని కాపాడుకున్న వారం అవుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కౌన్సిల్ సభ్యులు ఈ, సునీత, నారముని నరసింహ, ఖైరతాబాద్ నియోజకవర్గ ఎఐవైఎఫ్ అధ్యక్షులు కాంపల్లి కళ్యాణ్, కార్యదర్శి చెట్ల వెంకటస్వామి, మామిడి చెట్ల భగత్ సింగ్, యూత్ సభ్యులు చిన్న భీమేష్ భాస్కర్ నవీన్ ,నరసింహ బాల, గడి కొప్పుల బలరాజ్ పాల్గొన్నారు.

## ఉపరాష్ట్రపతి అభ్యర్థిత్వాన్ని జీర్ణించుకోలేకపోతున్న అమిత్ షా

సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రతిపక్ష ఇండియా కూటమి నుండి ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఉండడం కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా జీర్ణించుకోలేకపోతున్నారని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. అమిత్‌షా గుజరాత్ రాష్ట్ర హోంమంత్రిగా ఉన్నప్పుడు సొరబ్ ఎన్‌కౌంటర్‌లో జస్టిస్ సుదర్శన్ రెడ్డి తీర్పుతో రెండేళ్ల పాటు గుజరాత్ రాష్ట్ర బహిష్కరణకు గురైన అమిత్ షా ఇప్పుడు అక్కసు వెళ్లగక్కుతున్నాడని ఆయన పేర్కొన్నాడు. దేశ హోంమంత్రిగా ఉన్న వ్యక్తి న్యాయ వ్యవస్థకు మచ్చ తెస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి గెలిస్తే మావోయిస్టులు 20 ఏళ్లు ముందు కెళ్తారని అమిత్ షా పేర్కొన్నడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో మోదీ, అమిత్ షా మావోయిస్టుల అవశేషాలు లేకుండా చేయాలని చూస్తున్నారని, ఇది ప్రజాస్వామ్య మూల సూత్రాలకు విఘాతమని పేర్కొన్నారు. దేశంలో ప్రశ్నించే గొంతులను నొక్కుతున్నారని, 100శాతం వికలాంగుడైన సాయిబాబాపై నిరాధార ఆరోపణలు ఆయనను అరెస్టు చేయడంతో 9 ఏళ్లు జైల్లో ఉండి చనిపోగా, చివరికి సుప్రీంకోర్టు కూడా సాయిబాబా నిర్దోషి అని తీర్పు ఇవ్వడంతో అమిత్ షాకు చెంపపెట్టు లాంటిది అన్నారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి అభ్యర్థిత్వం పట్ల దేశంలోని జడ్జీలు స్పందిస్తున్నారని, ఎన్‌డిఎ కూటమిలోని ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆలోచించి మోదీ ప్రభుత్వం వైపు కాకుండా ప్రజాస్వామ్య రక్షణ వైపు ఉండాలని చాడ వెంకటరెడ్డి కోరారు.

## యూరియా కొరతపై బిజెపి తప్పుడు ప్రచారం

రాష్ట్రానికి రావాల్సిన యూరియాను సరఫరా చేయాలి : సిపిఐ (ఎం) డిమాండ్

**ప్రజాప క్షం/హైదరాబాద్ :** వానాకాలం సీజన్ ఆరంభమై 2 నెలులు గడుస్తున్నప్పటికీ రైతులకు కావాల్సిన యూరియాను అందించడంలో కేంద్రప్రభుత్వం నిర్లక్ష్యధోరణితో వ్యవహరించడం దుర్మార్గమని సిపిఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ పేర్కొంది. రైతులు యూరియా కోసం నెల రోజులుగా రోడ్ల పైకి వస్తున్నప్పటికీ బిజెపి నాయకులు కుంటి సాకులు చెబుతూ ''కృత్రిమ కొరత'' సృష్టించారనే తప్పుడు ప్రచారం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఇప్పటికైనా కేంద్రం నుండి రాష్ట్రానికి కావాల్సినంత యూరియాను తెప్పించడానికి బిజెపి ఎంపిలు, కేంద్ర మంత్రులు కేంద్ర బిజెపి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రైతులకు అండగా నిలబడాలని సిపిఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. రాష్ట్రానికి 9.8 లక్షల మెట్రిక్ టన్నులు యూరియా కావాల్సి ఉంగా, 1.5 లక్షల మెట్రిక్ టన్నులు కేంద్రం తగ్గించింది. ఈ కోటాను కూడా ఇంతవరకు సకాలంలో సరఫరా చేయకపోవడంతో తీవ్ర యూరియా కొరత ఏర్పడిందని రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్వాకం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, చివరికి నిరసనలు వ్యక్తం చేస్తున్నా కనీసం స్పందన లేకపోవడం దారుణమన్నారు. రాష్ట్రంలోని రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ నుండైనా రాష్ట్ర అవసరాలకు యూరియాను సరఫరా చేయాలని కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం అనేకసార్లు కోరినా, ఉద్దేశ్యపూర్వకంగానే కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆయన పేర్కొన్నారు. దీంతో 45 కేజీల యూరియా బస్తా రూ.242లు కాగా, ప్రస్తుతం బ్లాక్ మార్కెట్‌లో రూ.350కి అమ్ముతున్నారన్నారు. ఇప్పటికైనా కేంద్ర బిజెపి ప్రభుత్వం యూరియా కొరతను తీర్చడానికి, బ్లాక్ మార్కెట్‌ను నిరోధించడానికి ప్రభుత్వ సంస్థలైన హాకా, సహకార సంఘాల ద్వారా సరిపడా ఎరువులను సరఫరా చేసి రైతులను ఆదుకోవాలని సిపిఐ(ఎం) డిమాండ్ చేస్తుందని తెలిపారు. రాష్ట్రానికి అవసరమైన యూరియాను కేంద్ర ప్రభుత్వం నుండి తెప్పించడానికి అన్ని రకాల చర్యలు తీసుకొని, రైతులను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి జాన్‌వెస్లీ విజ్ఞప్తి చేశారు.


**శంకర్‌పల్లి మున్సిపాలిటీ కార్యాలయం**
రంగారెడ్డి :: జిల్లా

**Lr.No.E1/MCS/87/2025** ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన **తేది: 26.08.2025**

**శంకర్‌పల్లి మున్సిపాలిటీలో లైటింగ్, సరఫరా మరియు బంచ్ కేబుల్ మరియు మెటీరియల్స్ డెలివరీ** కోసం రిజిస్టర్డ్ కాంట్రాక్టర్ల నుండి టెండర్లను ఆహ్వానించడమైనది. శంకర్‌పల్లి మున్సిపాలిటీ కమిషనర్ ద్వారా 29-08-2025 ఉదయం 11:30 గంటలకు టెండర్లు స్వీకరించబడతాయి మరియు అదే తేదీన రాత్రి 11:45 గంటలకు టెండరుదారుల సమక్షంలో లేదా వారి ప్రతినిధుల ద్వారా కమిషనర్, శంకర్‌పల్లి మున్సిపాలిటీ ద్వారా టెండర్లు తెరవబడతాయి. పిలవబడే టెండర్ల షెడ్యూల్ క్రింద ఇవ్వబడింది: **1. టెండర్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ తేదీ:** 26-08-2025 ఉదయం 11:30 గంటలకు, **2. ఇ-ప్రొక్యూర్‌మెంట్‌లో టెండర్ల దాఖలు:** 29-08-2025 ఉదయం 11:30 గంటలకు, **3. టెండర్ల ప్రారంభం:** 29-08-2025 ఉదయం 11:45 గంటలకు. మరిన్ని వివరాల కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్లాట్‌ఫారం అనగా https://tender.telangana.gov.in లేదా శంకర్‌పల్లి మున్సిపాలిటీని సంప్రదించండి. ఆఫీస్ ఫోన్ నెం.: 7337323577 / 7331127776.

సం/- కమిషనర్
శంకర్‌పల్లి మున్సిపాలిటీ

DIPR R.O. No. : 7128-PP/CL/ADVT/1/2025-26, Date: 26-08-2025

## డ్రంకన్ అండ్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** మద్యం సేవించి వాహనాలు నడిపిన 8 మందిలో ఇద్దరికి ఒక రోజు జైలు శిక్ష, జరిమానా విధించినట్లు, మరో ఆరు గురికి జరిమానాసూర్యాపేటకోర్టు విధించినట్లు సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం మంగళవారం తెలిపారు. సోమవారం సూర్యాపేట పోలీసు స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో డ్రంకన్ డ్రైవ్ తనిఖీల్లో 8 మంది పట్టుబడినట్లు తెలిపారు. మంగళవారం కోర్టులో హాజరుపర్చగా ఇద్దరికి ఒక రోజు జైలు శిక్ష, జరిమానా, మరో ఆరుగురికి కలిపి రూ.11వేలు జరి



మానా విధిస్తూ సూర్యాపేట ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి పివి రమణ తీర్పు వెల్లడించినట్లు ఎస్ఐ వివరించారు.

### సాగర్ ప్రాజెక్ట్‌కు తగ్గిన ఇన్ ఫ్లో

## 14 గేట్ల ద్వారా నీటివిడుదల

**ప్రజాపక్షం/నందికొండ:** ఎగువ ప్రాంతాల నుంచి శ్రీశైలం ప్రాజెక్టుకు వరద ప్రవాహం బాగా తగ్గుముఖం పట్టడంతో ఐదు గేట్ల ద్వారా నీటి విడుదలను కొనసాగిస్తున్నారు.నాగార్జునసాగర్ రిజర్వాయర్ వరద తగ్గుముఖం పట్టింది. ఆదివారం సాయంత్రం వరకు నాలుగు లక్షల క్యూసెక్కులుగా ఉన్న వరద ప్రవాహం రోజుకు లక్ష క్యూసెక్కులు చొప్పున తగ్గుముఖం పట్టడంతో అధికారులు ప్రాజెక్ట్ క్రస్టు గేట్ల ఎత్తును బాగా తగ్గించి సోమవారం సాయంత్రం వరకు 26 గేట్ల ద్వారా నీటి విడుదలను కొనసాగించారు.ఆ తర్వాత ఇంకా వరద ప్రవాహం బాగా తగ్గుముఖం పట్టడంతో గేట్ల సంఖ్యతో పాటు ఎత్తును కూడా తగ్గించి మంగళవారం సాయంత్రానికి 14 గేట్లను 5 అడుగుల మేర పైకి లేపి 107338 క్యూసెక్కుల నీటిని స్పిల్వే ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు. అయితే శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్ కు మంగళవారం సాయంత్రానికి ఇన్ ఫ్లో గా 161971 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతూ ఉంటే అంతే మొత్తం నీరు అవుట్ ఫ్లో గా వచ్చి చేరుతూ ఉంటే అంతే మొత్తాన్ని అవుట్ ఫ్లో గా దిగువకు విడుదలవుతుంది.

## ప్రజా ఉద్యమ నాయకుడికి నివాళి



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** ప్రజా ఉద్యమ నాయకుడు,సిపిఐ జాతీయ మాజీ కార్యదర్శి కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డికి జాతీయ మహిళా సమాఖ్య సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి దేవరం మల్లీశ్వరీ ఆధ్వర్యంలో ఘననివాళులు అర్పించారు. మంగళవారం హుజూర్‌నగర్‌లోని జంగిడి సెంటర్లో సురవరం సుధాకర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కామ్రేడ్ సుధాకర్ రెడ్డి జీవితం,ప్రజా సంక్షేమం కోసం చేసిన పోరాటం నేటి తరానికి ఆదర్శప్రాయంగా నిలుస్తుందన్నారు. వామపక్ష ఉద్యమాలకు బలమైన పునాది వేసిన గొప్ప నాయకుడు సుధాకర్ రెడ్డి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో దేవరం సుజాత,సోమగాని లక్ష్మమ్మ,సింగం పుల్లమ్మ,సోమగాని వెంకటమ్మ,సీతమ్మ,వడ్లానపు పుల్లమ్మ,అరుణ,మంగమ్మ,లక్ష్మమ్మ,ఎస్కె ఆశ,నాగమణి,ఫాతిమా,రేణుక,లక్ష్మి ,మౌనిక తదితరులు పాల్గొన్నారు.

## రామన్నపేటలో రైళ్ల హాల్ట్‌కు వినతి



**ప్రజాపక్షం/రామన్నపేట:** సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవని ఎంపీ చామల కిరణ్‌కుమారరెడ్డి మంగళవారం కలిశారు. ఘట్కేసర్ నుంచి యాదాద్రి భువనగిరి ఎంఎంటీఎస్ రైలు భూసేకరణ కోసం యాదాద్రి, మేడ్చల్ కలెక్టర్లతో ఫోన్‌లో మాట్లాడారు. భువనగిరి నుంచి యాదాద్రి(రాయిగిరి) పనులు మొదలయ్యాయి. వీటిని త్వరితగతిన పనులు పూర్తి చేసి యాదాద్రికి వచ్చే భక్తులకు, అప్ అండ్ డౌన్ కార్మికులకు కష్టాలు తీరుతాయన్నారు. రామన్నపేటలో ఫలక్‌నామా, శబరి, నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్‌లో హాల్డింగ్ గురించి చర్చించారు. దీనికి రైల్వే మేనేజర్ సానుకూలంగా స్పందించారు. వీరితో పాటు సౌత్ సెంట్రల్ రైల్వే అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఉదయనాథ్ కోట్ల, ఎంఎంటీఎస్ చీఫ్ ప్రాజెక్టు మేనేజర్ సాయిప్రసాద్‌లు ఉన్నారు.

## వాహనం ఢీ.. బాలిక మృతి

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి:** బొలేరో వాహనం ఢీకొడంతో బాలిక (4) మృతి చెందిన సంఘటన మంగళవారం మండల పరిధిలోని కొల్‌ముంతల్‌పహాడ్ గ్రామ పంచాయతీ బాపూజినగర్ స్టేజీ వద్ద జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పిట్ల అక్షర రోజు మాదిరిగానే బడికి వెళ్ళడానికి తన నానమ్మతో కలిసి బాపూజీనగర్ బస్టాప్‌వద్ద నిలబడి బస్ కోసం వేచిచూస్తుండగా దేవరకొండ నుండి కొండమల్లేపల్లి వైపు వెళుతున్న ఒక బొలేరో వాహనం 4578 ను నడుపుతున్న పిఏపల్లి మండల కేంద్రానికి చెందిన డ్రైవర్ నిరంజన్ అతివేగంతో రోడ్డు పక్కన నిలబడి ఉన్న అక్షరను బలంగా ఢీకొట్టడంతో తలకు బలమైన గాయం అయ్యి, త్రీవ రక్త స్రావం జరిగింది. చికిత్స నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో అక్షర చనిపోయింది. మృతురాలి తాత చిన వెంకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అజ్మీరా రమేష్ తెలిపారు.

## క్రీడలకు కృష్ణవేణి విద్యార్థులు




**ప్రజాపక్షం/ రామన్నపేట:** జిల్లా స్థాయి క్రీడా పోటీలకు మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ గంగుల నరేందర్‌రెడ్డి తెలిపారు. తమ విద్యార్థులు మండల స్థాయిలో నిర్వహించిన క్రీడా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి క్రీడలకు ఎంపికైనట్లు తెలిపారు. జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను, అందుకు ప్రోత్సహించిన పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు ఎం.ప్రవీణ్‌కుమార్‌ను, ప్రిన్సిపల్ బి.యాదగిరి, డైరెక్టర్ జె.మణితోపాటు ఉపాధ్యాయులను ఆయన అభినందించారు.

## రూరల్ పోలీస్‌స్టేషన్‌లో తనిఖీ



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ రూరల్ పోలీస్‌స్టేషన్‌ను డీఎస్పీ రాజశేఖర్‌రాజు మంగళవారం సందర్శించి వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బంది పరేడ్, కిట్ బాక్స్, సిబ్బంది స్మాల్ సర్వీస్ బుక్, పోలీస్‌స్టేషన్ భవనం, స్టేషన్ రికార్డులు, కేస్ రికార్డులు తనిఖీ చేసి సిబ్బందికి సూచనలు చేసి మాట్లాడారు. గణేష్ నవరాత్రుల్లో, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా పోలీస్ సిబ్బంది అప్రమత్తగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## ప్రజా సంక్షేమానికి కృషి



**ప్రజాపక్షం/అడ్డగూడూరు:** మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వాటర్ ఫిల్టర్ ప్రారంభోత్సవానికి భువనగిరి పార్లమెంట్ సభ్యులు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డితో కలసి ప్రారంభోత్సవం చేసిన ఎమ్మెల్యే మందుల సామేలు ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజలకు అందుబాటులో ఉంటుంది సంక్షేమంలో దూసుకుపోతుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# డిసెంబర్‌లోగా తాగునీటి పనులు పూర్తి

### ఎస్‌డిఎఫ్ ద్వారా రూ.109 కోట్లతో సిసి రోడ్లు, మురికి కాలువల పనులు పూర్తి చేయాలి

### మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



**ప్రజాపక్షం/నల్లగొండ :** పట్టణంలో అమృత్ పథకం కింద సుమారు 56 కోట్ల 75 లక్షల రూపాయలతో చేపట్టిన తాగునీటి ట్యాంకుల నిర్మాణ పనులు డిసెంబర్ లోగా పూర్తిచేసి ప్రజలకు తాగునీరు అందించాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆదేశించారు.మంగళవారం ఆయన మున్సిపల్ సమావేశ మందిరంలో మున్సిపల్ పరిధిలో చేపట్టిన తాగునీరు, రోడ్లు, మురికి కాలువలు, పారిశుధ్యం తదితర అంశాలపై మున్సిపల్, ప్రజారోగ్య ఇంజనీరింగ్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. తాగునీటి ట్యాంకులకు సోర్స్ నుండి నీరు అందించేందుకుగాను అవసరమయ్యే అదనపు నిధులకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.మున్సిపాలిటీలో 109 కోట్ల రూపాయల ఎస్‌డిఎఫ్ నిధులతో చేపట్టిన సిసి రోడ్లు, మురికి కాలువల పనులను 3 నెలల్లో పూర్తి చేయాలని ఆయన ఇంజనీరింగ్ అధికారులతో చెప్పారు. ఒకవేళ నిధులు సరిపోనట్లయితే తన దృష్టికి తీసుకురావాలని, అవసరమైతే రాత్రి ,పగలు పనులు నిర్వహించి రోడ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలన్నారు. ఇకపై ఈ పనులపై ప్రతి మంగళవారం తాను సమీక్షిస్తానని మంత్రి తెలిపారు.చందనపల్లి బయోమైనింగ్ డంపింగ్ యార్డ్ ను త్వరితగతిన శుభ్రం చేయించాలని ఆదేశించారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, పబ్లిక్ హెల్త్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాములు, డిఇ లు కార్తీక్, అశోక్ ,శ్రీధర్ రెడ్డి, ఏఈలు దిలీప్, ప్రవీణ్, అసిం బాబా, ఏసీపీ కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

### మట్టి వినాయకులను పూజించి.. పర్యావరణాన్ని కాపాడాలి

వినాయక చవితి సందర్భంగా ప్రతి ఒక్కరు మట్టి వినాయకులను ప్రతిష్టించి పూజించాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కోరారు.మంగళవారం ఆయన జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మట్టి వినాయకులను ఉచితంగా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో సుమారు 4100 మట్టి వినాయకులను ప్రజలకుఉచితంగా అందించడం అభినందనీయమన్నారు. వినాయక చవితిని పురస్కరించుకొని ప్రజలందరూ వాతావరణ కాలుష్యం కాకుండా మట్టి వినాయకులను పూజించాలని తెలిపారు. దీనివల్ల వాతావరణ సమతుల్యంతో పాటు,వినాయకులను నిమజ్జనం చేసే చెరువులు కలుషితం కాకుండా ఉంటాయని, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తో తయారుచేసిన వినాయక విగ్రహాలను వాడడం వల్ల అన్ని రకాలుగాహానికరమన్నారు.మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, మాజీ ప్రజా ప్రతినిధులు ఉన్నారు.

## ఆరోగ్య భవన పనులు వేగవంతం

### నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/చండూరు /గట్టుప్పల :** గట్టుప్పల మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణ పనులను వేగవంతం చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆమె గట్టుప్పల మండల మండలంలో పర్యటించి పలు ప్రభుత్వ సంస్థలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. గట్టుప్పల లోని గిరిజన సంక్షేమ బాలుర పాఠశాల వసతి గృహాన్నితనిఖీ చేసి వసతి గృహంలో విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు.పాఠశాలఆవరణలో పరిశుభ్రత, చదువు, తదితర వివరాలను ఆడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాల విద్యార్థులకు చాకెట్లనుపంపిణీచేశారు. అనంతరం మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న పాథమిక వైద్య ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిహెచ్‌సి ఆసుపత్రి భవన నిర్మాణ పనులనువేగవంతంచేయాలని,సాధ్యమైనంత త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చండూరు ఆర్డీఓ శ్రీదేవి, గట్టుప్పల తహసీల్దార్ రాములు, ఎంపిడిఓ మాధవరెడ్డి, పంచాయితీ కార్యదర్శి షఫీ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల పనుల్లో నాణ్యత తప్పనిసరి

### కలెక్టర్ తేజస్ నందలాల్‌పవార్



**ప్రజాపక్షం/చివ్వెంల:** ఇందిరమ్మఇండ్లను నాణ్యత ప్రమాణాలతో నిర్మించుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ చెప్పారు. మంగళవారం మండల పరిధిలోని గుంపుల తిరుమలగిరిలో పందిరి నవ్య నిర్మించుకుంటున్న ఇందిరమ్మ ఇల్లును పరిశీలించారు. లబ్ధిదారులు ఇందిరమ్మ ఇండ్లను ఖచ్చితమైన కొలతలతో, ప్రభుత్వం నిర్దేశించిన స్థలములోనే నిర్మించుకోవాలని, స్థానిక మేస్త్రీలతో ఇంటి నిర్మాణాలు చేపట్టాలని, ము oదుగా అగ్రిమెంట్ చేసుకోవాలని, ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. దానిని సద్వినియోగం చేసుకొని త్వరగాఇంటి నిర్మాణాలు పూర్తి చేయాలని సూచి oచారు. అనంతరం ఉన్నత పాఠశాలను, ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. 9వ తరగతికి వెళ్లి విద్యార్థులతో తెలుగు చదివించారు. కష్టపడి చదివితేనే భవిష్యత్తు ఉంటుందని, ఎంత కష్టపడి చదివితే, మనకు అంత ప్రతిఫలం వస్తుందని, కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించి, తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తేవాలన్నారు. ప్రైమరీ స్కూల్‌లో 4, 5 తరగతులకు వెళ్లి విద్యార్థులతో ఎక్కాలు చదివించారు. ఇంగ్లీష్, లెక్కలు చేయించారు. పిల్లలు బాగా చదివడంపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశా రు. వంటగదిని పరిశీలించారు. తహశీల్దార్ సంతోష్, ఎంపిడిఓ ప్రకాష్ రావు, ఎంఈఓ కళారాణి, ప్రధానోపాధ్యాయులు బి శైలజ, హౌసింగ్ ఏఈ ప్రేమలత పాల్గొన్నారు.

### మేళాతో బోధన సులభతరం

బోధనాభ్యసన మేళా ద్వారా ప్రాథమిక స్థాయిలో బోధించడం సులభతరం అవుతుందని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. మంగళవారం చివ్వెంల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మండలస్థాయి బోధనాభ్యసన ప్రదర్శనను కలెక్టర్ సందర్శించి మాట్లాడారు. మండల స్థాయిలో ఇలాంటి ప్రదర్శన ఏర్పాట్లు చేయడం చాలా సంతోషమన్నా రు. 37 పాఠశాలల ఉపాధ్యాయులు ఏర్పా టు చేసిన స్టాల్స్‌ను సందర్శించి ప్రతిస్టాల్‌లో ప్రదర్శించిన బోధన పరికరాలను గురించి కలెక్టర్ ఆసక్తిగా అడిగి తెలుసుకొని సంబంధించిన ఉపాధ్యాయులను ప్రశంసించా రు. అనంతరం మండల విద్యాధికారి కళారాణి మాట్లాడుతూ చివ్వెంల మండల స్థాయి నందు 1 నుండి 5వ తరగతి వరకు ప్రాథమికస్థాయి బోధన అభ్యసన ప్రదర్శన నందు 37 ప్రాథమిక, ప్రాథమిక ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారని, వీరిలో 4 సబ్జెక్టుల నుండి 10ఉపకరణాలను ఎంపికచేసి, జిల్లాస్థాయి ప్రదర్శనకు పంపడంజరుగుతుందని అన్నారు. తహశీల్దార్ సంతోష్, ఎంపిడిఓ ప్రకాష్‌రావు, ఎంఈఓకళారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పోరాటాల యోధుడు ‘సురవరం’



**ప్రజాపక్షం/(తిరుమలగిరి) తుంగతుర్తి :** కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి ఎర్ర జెండా ముద్దుబిడ్డ, ఎర్ర సూర్యుడు పోరాటాల యోధుడని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, తుంగతుర్తి నియోజక వర్గ ఇంచార్జి ఎల్లముల యాదగిరి అన్నారు. మంగళవారం సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో తిరుమలగిరి మండల కేంద్రంలోని పూలే అంబేద్కర్ చౌరస్తాలో సురవరం సుధాకర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి సంతాపసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో ఏఐఎస్ఎఫ్ నుండి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల మీద పోరాటాలు చేసి విద్యార్థుల హక్కులను సాధించారన్నారు. ఏఐఎస్ఎఫ్ నుండి మొదలైన వారి ప్రస్థానం సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా, నల్లగొండ నుండి రెండు సార్లు పార్లమెంట్ సభ్యునిగా గెలిచి ప్రజా సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావించి వారి హక్కులను సాధించారని గుర్తు చేశారు. మాజీ ఎంపిపి కొత్తగట్టు మల్లయ్య, సిపిఐ మండల కార్యదర్శి ఎస్‌డి ఫయాజ్, బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తన్నీరు రాంప్రభువు, వ్యకాసం జిల్లా ఉపాధ్యక్షులు ఎండి ఏక్బాల్, బిఆర్ఎస్ జిల్లా నాయకులు కందుకూరి ప్రవీణ్, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి తిపిరాల శ్రీకాంత్, బండారు కిరణ్, జంపాల మల్లయ్య, సట్టు నరసయ్య, బొండ్ల వెంకన్న, కందుకూరి రవి, పురుషోత్తం, శ్రీను, మల్లయ్య పాల్గొన్నారు.

## కోర్టు విధుల బహిష్కరణ



**ప్రజాపక్షం/కోదాడ :** హైదరబాద్ కూకట్‌పల్లి కోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్న తన్నీరు శ్రీకాంత్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ, న్యాయవాదుల రక్షణ చట్టం తేవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కోదాడ కోర్టులో న్యాయవాదులు తమ విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఉయ్యాల నర్సయ్య అధ్యక్షతన జరిగిన నిరసన కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామిశెట్టి రామకృష్ణ మాట్లాడుతూ కూకట్‌పల్లి కోర్టులో పనిచేస్తున్న న్యాయవాది ఒక సివిల్ దావాలో గెలిచి ఇపి వేసి వారిని ఇల్లు ఖాళీ చేయించడానికి కోర్టు ఆర్డర్‌ను అమలు చేయడానికి వెళ్తే అక్కడ ఉన్న వారి మనుషులు, రౌడీలను వేసుకొని కోర్టు బెలిఫ్, డిహెచ్ఆర్, న్యాయవాది తన్నీరు శ్రీకాంత్‌లపై దాడికి పాల్పడ్డారని తెలిపారు. ఈ చర్య న్యాయవాదులకు, న్యాయవ్యవస్థకు మచ్చ అన్నారు. శ్రీకాంత్‌పా దాడికి పాల్పడిన దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి దాడులను అరికట్టేందుకు ప్రభుత్వాలు కఠినమైన చట్టాలు తీసుకుని రావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కమిటి సభ్యులు యడ్లపల్లి వెంకటేశ్వరరావు, కోడూరు వెంకటేశ్వరరావు, బండారు రమేష్ బాబు, కరీం, హుస్సేన్, చలం, నవీన్, కానుగు మురళీ, సీనియర్ న్యాయవాదులు వై సుధాకర్ రెడ్డి, పాలేటి నాగేశ్వరరావు, రంజాన్ పాషా, రంగారావు, శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# పెన్షన్ల పంపిణీకి నూతన పరికరాలు : కలెక్టర్

**ప్రజాపక్షం/యాదాద్రి :** అర్హులైన వారికి పింఛన్ల పంపిణీ మరింత మెరుగ్గా జరిగేందుకు జిల్లాలోని బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లకు కొత్త మొబైల్ ఫోన్లు, ఫింగర్ ప్రింట్ డివైస్లు ఇతర సాంకేతిక పరికరాలు కిట్లను మంగళవారం కలెక్టరేట్‌లో యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు పంపిణీ చేశారు.కలెక్టర్‌మాట్లాడుతూజిల్లాలో మొత్తం 229 సెట్లు మంజూరయ్యాయని, ఆధునిక పరికరాల ద్వారా ఫేస్ రికగ్నైజేషన్ సులువుగా జరుగుతుందన్నా రు. లేదంటే మంత్ర డివైస్ ద్వారా గాని ఫింగర్ ప్రింట్ డివైస్ ద్వారా గాని ఫించను పంపిణీ చేయవచ్చన్నారు. అతి తక్కువ సమయంలో ఈ పరికరాలతో ఎక్కువ మందికిపింఛన్లుఇచ్చేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. స్థానిక సంస్థల అదనపుకలెక్టర్‌భాస్కర్‌రావు,జిల్లా గ్రామీ ణభివృద్ధి అధికారి నాగిరెడ్డి, పెన్షన్ ఏపిఓ శ్రీనివాస్,బ్రాంచ్‌పోస్ట్‌మాస్టర్స్ ఉన్నారు.



## అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన

**ప్రజాపక్షం/బీబీనగర్ :** బిబినగర్ మండలంలోని గ్రామాలలో పర్యటించి పలు అభివృద్ధి పనులకు భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి శంకుస్థాపన చేశారు. మక్త అనంతారం గ్రామంలో హెచ్ఎండీఏ నిధుల ద్వారా మంజూరైన రూ.50 లక్షలతో మరియు ఎస్సీ సబ్ ప్లాన్ రూ.5 లక్షలతో, మీది తండ గ్రామంలో రూ.20 లక్షలతో హెచ్ఎండీఏ నిధులతో, జమీలా పేట గ్రామంలో రూ.40 లక్షల హెచ్ఎండీఏ నిధులతో, ఎస్సీ సబ్ ప్లాన్ రూ.10 లక్షలతో, పిహెచ్‌సి బ్యాలెన్స్ వర్క్ రూ.8 లక్షలతో, జియాపల్లి గ్రామంలో రూ.40 లక్షల హెచ్ఎండీఏ నిధులతో, జియాపల్లి తండలో రూ.20 లక్షల హెచ్ఎండీఏ నిధులతో, లక్ష్మీ దేవి గూడెం గ్రామంలో రూ.36 లక్షల హెచ్ఎండీఏ నిధులతో, అంగన్వాడి బిల్డింగ్ నిర్మాణానికి రూ. 12లక్షలతో, పెద్దపలుగుతండ గ్రామంలో రూ.20 లక్షల హెచ్ఎండీఏ నిధులతో, రామునిగుండ్ల తండ గ్రా మంలో రూ.25 లక్షల హెచ్ఎండీఏ నిధులతో, ఎర్రబెల్లి తండ గ్రామంలో రూ.20 లక్షల హెచ్ఎండీఏ నిధులతో, అన్నంపట్ల గ్రామంలో రూ.20 లక్షల హెచ్ఎండీఏ నిధులతో, రహీంఖాన్ గూడ గ్రామంలో రూ.46 లక్షల హెచ్ఎండీఏ నిధులతో, ఎస్సీ సబ్ ప్లాన్ రూ.3 లక్షల పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసారు.



# 10మంది గంజాయి రవాణా నిందితులు అరెస్టు

### డిఎస్‌పి రాజశేఖర్‌రాజు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** అక్రమంగా గంజాయిని రవాణా చేస్తున్న పదిమంది అంతరాష్ట్ర గంజాయి ముఠాను పట్టుకోని రిమాండ్ చేసినట్లు డీఎస్పీ రాజశేఖర్‌రాజు తెలిపారు. మంగళవారం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన గంజాయి నిందితుల వివరాలను వెల్లడించారు. బీహార్ రాష్ట్రానికి చెందిన సికిందర్‌తోపాటు రాజ్‌కుమార్ పటేల్ మిర్యాలగూడకు చెందిన షేక్ సమీర్, కొండేటి యశ్వంత్, కోడల శివ, బొల్లంపల్లి విష్ణు, బుర్రి లోకేష్, దైద సందీప్, గుండెబోయిన వంశీ, పందిరి చరణ్, మిరియాల వివేకానందరెడ్డి, బుర్రి నవీన్, శివం ఫార్మా డైరెక్టర్ ఉన్నావ్‌లు ఒక ముఠాగా ఏర్పడి గంజాయి, మాదక ద్రవ్యాలను కొనుగోలు చేసి మాడుగులపల్లి మండల పరిధిలోని పలు గ్రామాల్లో వీటికి బానిసలైన యువకులకు అమ్ముతున్నారు. ఈ క్రమంలో గంజాయి అలవాటు ఉన్న కొంతమంది వ్యక్తుల ద్వారా బీహార్ రాష్ట్రం నుంచి మాదక ద్రవ్యాలను తీసుకొచ్చి మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలో ఎక్కువగా అమ్ముతూ యువతను నాశనం చేస్తున్నారు. వీరు చేస్తున్న అక్రమ గంజాయి వ్యాపారంపై తమకు అందిన సమాచారం మేరకు నిఘాను పెట్టమన్నారు. ఈ నెల 25న ఈ ముఠా సభ్యులు మాడుగులపల్లి పాత రైల్వే కార్టర్స్ వద్ద గంజాయి, గంజాయి చాక్లెట్లు పరస్పరం మార్చుతున్న సమయంలో తమ పోలీస్ సిబ్బంది చాకయచక్యంగా పట్టుకోని అరెస్ట్ చేశారన్నారు. అనంతరం జరిపిన విచారణలో పూర్తి వివరాలు తెలిసాయన్నారు. వారి వద్ద నుంచి 1350 గ్రాముల గంజాయి, 22 గంజాయి చాక్లెట్లు, మూడు మోటార్ సైకిల్‌తో పాటు 8 మొబైల్స్‌ను స్వాదీనం చేసుకోని రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. తల్లిదండ్రులు సైతం తమ పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా జల్సాలకు అలవాటు పడినవారు ఉంటే తమకు సమాచారం అందించాలన్నారు. వారి ప్రవర్తనను నిరంతరం గమనిస్తూ ఉండాలని అన్నారు. జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదేశాల మేరకు మిషన్ పరివర్తనలో భాగంగా తమ సబ్ డివిజన్ పరిధిలో స్పెషల్ డ్రైవ్ చేస్తూ గంజాయి మాదకద్రవ్యాల మహమ్మారి వంటి వాటిని అరికట్టేందుకు కృషి చేయడంతోపాటు ప్రతిరోజు తనిఖీలు చేపడుతున్నామని అన్నారు. ఈ గంజాయి కేసును అత్యంత చాకచక్యంగా ఛేదించిన మిర్యాలగూడ రూరల్ సీఐ పీఎన్‌డీ.ప్రసాద్, మాడుగులపల్లి ఎస్ఐ కృష్ణయయ తోపాటు సిబ్బంది నరసింహారావు, జాఫర్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, సైదులు, సైదిరెడ్డి, అనిల్, ఆంజనేయులు, యాదయ్య, నరేష్, శ్రీనునాయక్, డ్రైవర్ సురేష్ లను ఆయన అభినందించారు.



# జాతీయం

NATIONAL & GENERAL NEWS

## శ్రీదేవి ఆస్తి కబ్జా... కోర్టుకెక్కిన బోనీకపూర్

**చెన్నై:** తన భార్య, దివంగత నటి శ్రీదేవి ఆస్తిని ముగ్గురు వ్యక్తులు కబ్జా చేశారంటూ బోనీ కపూర్ కోర్టును ఆశ్రయించారు. వారు చట్టవిరుద్ధంగా హక్కులను సొంతం చేసుకున్నారని ఆరోపించారు. ఆమె ఎంతో కష్టపడి ఆ స్థిరాస్తిని కొనుగోలు చేసిందని ఈ విషయంలో తమకు న్యాయం చేయాలంటూ మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. దాని వివరాలను కోర్టుకు వివరించారు. 1988 ఏప్రిల్‌లో శ్రీదేవి మద్రాసులో ఎంసీ సంబంధం మొదలియార్ అనే వ్యక్తి వద్ద స్థిరాస్తిని కొనుగోలు చేశారు. దానికి సంబంధించిన పత్రాలన్నీ పరిశీలించిన తర్వాతే ఆమె దాన్ని కొనుగోలు చేసినట్లు బోనీ కపూర్ తెలిపారు. అతడికి ముగ్గురు కుమారులు, ఇద్దరు కూతుర్లు ఉన్నారని, వారందరి దగ్గర వారసత్వ ధ్రువీకరణ పత్రాన్ని పరిశీలించిన తర్వాతనే శ్రీదేవి ఈ ఆస్తిని సొంతం చేసుకున్నట్లు బోనీ కపూర్ వెల్లడించారు. అయితే, ఎంసీ సంబంధ మొదలియార్ రెండో భార్య కుమారులు ఈ ఆస్తిలో వారికి వాటా ఉందంటూ తహశీల్దార్ కార్యాలయంలో అప్పీల్ చేశారన్నారు. ప్రభుత్వ అధికారుల నిర్ణయంతో తాజాగా చట్టవిరుద్ధంగా దీని హక్కులను సొంతం చేసుకున్నారని బోనీ కపూర్ హైకోర్టులో కేసు వేశారు. మోసపూరితమైన పత్రాలను రద్దు చేసి తమకు న్యాయం చేయాలని పిటిషన్‌లో పేర్కొన్నారు.

# క్లీన్ ఎనర్జీ, క్లీన్ మొబిలిటీలో ప్రపంచ హబ్‌గా భారత్

- ప్రధాని నరేంద్ర మోదీ
- పెట్టుబడుల కోసం రాష్ట్రాలు పోటీ పడాలని పిలుపు
- అహ్మదాబాద్‌లో హైబ్రిడ్ బ్యాటరీ ఎలక్ట్రోడ్ల ఉత్పత్తికి శ్రీకారం
- 100 దేశాలకు ఎలక్ట్రిక్ వాహనాల ఎగుమతులు ప్రారంభం



**అహ్మదాబాద్:** ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) తయారీ, ఎగుమతుల రంగంలో భారత్ ముందడుగు వేసింది. ఇకపై 'మేడ్ ఇన్ ఇండియా' ఈవీలు ప్రపంచవ్యాప్తంగా 100 దేశాలకు ఎగుమతి కానున్నాయి. అహ్మదాబాద్‌లోని హన్సల్‌పూర్‌లో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ ఎగుమతులను జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ఇదే వేదికపై హైబ్రిడ్ బ్యాటరీ ఎలక్ట్రోడ్‌ల స్థానిక ఉత్పత్తిని కూడా ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ, క్లీన్ ఎనర్జీ, క్లీన్ మొబిలిటీ రంగాల్లో భారత్ ప్రపంచ హబ్‌గా అవతరించబోతోందని ధీమా వ్యక్తం చేశారు. "గణేశ్ ఉత్సవ్ సందర్భంగా మేక్ ఇన్ ఇండియాలో సరికొత్త అధ్యాయం మొదలైంది. ఇవాళ్టి నుంచి దేశీయంగా రూపొందించిన విద్యుత్ వాహనాలు 100 దేశాలకు ఎగుమతి అవుతాయి. విద్యుత్ వాహనాల్లో బ్యాటరీ తయారీ ముఖ్యమైన అంశమని మనందరికీ తెలుసు. కొన్నేళ్ల క్రితం వరకు బ్యాటరీలను దిగుమతి చేసుకున్నాం. విద్యుత్ వాహనాల తయారీని బలోపేతం చేయడానికి భారత్‌లోని బ్యాటరీలను ఉత్పత్తి చేయాల్సిన అవసరం ఉంది. అందులో భాగంగానే 2017లో టీడీఎస్‌జీ బ్యాటరీ యూనిట్‌కు శంకుస్థాపన చేశాం. భారత్‌కు ప్రజాస్వామ్య శక్తితో పాటు జనాభా అనుకూలత ఉంది. అధిక సంఖ్యలో నైపుణ్యంతో కూడిన మానవవనరులు అందుబాటులో ఉన్నారు. భారత్‌లో పెట్టుబడి పెడితే భాగస్వామ్య అయిన ప్రతిఒక్కరికీ లాభదాయకమే" అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. భారత్‌జపాన్ మధ్య బంధం కేవలం వ్యాపారానికే పరిమితం కాదని, చారిత్రక, సాంస్కృతిక మూలాలున్నాయని ప్రధాని గుర్తుచేశారు. "సుజుకి వంటి జపాన్ కంపెనీలు ఇక్కడ కార్లను తయారు చేసి, తిరిగి జపాన్‌కే ఎగుమతి చేస్తున్నాయి. ఇదే మన రెండు దేశాల సంబంధాల బలానికి నిదర్శనం. మారుతి సుజుకితో మొదలైన ఈ ప్రయాణం ఇప్పుడు బుల్లెట్ ట్రైన్ వేగంతో దూసుకెళుతోంది" అని మోదీ వ్యాఖ్యానించారు. గత దశాబ్దంలో తమ ప్రభుత్వం చేపట్టిన ఆర్థిక సంస్కరణలు, 'మేక్ ఇన్ ఇండియా' వంటి కార్యక్రమాల ఫలాలు ఇప్పుడు కనిపిస్తున్నాయని ప్రధాని మోదీ తెలిపారు. పదేళ్లలో ఎలక్ట్రానిక్ వస్తువుల తయారీ 500 శాతం పెరిగిందని అన్నారు. భవిష్యత్ ప్రణాళికలను వివరిస్తూ, "మనం ఇక్కడితో ఆగిపోం. ఇకపై సెమీకండక్టర్ల తయారీపై దృష్టి పెడతాం. త్వరలో ఆరు ప్లాంట్లు సిద్ధం కాబోతున్నాయి. అదేవిధంగా కీలక ఖనిజాల కోసం 'నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్'ను ప్రారంభించాం" అని ప్రధాని వెల్లడించారు. అభివృద్ధి అనుకూల విధానాల రూపకల్పనలో రాష్ట్రాలు ఒకదానితో ఒకటి పోటీ పడాలని, పెట్టుబడిదారుల విశ్వాసాన్ని చూరగొనాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

### మారుతి సుజుకీకి చెందిన తొలి ఎలక్ట్రిక్ వాహనం ఆవిష్కరణ

గుజరాత్‌లో రెండో రోజు పర్యటిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ, అంతకుముందు మారుతి సుజుకీ సంస్థకు చెందిన తొలి ఎలక్ట్రిక్ వాహనం ఈవిటారాను ఆవిష్కరించారు. సుజుకి, తోషిబా, డెన్సో సంస్థలు సంయుక్తంగా నిర్మించిన లిథియం అయాన్ బ్యాటరీ తయారీ యూనిట్‌ను ప్రారంభించారు. అనంతరం హన్సల్‌పూర్‌లో ఉన్న మారుతి సుజుకి కార్ల తయారీ యూనిట్‌ను మోదీ పరిశీలించారు. ఈవిటారాకు సంబంధించిన విశేషాలతో పాటు ప్లాంట్‌లో ఉపయోగిస్తున్న ఆధునిక సాంకేతికతను కంపెనీ ప్రతినిధులు మోదీకి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాని వెంట గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర భాయ్ పటేల్‌తో పాటు మంత్రులు పాల్గొన్నారు. దేశీయంగా రూపొందించిన ఈవిటారాను జపాన్ సహా 100కుపైగా దేశాలకు ఎగుమతి చేస్తామని మారుతి సుజుకీ కంపెనీ తెలిపింది. బెల్జియంలో జరిగిన ప్రదర్శనలో మారుతి సుజుకీ సంస్థ తొలిసారి ఈవిటారాను ప్రపంచానికి పరిచయం చేసింది. ఈవిటారా రెండు బ్యాటరీ వేరియంట్‌లతో మార్కెట్‌లోకి అందుబాటులోకి రానుంది.

# దేశీయ 'సుదర్శన చక్ర' మన గగనతలానికి కవచ – ఖడ్గం

- అమెరికా గోల్డెన్‌డోమ్,ఇజ్రాయెల్ ఐరన్‌డోమ్ లాంటిదే
- 2035 నాటికి అందుబాటులోకి వస్తుంది
- రక్షణ సదస్సులో సిడిఎస్ చౌహాన్ ప్రకటన



**మోవ్:** భారత గగనతల సంరక్షణకు ప్రతిపాదించిన 'సుదర్శన చక్ర' శత్రుదేశ ఆయుధ వ్యవస్థను వెలుపలే అడ్డుకుని, ఎదురుదాడచేసి తరిమికొట్టగల 'కవచ–ఖడ్గం' లా పనిచేస్తుందని రక్షణ సిబ్బంది ప్రధానాధిపతి జనరల్ అనిల్ చౌహాన్ ప్రకటించారు. ఒక సమీకృత వ్యవస్థగా ఇది తన బాధ్యతలు నిర్వహిస్తుందన్నారు. అమెరికా తన గగనతల వ్యవస్థ రక్షణకు ప్రతిపాదించిన 'గోల్డెన్ డోమ్', అన్ని కాలాలలోనూ పనిచేసేవిధంగా ఇజ్రాయెల్ ప్రతిపాదించిన 'ఐరన్ డోమ్' తరహాలోనే 'సుదర్శన చక్ర' కూడా అన్నిరకాల ఆయుధాలను సమన్వయంతో ప్రయోగించి శత్రువును ఊపిరి సలపకుండా చేసి తరిమికొట్టే దేశీయ సమీకృత కవచంగా భారత గగనతల రక్షణకు దోహదం చేస్తుందని చెప్పారు. 2035 నాటికి 'సుదర్శన చక్ర' రక్షణ కవచం ప్రాజెక్టు అమలులోకి వస్తుందని చెప్పారు. 'యుద్ధం–యుద్ధ రీతులు' అనే అంశంపై మధ్యప్రదేశ్ ఇండోర్ జిల్లా మోవ్‌లోని రణ్ సంవాద్ వద్ద జరిగిన రెండోరోజు సదస్సులో మంగళవారం అనిల్ చౌహాన్ ప్రసంగించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోటపై నుండి ప్రసంగించిన ప్రధానమంత్రి భారత్ గగనతల రక్షణకు సంబంధించిన పది సంవత్సరాల ప్రాజెక్టు ప్రకటనచేసిన తర్వాత జనరల్ చౌహాన్ ఈ రక్షణ రంగ సదస్సులో మొదటిసారి సుదర్శన చక్ర కవచ–ఖడ్గ రక్షణ గురించి ప్రకటించారు. ఈ గగనతల రక్షణ వ్యవస్థ ఒక కవచంగా, ఒక ఖడ్గంగా పనిచేస్తుందన్నారు. శత్రుదేశం ప్రయోగించే ఆయుధాలను పసిగట్టి అవి పనిచేయకుండా తటస్థీకరించగల సెన్సర్స్, క్షిపణులు, గస్తీ ఉపకరణాలు, కృత్రిమ మేధ సహాయంతో పనిచేసే రక్షణ వస్తువులు తదితరాలన్నింటినీ సమీకృతం చేసి శత్రువుకు భయం పుట్టించే కవచంగా 'సుదర్శన చక్ర' ఉపయోగపడుతుందన్నారు. భారతదేశం భవిష్యత్ భద్రత కోసం ఎంతో ఆతృతగా ఎదురుచూస్తూ తలపెట్టిన ఈ రక్షణ కవచ ప్రాజెక్టులో విస్తారంగా ఏడు రకాల విభాగాలు ఉంటాయని చెప్పారు. ఈ గగనతల రక్షణ వ్యవస్థ ఒక 'కవచ–ఖడ్గంగా పనిచేస్తుందన్నారు. ఎంతో సమర్థవంతమైన క్షిపణి కవచంగా ఇది ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆపరేషన్ సిందూర్ గురించి కూడా ప్రస్తావించారు. పాకిస్థాన్‌పై జరిపిన సైనిక చర్య ద్వారా ఆధునిక యుద్ధ రీతుల అమలుకు సంబంధించి మనదేశం ఎన్నో గుణపాఠాలు నేర్చుకుందన్నారు. దేశ సైనిక వ్యవస్థ నేర్చుకున్న ఈ గుణపాఠాలలో చాలా వాటిని ఇప్పటికే అమలులోకి తీసుకువచ్చామని, ఇంకా మరికొన్ని సరికొత్త ఉపాయాలు అమలులోకి తీసుకురావాల్సి ఉందని చెప్పారు. భవిష్యత్ యుద్ధాలు సరిహద్దులకే పరిమితం కాబోవని, అవివిభాగాలూ సత్వర, నిర్ణయాత్మకమైన ఉమ్మడి ప్రతిస్పందన ద్వారానే యుద్ధ విజయం సాధ్యమని అన్నారు. 'సుదర్శన చక్ర' పనితీరు, దాని నిర్మాణ వ్యవస్థను వీలైనంత వివరంగా చౌహాన్ సదస్సులో పాల్గొన్న వారికి తెలియజేశారు. ''భారతదేశ వ్యూహాత్మక, పౌర, జాతీయ ప్రాధాన్యతగల ప్రదేశాలను, వ్యవస్థలను, మౌలిక సదుపాయాలను శత్రుదాడుల నుండి సంరక్షించుకునేందుకు ఈ వ్యవస్థను అభివృద్ధి చేయాలని తలపోశాం, ఇక ఇప్పుడు ఈ వ్యవస్థ ఒక కవచంగా, ఒక ఖడ్గంలా ఉపయోగిస్తుంది'' అని చెప్పారు. ''అత్యంత బలమైన మౌలిక రక్షణ సదుపాయాన్ని, శత్రు ఆయుధాలను కనిపెట్టే ప్రక్రియ, వాటి తటస్థీకరణ, మానవరహిత గగన ఆయుధాలు సహా మేధో నైపుణ్యం, భుజబలాన్ని ప్రత్యక్ష ఆయుధ బలాన్ని ఉపయోగించేందుకు బహుముఖంగా ఈ సుదర్శన చక్ర ఉపయోగపడుతుంది'' అని చెప్పారు. గూఢచర్యం, గస్తీ, గూఢచర్యదృష్టితో వివిధ ఆయుధ వ్యవస్థల ద్వారా భూతలంపై వ్యవహారాన్ని క్షుణ్ణంగా పరిశీలించడం (ఐఎస్ఆర్) దీనివల్ల సాధ్యం అవుతుందని చెప్పారు. ''బహుముఖంగా పనిచేసే ఐఎస్ఆర్, భూతల యుద్ధక్షేత్రాన్ని కనిపెట్టి ఉండటం, సముద్రగర్భంలో, సముద్రతలంలో, రోదసీ నుండి పరిశీలన, సెన్సర్స్ ఉపయోగించడం వంటి కీలకమైన అనివార్యమైన వ్యవస్థలను సమీకృతం చేయడంపై దృష్టి పెట్టామన్నారు. భూతం,గగనతలం,సముద్రతలాలపై జరిగే యుద్ధాలను సమన్వయం చేసుకోవ డం, అందుకు అనుగుణంగా ఏకకాలంలో యుద్ధ రీతులు రూపొందించడం ముఖ్యమైన అంశమన్నారు. క్షిపణులను ప్రయోగించడంలో కృత్రిమ మేధను ఉపయోగిస్తామన్నారు. అడ్వాన్స్‌డ్ కంప్యూటర్ వ్యవస్థలు డేటా ఎనలటిక్స్, బిగ్ డేటా, క్వాంటమ్ టెక్నాలజీ వంటి అప్లికేషన్స్‌ను కవచ–ఖడ్గ ప్రాజెక్టుకు ఉపయోగిస్తామన్నారు. రాబోయే యుద్ధాల్లో బహుముఖ వ్యూహాలను ఒకే కేంద్రం గా ఉపయోగించడంవల్లనే విజయం సాధ్యం అవుతుందన్నారు.

# ప్రధాని మోదీ అవమానించారు : మమత



**కోల్‌కతా:** అవమానిస్తే సహించేది లేదని ప్రధాని మోదీకి బెంగాల్ సీఎం మమతా బెనర్జీ తేల్చిచెప్పారు. తమ రాష్ట్ర ప్రజలను దొంగలంటూ మోదీ అవమానించారని, కనీసం తన పదవిని గౌరవించలేదంటూ మండిపడ్డారు. కేంద్ర నిధులు లేక రాష్ట్ర ఖజానాపై భారం పెరిగిందన్నారు. పూర్బా వర్ధమాన్ జిల్లాలోని వర్ధమాన్ పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో మమత మాట్లాడుతూ మోదీపై విరుచుకుపడ్డారు. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బీహార్ వంటి రాష్ట్రాల్లో డబుల్ ఇంజిన్ పాలనలో అవినీతి రాజ్యమేలుతోందని, మోదీకి ఇదేమీ పట్టడంలేదని విమర్శించారు. ఓ వలస పక్షిలా ఎన్నికలప్పుడు మోదీ బెంగాల్‌లో వాలుతారని ఎద్దేవా చేశారు. సంక్షేమ పథకాల కోసం కేంద్ర నిధుల వినియోగంపై సంతృప్తికర సమాధానాలు ఇచ్చినా, నిధులు ఇవ్వకపోగా, మమ్మల్ని దొంగలని అంటున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అవినీతి జరిగినట్లు ఆరోపిస్తూ విచారణ కోసం 186 కేంద్ర బృందాలను రాష్ట్రానికి పంపారు కానీ ఏ ఆధారాలు లభించలేదని మమత అన్నారు. 'ప్రశ్నలన్నింటికి సమాధానం ఇచ్చినా సున్నా మార్కులు వేస్తే విద్యార్థి సహిస్తాడు? మేము అంతే. ఈ అవమానాన్ని సహించబోం' అని మమత స్పష్టంచేశారు. 'ఇతర రాష్ట్రాల్లో బెంగాలీ మాట్లాడే వారు వివక్ష, వేధింపులు ఎదుర్కొంటున్నారు కానీ బెంగాల్ ఉన్న 1.5 కోట్ల మంది బయట వారికి అలాంటి పరిస్థితి లేదు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గుజరాతీలను తరిమివేశారు. హార్వర్డ్, ఆక్స్‌ఫర్డ్, కొలంబియా, శాన్ ఫ్రాన్సిస్కో బెంగాలీలు లేకుండా నడవలేవు' అని మమత అన్నారు. సామాన్యుల ప్రయోజనార్థం ఆరోగ్య బీమాపై జీఎస్టీ మినహాయించాలన్నామని చెప్పారు. జీఎస్టీ మినహాయిస్తే రాష్ట్ర ఖజానాపై రూ.900 కోట్ల అదనపు భారం పడుతుంది. అయినా ప్రజలకు తొలి ప్రాధాన్యత ఇస్తున్నాం. శ్వాస్త్ సాథీ పథకాన్ని మరింతగా విస్తరించేందుకు యత్నిస్తున్నాం. దీంతో రాష్ట్ర ప్రజలకు రూ.5 లక్షల వరకు ఉచిత ఆరోగ్య బీమా లభిస్తుంది' అని మమత వెల్లడించారు.

# బిహార్ ఎన్నికల ముందే బిజెపి కొత్త అధ్యక్షుడి ఎంపిక!

**న్యూఢిల్లీ:** త్వరలోనే బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఇందుకోసం కేంద్ర ఎన్నికల సంఘం కసరత్తు చేస్తోంది. అయితే ఈలోపే బిజెపి జాతీయ అధ్యక్షుడిని ఎంపిక చేయాలని ఆ పార్టీ భావిస్తున్నట్లు సమాచారం. బీహార్ ఎన్నికల షెడ్యూల్ రాక ముందే కొత్త అధ్యక్షుడిని నియమించాలని అధిష్టానం కసరత్తు ప్రారంభించినట్లు తెలిసింది.సెప్టెంబర్ 9న ఉపరాష్ట్రపతి ఎన్నికలు పూర్తికానున్నాయి. అనంతరం బిజెపి కొత్త అధ్యక్షుడి నియామకాన్ని కూడా పూర్తి చేయాలని ప్లాన్ చేస్తున్నట్లుగా సమాచారం. ప్రస్తుతం జేడీ నడ్డా జాతీయ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. అనేకమార్లు ఆయన పదవీకాలం పొడిగించారు. దీంతో కొత్త అధ్యక్షుడిని ఎంపిక చేయాలని ఆ పార్టీ ఆలోచన చేస్తోంది. అంతకంటే ముందే ఉత్తరప్రదేశ్, గుజరాత్, కర్నాటక వంటి కీలక రాష్ట్రాల్లో కొత్త రాష్ట్ర అధ్యక్షులను నియమించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇక ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉత్తరప్రదేశ్ నుంచి బీజేపీ జాతీయ మండలి సభ్యుడిగా, గుజరాత్ నుంచి కేంద్ర హెమంత్రి అమిత్ షా ఎన్నికవుతారు. అనంతరం కొత్త అధ్యక్షుడి నామినేషన్ పత్రాలకు ప్రతిపాదకులుగా వ్యవహరించడానికి వీరిద్దరూ అర్హులు అవుతారు. అయితే కొత్త జాతీయ అధ్యక్షుడి ఎంపిక కుల, ప్రాంతీయ లేదా సామాజిక సమీకరణాల ఆధారంగా జరగకూడదని పార్టీ నాయకత్వం ఆలోచిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. పార్టీని బలోపేతం చేసే వ్యక్తిని మాత్రమే ఎంపిక చేయనున్నట్లు సమాచారం. జాతీయ స్థాయిలో సంస్థాగతంగా మంచి అనుభవం ఉన్న సీనియర్ నేతకు ఆ బాధ్యతలు అప్పగించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.


దక్షిణ మధ్య రైల్వే
Follow us on X SCRailwayindia
దక్షిణమధ్య రైల్వే టెండరు నోటీసుల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.inలో చూడగలరు.

టెండర్ నోటీసు నెం. C_SG_C_36_5_414 తేది: 22.08.2025 PUB/1029

భారత రాష్ట్రపతి తరపున, డిప్యూటీ చీఫ్ సిగ్నల్ & టెలికాం ఇంజనీర్ (ప్రాజెక్ట్స్) ఎస్.సి. రైల్వే, సికింద్రాబాద్ 01.10.2025న 15:00 గంటల వరకు ఈ-టెండర్ల (ఓపెన్)ను ఆహ్వానిస్తుంది.

క్ర.సం.: 01, టెండర్ నెం.: C/SG/C/36/5/414 పని వివరణ: దక్షిణ మధ్య రైల్వేలోని సికింద్రాబాద్ డివిజన్‌లోని సెకండ్ - గుండ్రాతిమడుగు విభాగాలలో ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్ వ్యవస్థను అందించడానికి సమగ్ర సిగ్నలింగ్ మరియు టెలికమ్యూనికేషన్ పనులు. సుమారు విలువ (రూ.): 703688354.63 పూర్తయిన వ్యవధి: 18 నెలలు

పని యొక్క పూర్తి వివరణ, టెండర్ పరిస్థితులు, అర్హత ప్రమాణాలు మరియు వివరాలు, పైన పేర్కొన్న పనుల టెండర్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్‌తో సహా అన్ని వివరాల కోసం దయచేసి భారత ప్రభుత్వ టెండర్ పోర్టల్ వెబ్‌సైట్ www.ireps.gov.in ని సందర్శించండి.
డిప్యూటీ చీఫ్ సిగ్నల్ & టెలికాం ఇంజనీర్ (ప్రాజెక్ట్స్), సికింద్రాబాద్.

ఈ-టెండర్ ఆహ్వాన ప్రకటన (http://ireps.gov.in ద్వారా) PUB/1030

సికింద్రాబాద్ దక్షిణమధ్య రైల్వే చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ (కన్‌స్ట్రక్షన్) భారత రాష్ట్రపతి తరపున సింగిల్ ప్యాకెట్ టెండరింగ్ సిస్టమ్‌లో ఈ కింది పనుల కోసం ఈ-టెండర్‌ను ఆహ్వానిస్తున్నారు.

క్ర.సం: 01, NIT No.: టెండర్ నెంబర్: 02-2025-2026-E-GS-CN-GTL, పని పేరు: టెండర్ నెం: 02-2025-2026-E-GS-CN-GTL ఎలక్ట్రికల్ కన్‌స్ట్రక్షన్/GTL: గుంతకల్ డివిజన్: స్టేషన్ బిల్డింగ్ కోసం ఆర్‌బిఐఆ గదులు, గూమ్టీలు, RRI క్యాబిన్లు, FOB, ప్లాట్‌ఫారమ్ లైటింగ్, అప్రోచ్ రోడ్ లైటింగ్ మొదలైనవాటికి ఎలక్ట్రికల్ అరేంజ్‌మెంట్స్, మరియు గూటి, గుంతకల్ & లింగనేనిదొడ్డి యార్డ్ మోడిఫికేషన్ పనులకు సంబంధించి ఎల్‌టీ/హెచ్‌టీ ఓవర్ హెడ్‌లైన్ షిఫ్టింగ్ / మార్పు. అంచనా వ్యయం (రూ.): 4,71,32,220.18/- EMD (రూ.): 3,85,700.00/- టెండర్ డాక్యుమెంట్ కాస్ట్ (రూ): నిల్. పూర్తి కాలం : 12 నెలలు. ముగింపు తేదీ: 11.09.2025న 15:00గం.ల వరకు.

(1) బిడ్ డాక్యుమెంట్, ఇతర వివరాల కోసం దయచేసి http://ireps.gov.in వెబ్‌సైట్‌కి లాగిన్ అవ్వండి.
(2) ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ చెల్లింపు IREPSలో ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్న నెట్ బ్యాంకింగ్ / చెల్లింపు గేట్‌వే సౌకర్యాల ద్వారా మాత్రమే చేయాలి.
(3) టెండర్‌దారులు తమ ఆఫర్లను టెండర్ సమర్పణ వ్యవధిలో అంటే టెండర్ ముగింపుకు 15 రోజుల వ్యవధిలో ఆన్‌లైన్‌లో సమర్పించవచ్చు.
(4)టెండర్ సమర్పణ వ్యవధి ప్రారంభమయ్యే తేదీ వరకూ టెండర్‌దారుడు ఏదైనా కొరిజెండా (ఆన్‌లైన్‌లో మాత్రమే జారీచేయబడినది) కోసం గమనించాలి.
చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ (Const.), సికింద్రాబాద్
A1271

మరిన్ని టెండర్ షరతులు / వివరాల కోసం మరియు టెండర్ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవడానికి, దయచేసి http://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించండి.


# వ్యక్తిగత దాడులు చేయడమే ఆర్‌ఎస్‌ఎస్ పద్ధతి

ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ



**అరారియా :** వ్యక్తిగత దాడులు చేయడాన్ని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) ఎవరినైనా లక్ష్యంగా చేసుకునే పద్ధతిగా మార్చుకుందని, మహాత్మా గాంధీ విషయంలో కూడా అదే జరిగిందని ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. బిహార్‌లోని మహాఘట్‌బంధన్ మిత్రులతో జరిగిన సంభాషణలో రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. దీనికి సంబంధించిన వీడియోను ఆయన తన ఎక్స్ హ్యాండిల్‌లో పోస్ట్ చేశారు. వీడియోలో రాహుల్‌గాంధీ ఆదివారం బిహార్ అరారియాలోని ఒక ధాబాలో ఆర్‌జెడి నేత తేజస్వి యాదవ్, సిపిఐ(ఎంఎల్) చెందిన దీపాంకర్ భట్టాచార్య, వికాస్‌షీల్ ఇన్సాన్ పార్టీకి చెందిన ముఖేష్ సహాని, మహాత్మా గాంధీ మునిమనవడు తుషార్ గాంధీ, బిహార్ కాంగ్రెస్ చీఫ్ రాజేష్ కుమార్, కాంగ్రెస్ నాయకుడు షకీల్ అహ్మద్ ఖాన్‌లతో కలిసి టీ తాగుతున్నట్లు కనిపిస్తోంది. 'ఆర్‌ఎస్‌ఎస్‌ది వ్యక్తిగతంగా దాడులు చేసే పద్ధతి. వారు గాంధీజీతో ఎప్పుడూ అలా చేసేవారు. ఆయనపై ఆర్‌ఎస్‌ఎస్ ఎంత దుర్భాషలాడిందో ప్రజలకు తెలియదు. ఎంత పరువు నష్టం కలిగించిందో గుర్తుండదు. వారు గాంధీ గురించి చెప్పినవన్నీ అబద్ధాలే. ఇదే ఆర్‌ఎస్‌ఎస్ శైలి' అని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు అన్నారు. గతంలో చర్చలు చాలా బలంగా, వేడిగా ఉండేవని, కానీ ఎప్పుడూ వ్యక్తిగత దూషణలు ఉండేవి కాదని తుషార్ గాంధీ అన్నారు. కర్పూరి ఠాకూర్ జీని కూడా నిదించారని, ఆ అతనికి భారత రత్న ఇచ్చారని తేజస్వీ యాదవ్ అన్నారు. ఓటు చోరీపై మాట్లాడుతూ ప్రజలు తమ ఓటు వేసినట్లు చెబుతారని, కానీ ఫలితాలు వచ్చినప్పుడు వారి ఓటు ఎక్కడికి పోయిందని వారికి తెలియదని యాదవ్ అన్నారు. ఇప్పుడు, ఆధారాలు, వాస్తవాలతో బయటకు వస్తుండడంతో దొంగతనం జరుగుతోందని ప్రజలకు ఇప్పుడు తెలుసుకున్నారన్నారు. ఎన్నికల సంఘం, బిజెపి కలిసి కుట్ర చేసినట్లు ప్రజల్లో అనుమానాలు వచ్చాయని, ప్రధాని ఏది చెబితే ఇసి అదే చేస్తోందని ఆర్‌జెడి నేత అన్నారు. ఇలాంటి అభిప్రాయాలనే వ్యక్తం చేస్తూ సహాని మాట్లాడుతూ ప్రజలు తాము ఇండియా కూటమికి ఓటు వేశామని భావించారని, కానీ ఫలితం దీనికి విరుద్ధంగా ఉందని అన్నారు. 'ఇప్పుడు రాహుల్ గాంధీ వాస్తవాలను బయటకు తెచ్చారు, ప్రజలకు ఏదో తప్పు జరిగిందని, మోదీ జీ 'హెరా ఫేరీ' చేస్తున్నారని తెలుసు. వారి (బిజెపి) ఓటర్లు కూడా అలాగే నమ్మడం ప్రారంభించారు' అని విఐపి చీఫ్ అన్నారు. సహానీ, కాంగ్రెస్‌కు చెందిన కుమార్, ఖాన్ ఓటరు అధికార్ యాత్రను, ప్రజలలో ఉన్న ఉత్సాహాన్ని ప్రశంసించారు.

# గాంధీ కుటుంబానికి విధేయుడిని

### నా వ్యవహారంతో ఎవరైనా బాధపడి ఉంటే చింతిస్తున్నా...

### క్షమాపణలు కూడా చెబుతా : డికె. శివకుమార్



**బెంగళూరు :** ఆర్‌ఎస్‌ఎస్ గీతాలాపన వివాదంపై సొంత పార్టీలోనే విమర్శలు రావడంతో కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ ఈ ఘటనపై క్షమాపణలు చెబుతానన్నారు. అయితే అసెంబ్లీలో ప్రార్థన గీతాన్ని పాడటం ద్వారా తా ను బిజెపిని లక్ష్యంగా చేసుకోవాలనుకుందని పేర్కొన్నారు. తాను ఎలాంటి త ప్పు చేయలేదని పేర్కొంటూనే, కాంగ్రెస్ పార్టీలోని కొందరు ఈ ఘటనను దుర్వినియోగం చేసేందుకు, గందరగోళం సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారని శివకుమార్ ఆరోపించారు. తాను ఎవరి మనోభావాలను దెబ్బతీయాలనుకోవడం లేద ని, ఈ వ్యవహారంలో ఎవరైనా బాధపడి ఉంటే అందుకు చింతిస్తున్నానన్నారు. కాంగ్రెస్, గాంధీ కుటుంబం పట్ల తన విధేయతను పునరుద్ఘాటించారు. ఈ సంబంధం దేవుడికి, భక్తుడికి మధ్య ఉన్న బంధంలాంటిదని అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ ప్రార్థన గీతాన్ని పాడటం వల్ల ఎవరైనా బాధపడితే క్షమించండని తెలిపారు. తాను కాంగ్రెస్‌వాదిని, కాంగ్రెస్ వాదిగానే చనిపోతానన్నారు. బహిష్కరించబడి న క్యాబినెట్ సభ్యుడు, పార్టీ సహచర ఎమ్మెల్యే కె.ఎన్. రాజన్న శివకుమార్‌పై ఎందుకు చర్య తీసుకోలేదని ప్రశ్నించారు. తాను అసెంబ్లీలో 'పాసింగ్ రిఫరెన్స్' మాత్రమే చేశానని, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్)ను తాను ప్రశంసించలేదని శివకుమార్ స్పష్టం చేయడానికి ప్రయత్నించారు. ఇటీవల సభలో శివకుమార్ ఆర్‌ఎస్‌ఎస్ ప్రార్థన గీతంలోని రెండు పంక్తులను పఠించి అందరినీ ఆశ్చర్యపరిచారు. 'గత వారం అసెంబ్లీలో (జూన్ 4న చిన్నస్వామి స్టేడియం వెలుపల 11 మంది మరణించిన) తొక్కిసలాట ఘటనపై చర్చ సందర్భంగా, ప్ర తిపక్ష నాయకుడు ఆర్ అశోక కాలు లాగడానికి, నేను ఆర్‌ఎస్‌ఎస్ ప్రార్థనలోని రెండు లేదా మూడు పంక్తులు చదివాను. నా ఉద్దేశ్యం వారిని ప్రశంసించడం కా దు. నేను వారి (బిజెపి) కాలు లాగడానికి ప్రయత్నించాను. నా స్నేహితులు (కాంగ్రెస్‌లో) కొందరు దాని నుండి రాజకీయ కోణాన్ని చూడకుండా దానిని దుర్వినియోగం చేయడానికి, గందరగోళం సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారని, శివకుమార్ అన్నారు. నమ్మకమైన కాంగ్రెస్ సభ్యుడిగా తాను ఎవరి మనోభావాలను దెబ్బతీయనని అన్నారు.

### రాష్ట్ర శాసనసభలు ఆమోదించిన బిల్లులకు...

# అనుమతి అధికారం కోర్టులకు లేదు

గవర్నర్లు, రాష్ట్రపతికి మాత్రమే అధికారం ఉందని మహారాష్ట్ర తరపు న్యాయవాది హరీష్‌సాల్వే స్పష్టీకరణ

**న్యూఢిల్లీ :** రాష్ట్ర అసెంబ్లీలు ఆమోదించిన బిల్లులకు కోర్టులు అనుమతి ఇవ్వలేవని, ఆ అధికారం గవర్నర్లకు లేదా రాష్ట్రపతికి మాత్రమే ఉంటుందని మహారాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో వాదించింది. మహారాష్ట్ర తరపున ప్రాతినిధ్యం వహించిన సీనియర్ అడ్వకేట్ హరీష్ సాల్వే మంగళవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బిఆర్.గవాయ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం ముందు తన వాదనలు వినిపించారు. రాష్ట్ర శాసనసభలు ఆమోదించిన బిల్లులను గవర్నర్లు, రాష్ట్రపతి పరిష్కరించేందుకు కోర్టు కాలపరిమితి విధించవచ్చా అన్నదానిపై రాష్ట్రపతి విధించిన రిఫరీపై విచారణకు హరీష్ సాల్వే హాజరయ్యారు. 'గవర్నర్లు బిల్లులకు ఆమోదం తెలపాలని కోరుతూ కోర్టు మాండమస్ రిట్‌ను జారీ చేయదు. ఒక చట్టానికి ఆమోదం కోర్టు ఇవ్వదు. చట్టానికి గవర్నర్లు లేదా రాష్ట్రపతి ఆమోదం తెలపాల్సి ఉంటుంది' అని రాష్ట్రపతి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ పిఎస్.నర్సింహ్మా, జస్టిస్ ఎఎస్. చందుర్కర్‌లు కూడా ప్రాతినిధ్యం వహించిన రాజ్యాంగ ధర్మాసనం ముందు తన వాదనలు వినిపించారు. తమిళనాడు బిల్లులకు ఆమోదం తెలిపేందుకు సుప్రీంకోర్టుకు ఉన్నటువంటి ఆర్టికల్ 142 అధికారాన్ని జస్టిస్ జెబి.పార్థివాలా నేతృత్వంలోని ధర్మాసనం ఉపయోగించుకుంది. హరీష్‌సాల్వే మాట్లాడుతూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 361ను ప్రస్తావించారు. 'రాష్ట్రపతి లేదా గవర్నర్ తన పదవికి సంబంధించిన అధికారాలు, విధులను వినియోగించడం,నిర్వహించడం ఆ అధికారాలు, విధులను నిర్వర్తించడం, అతడు చేసిన లేదా చేయాలని అనుకుంటున్న చర్యకు సంబంధించి రాష్ట్రపతి లేదా గవర్నర్ ఏకోర్టుకూ జవాబుదారీగా ఉండరు. గవర్నర్లు లేదా రాష్ట్రపతి తీసుకునే నిర్ణయాలతో సహా ప్రతిపాదిత నిర్ణయాలను మాత్రమే కోర్టు విచారించగలదు' అని సాల్వే అన్నారు. కోర్టు మీ నిర్ణయం ఏమిటని మాత్రమే అడుగగలదు. కానీ మీరు ఈ నిర్ణయం ఎందుకు తీసుకున్నారని అడగకూడదు' అని హరీష్‌సాల్వే వాదించారు.రాష్ట్రపతి, గవర్నర్ల అధికారాలను వేరుచేస్తూ మొదటిది కేంద్ర ప్రభుత్వ సహాయం, సలహాపై మాత్రమే పనిచేస్తుందని, రెండవది విస్తృత అధికారాలను కలిగి ఉంటుందని, అందులో ఆమోదాన్ని నిలుపుదల చేసే అధికారం కూడా ఉందని మహారాష్ట్ర ప్రభుత్వం తరపు న్యాయవాది సాల్వే స్పష్టం తెలిపారు. బిల్లులకు సంబంధించి గవర్నర్ల అధికారాలను వివరించే ఆర్టికల్ 200ను ప్రస్తావిస్తూ ఈ నిబంధన గవర్నర్ చర్య తీసుకోవాల్సిన కాలపరిమితి చర్యను సూచించదని ఆయన స్పష్టంచేశారు. బిల్లుల ఆమోదం కూడా చర్చలపై ఆధారపడి ఉంటుందని, కొన్నిసార్లు అలాంటి ప్రక్రియకు 15రోజులు, కొన్ని సమయాలలో ఆరు నెలలు పట్టవచ్చని అన్నారు. ఆర్టికల్ 361 గవర్నర్ల భాష, అధికారాలను వినియోగించడంలో వారు ఏ కోర్టుకూ జవాబుదారీగా ఉండరని, 'ఇది చాలా స్పష్టంగా ఉంది' అని హరీష్ సాల్వే వివరించారు. మధ్యప్రదేశ్ తరపున హాజరైన సీనియర్ అడ్వకేట్ ఎన్‌కె.కౌల్ వాదనలు వినిపిస్తూ గవర్నర్ మూడు స్పష్టమైన ఎంపికలను కలిగిఉన్నారని, అవి ఆమోదం, ఆమోదం నిలుపుదల చేయడం, బిల్లును రాష్ట్రపతికి రిజర్వ్ చేయడం అని చెప్పారు. సీనియర్ అడ్వకేట్ మనీందర్ సింగ్ రాజస్థాన్ తరపున వాదించారు.గవర్నర్ చర్య తీసుకోవడాన్ని నిరా కరిస్తే న్యాయవ్యవస్థ శక్తిహీనం అవుతుందా అని అంతకుముందు ధర్మాసనం ప్రశ్నించింది.

### సౌరభ్ భరద్వాజ్ నివాసంలో

# ఇడి సోదాలు



**న్యూఢిల్లీ:** ఆమ్ ఆద్మీ పార్టీ సీనియర్ నేత, ఢిల్లీ మాజీ మంత్రి సౌరభ్ భరద్వాజ్ నివాసంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు సోదాలు చేపట్టారు. ఆయన ఆరోగ్యశాఖ మంత్రిగా ఉన్న సమయంలో చేపట్టిన ఆసుపత్రుల నిర్మాణంలో పలు అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ కుంభకోణానికి సంబంధించి ఇడి మంగళవారం తనిఖీలు చేపట్టింది. ఢిల్లీలోని సౌరభ్ భరద్వాజ్ నివాసంతో పాటు మరో 12 ప్రాంతాల్లో ఏకకాలంలో దర్యాప్తు సంస్థ అధికారులు ఈ సోదాలు చేపట్టారు. 2018–19లో ఆమ్ ఆద్మీ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో 24 ఆసుపత్రుల నిర్మాణం కోసం అప్పటి ప్రభుత్వం రూ.5,590 కోట్లతో ప్రాజెక్టుకు ఆమోదం తెలిపింది. ఓ ఐసియు ఆసుపత్రిని ఆరు నెలల్లో పూర్తి చేయాల్సి ఉండగా.. మూడేళ్లు దాటినా అది పూర్తికాలేదు. ఇందుకోసం రూ.800 కోట్లు ఖర్చు చేసినా.. కేవలం సగం పనులు మాత్రమే పూర్తయ్యాయి. దీంతో ఆ ప్రాజెక్టులో అవకతవకలు ఉన్నట్లు ఆరోపణలు వచ్చాయి. వీటి ఆధారంగా ఇడి మనీలాండరింగ్ కేసు నమోదు చేసింది. ఈ కేసులోనే తాజాగా సౌరభ్ భరద్వాజ్ నివాసంలో తనిఖీలు చేపట్టింది. ఈ దాడులను ఆమ్ ఆద్మీ పార్టీ తీవ్రంగా ఖండించింది. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు సౌరభ్‌పై తప్పుడు కేసు నమోదు చేశారని ఆప్ ఆరోపించింది. ఇడి చెబుతున్న సమయంలో ఆయన మంత్రిగా లేరని తెలిపింది.


SHRIRAM Finance — వాహనముల బహిరంగ వేలం ప్రకటన

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీన పరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించనైనది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | TS11UB 2288 | Putta Swapna | TATA ACE | 2017 |
| 2 | TS25E 2481 | Ram Reddy Baddam | KUBOTA MU5501 COMBINE HARVESTER | 2020 |
| 3 | TS02EH 4614 | Gandham Ramanakar | CAT 424 B | 2014 |
| 4 | AP29TB 0189 | Rushi Kumar Nannamshetti | TATA LPT 3118 CUMMINS FBT | 2010 |
| 5 | TS25T 1932 | Sammaiah Nambula | TATA ACE | 2016 |
| 6 | TX03FD 7893 | Kumar Nallela | MAHINDRA YUVO 575DI | 2021 |

AUCTION DATE : 30-08-2025
VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL
గమనిక : ప్రకటన తేది నుండి బండి అమ్ముడు అయ్యే వరకు వర్తించును

SHRIRAM FINANCE LIMITED
H.No :4-316,4-317,4-318, Ground Floor,
Opp : Fire Station, Parkal, Warangal Rural
Cell :96667 26222, 9989766426

ప్రజాపక్షం
బుధవారం, 27 ఆగస్టు

# తమిళ రాజకీయాల్లో మూడోశక్తి

తమిళనాడు రాజకీయ క్షేత్రంలో మూడవశక్తికి అవకాశముందా? దీర్ఘకాలంగా ద్విముఖ విభజనతో సాగుతున్న రాజకీయంలోకి ఈ తరం పాపులర్ సినిమా హీరో జోసఫ్ విజయ్ గత సంవత్సరం మెరుపులా ప్రవేశించి తమిళగ వెట్రి కళగం (టివికె) అనే పేరుతో కొత్త పార్టీ స్థాపించారు. మదురైలో గతవారం నిర్వహించిన జనసందోహ సభలో, 2026 అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర రాజకీయ చరిత్రలో కొత్త అధ్యాయం లిఖిస్తామని ప్రకటించారు. విజయ్‌ను రాజకీయాల్లోకి ప్రోత్సహించింది ఆయన తండ్రి, డైరెక్టర్ ఎస్.ఎ.చంద్రశేఖర్. తొలుత ఆసక్తి చూపని విజయ్‌కు, సూపర్ స్టార్ రజనీకాంత్ నిర్ణయం ప్రేరణ అయింది. రాజకీయ పార్టీ ప్రకటించేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్న రజనీకాంత్, ఆఖరు నిముషంలో అనారోగ్య కారణాలతో ఆ ప్రయత్నం విరమించుకున్నట్లు ప్రకటించారు. ప్రజాకర్షక నాయకులు కరుణానిధి, జయలలిత మరణానంతరం ఏర్పడిన రాజకీయ జాగాను ఆక్రమించుకునేందుకై విజయ్ నడుంకట్టాడు. ఆయన ఇప్పుడు చేతిలో ఉన్న సినిమా పూర్తిచేసే పనిలో ఉన్నాడు. అయితే సినీగ్లామర్ మాత్రమే అధికార అందలం అధిరోహించటానికి సరిపోతుందా?

సినిమా రంగానికి తమిళ రాజకీయాలకు అవినాభావ సంబంధం ఉంది. డిఎంకె వ్యవస్థాపకుడు సి.ఎన్.అన్నాదురై మొదలు ఆయన శిష్యుడు కరుణానిధి, ఎం.జి.రామచంద్రన్, జయలలిత – అందరూ సినీప్రముఖులే. వారు ముఖ్యమంత్రులుగా చెరగని ముద్ర వేశారు. డిఎండికె పార్టీ స్థాపించిన మరో సినీ హీరో విజయకాంత్, కాంగ్రెస్‌వాదిగా ఉండిన శివాజీ గణేశన్ రాజకీయంగా వృద్ధిలోకి రాలేదు. మక్కల్ నీధి మైయం పార్టీ ఏర్పాటు చేసుకున్న మరో పాపులర్ హీరో కమల్ హాసన్ ఒంటరిపోరాటంలో ఓడిపోయి డిఎంకెతో స్నేహంతో రాజ్యసభ సభ్యుడైనారు. ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ ఒక సీరియల్‌లో నటించగా, ఆయన కుమారుడు ఉదయనిధి స్టాలిన్ పలు సినిమాల్లో నటించారు, నిర్మించారు. తండ్రి రాజకీయ వారసత్వం అందిపుచ్చుకునేందుకై గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసి, గెలిచి, ప్రస్తుతం మంత్రిగా పనిచేస్తున్నారు.

సినిమా గ్లామర్, అభిమానుల కేరింతలు, కులాభిమానం వంటివి మాత్రమే రాజకీయ ఎదుగుదలకు సరిపోవని విజయ్ గుర్తించాలి. కాంగ్రెస్‌ను ఓడించి డిఎంకె తొలిసారి అధికారంలోకి వచ్చిన 1967 ఎన్నికల్లో ఎం.జి.రామచంద్రన్ విరివిగా ప్రచారం చేశారు. 1952 నుంచి 1972 వరకు డిఎంకెలో తనకొక రాజకీయ ప్రఖ్యాతి ఆర్జించారు. తన సినీమాలను రాజకీయంగా కూడా తన వ్యక్తి ఆరాధనకు ఉపయోగించుకున్నారు. జయలలిత కూడా ఎఐడిఎంకె ప్రధాన కార్యదర్శిగా పార్టీ నిర్మాణానికి ఎంతో శ్రమించారు. అందువల్ల రాజకీయాల్లో నిలదొక్కుకోవటానికి బలమైన సంస్థాగత నిర్మాణం అవసరం.

మద్రాసు రాష్ట్రం తమిళనాడుగా నామాంతరం పొందిన 1969 జనవరి 14నుంచీ రాజకీయ వ్యవస్థ ద్విముఖంగా సాగుతున్నది. తొలుత కాంగ్రెస్–డిఎంకె ప్రధాన ప్రత్యర్థులు. కమ్యూనిస్టు పార్టీ మరో బలమైన రాజకీయశక్తి. ద్రవిడ మున్నేట్ర కళగం నుంచి బయటకు వచ్చిన ప్రముఖ నాయకుడు, ప్రజాదరణ పొందిన సినిమా హీరో ఎం.జి.రామచంద్రన్ 1972 అక్టోబర్‌లో అఖిల భారత అన్నా డిఎంకె (ఎఐఎడిఎంకె) ఏర్పాటు చేసి తృతీయశక్తిగా ఆవిర్భవించారు. అయితే 1969లో కాంగ్రెస్ పార్టీలో చీలిక దరిమిలా దాని ప్రభావం తగ్గుదల, మూపనార్ అనే ముఖ్య నాయకుడు తమిళమానిల కాంగ్రెస్ ఏర్పాటు చేయట వంటి పరిణామాలతో కాంగ్రెస్ ప్రభావం తగ్గింది. తమిళ రాజకీయ క్షేత్రంలో డిఎంకె, అన్నా డిఎంకె ప్రధాన ప్రత్యర్థులుగా ఆవిర్భవించాయి. ఎం.జి.రామచంద్రన్ మరణానంతరం ఆయన అనుయాయి, ప్రముఖ సినీనటి కుమారి జె.జయలలిత పార్టీ బాధ్యతలు చేబట్టిన తదుపరి కూడా ఆ రెండు పార్టీల మధ్యనే అధికార మార్పిడి జరుగుతూ వచ్చింది. కాంగ్రెస్ సహా మిగతా పార్టీలు ఆయా సందర్భాలనుబట్టి ఆ పార్టీలతో పొత్తులో భాగస్వాములు కావటంతో ద్విముఖ రాజకీయ విభజన కొనసాగుతూ ఉంది.

ద్రవిడ పార్టీల భుజాలపై ఎక్కి వృద్ధిలోకి రావాలని కోరుకుంటున్న బిజెపి పాచికలు పారటం లేదు. దాని హిందుత్వ రాజకీయాలే దానికి శత్రువు. ఛిన్నాభిన్నమైన ఎఐఎడిఎంకెలో పళనిస్వామి గ్రూపుతో పొత్తు కుదుర్చుకుంది. విజయ్‌పార్టీని కూడా ఆకర్షించాలని చూస్తోంది. అయితే హిందుత్వ రాజకీయాలకు వ్యతిరేకతను ప్రకటించారు విజయ్. తాను ప్రధాన శక్తిగా తనతో కలిసివచ్చే చిన్నాచితక పార్టీలతో పొత్తుకు అతడు సిద్ధం. అయితే పార్టీ పెట్టి సంవత్సరం గడిచినా విజయ్ తన పార్టీ భావజాలమేమిటో, ఎన్నికల వ్యూహమేమిటో ప్రకటించలేదు. డిఎంకె కూటమి చెక్కుచెదరకుండా బలంగా కొనసాగుతున్నది. కాబట్టి విజయ్ రాజకీయ ఆకాంక్షలను జనక్షేత్రంలో పరీక్షించుకోవటానికి సమయం ఎంతో దూరంలో లేదు.

# నన్ను బంగ్లాదేశ్ పంపుతారా? అమర్త్యసేన్

**అరుణ్ శ్రీవాస్తవ**

పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతాలో 'భారత యువత : వారు పొందాల్సిన సామాజిక అవకాశాలు' అనే అంశంపై జరిగిన బహిరంగ చర్చలో 91 ఏళ్ల నోబెల్ పురస్కార గ్రహీత అమర్త్యసేన్ శుక్రవారం వ్యక్తం చేసిన ఆందోళన తీవ్ర చర్చనీయాంశమైంది. అదే రోజున సమీపంలోని డమ్‌డమ్‌లో చొరబాటుదారులను తరిమివేయాలని నరేంద్ర మోదీ చేసిన ప్రసంగం నేపథ్యంలో, 'నా పూర్వీకుల ఇల్లు ఢాకాలో ఉంది కాబట్టి, నన్ను బంగ్లాదేశ్‌కు తిరిగి పంపించే అవకాశం ఉంది' అని అమర్త్యాసేన్ చేసిన వ్యాఖ్యలు విద్యావేత్తలు సహా పౌరులందరిలోనూ తీవ్ర చర్చకు దారితీశాయి.

సేన్ తన భయాన్ని వ్యక్తం చేయడానికి ప్రధాన కారణం ఓటర్ల జాబితా ముమ్మర రివిజన్ (ఎస్ఐఆర్) ప్రవేశపెట్టడం. (భారత ఎన్నికల కమిషన్) ఇసిఐ ఎస్ఐఆర్ ను ప్రవేశపెట్టిన తర్వాత, భారతదేశంలో దాక్కున్న బంగ్లాదేశీ, నేపాల్, మయన్మార్ వలసదారులను గుర్తించడానికి వేట మొదలైంది. భారతదేశం అంతటా ఉన్న బెంగాలీ మాట్లాడే ప్రజలు కాషాయ శక్తుల, కార్యకర్తల లక్ష్యంగా మారారు. ఢిల్లీ, గురుగ్రామ్, ముంబైలలో ముఖ్యంగా కాషాయ ప్రభావం, అనుయాయులు ఉన్న ప్రాంతాలలో జీవనోపాధి కోసం కష్టపడుతున్న కొంతమంది బెంగాలీ మాట్లాడే వలసదారులను బంగ్లాదేశ్‌కు పంపించారు. అయితే, వారు భారతీయ బెంగాలీలు కావడంతో చివరికి తిరిగి బెంగాల్‌కే పంపబడ్డారు.

మోదీ ప్రభుత్వం తీసుకున్న ఈ చర్యను, ముఖ్యంగా వివిధ రాష్ట్రాలలో బెంగాలీ మాట్లాడే ప్రజలకు వ్యతిరేకంగా పెరుగుతున్న భాషా అసహనానికి సంకేతంగా సేన్ అభివర్ణించినప్పటికీ, ఇది ప్రధానంగా బెంగాలీలు పాలకపక్షానికి వ్యతిరేకంగా, ప్రజానుకూలురుగా ఉంటారనే అసూయ కలిగించే వారి విశ్వసనీయతకు శిక్షగా భావించబడింది. బ్యూరోక్రాట్లు లేదా రాజకీయ నాయకులలో మితవాద శక్తులకు బెంగాలీ భాష, సంస్కృతి, నాగరికత చరిత్ర గురించి అవగాహన లేకపోవడం ఊహించలేము.

నరేంద్ర మోదీ ప్రధానమంత్రి అయినప్పటి నుంచి బిజెపి ఎన్నికల ద్వారా బెంగాల్‌ను దక్కించుకునేందుకు ప్రయత్నిస్తోంది. కానీ దాని ప్రయత్నాలన్నీ విఫల యత్నాలుగా మారాయి. బెంగాలీలు ప్రధానమంత్రి అభ్యర్థనకు స్పందించలేదు. ఇది వాస్తవానికి బెంగాలీలను అవమానించడానికి, వారిపట్ల తీవ్రమైన ధిక్కారాన్ని చూపించడానికి మోదీకి ప్రధాన కారణం అయింది. పశ్చిమ బెంగాల్ బిజెపి నాయకులలో ఒకరైన ప్రతిపక్ష నాయకుడు సువేందు అధికారి మాట్లాడుతూ 'మనకు బెంగాల్‌లో ఎస్ఐఆర్ అవసరం. మేము రోహింగ్యా, బంగ్లాదేశీ ముస్లింలను ఓటర్ల జాబితాలోకి అనుమతించము' అని అనడం ద్వారా కాషాయ వ్యూహం బయటపడింది.

ఎస్ఐఆర్ దళితులు, శ్రామికులు, మైనారిటీలతో పాటు బెంగాలీలను కూడా లక్ష్యంగా చేసుకున్నందనేందుకు ఎలాంటి సందేహం లేదు. సుప్రీంకోర్టు ఆధార్‌ను గుర్తింపు రుజువుగా అంగీకరించాలని సూచించినప్పటికీ, దానిని అంగీకరించడానికి మొదట్లో ప్రధాన ఎన్నికల కమిషనర్ అయిష్టత చూపడం ద్వారా మోదీ, షా మొండితనం అర్థం చేసుకోవచ్చు. బంగ్లాదేశ్ నుండి బెంగాల్‌కు వలస వచ్చిన ముస్లింలలో చాలామంది ఆధార్, ఎపిక్(ఓటర్ ఫోటో గుర్తింపు) కార్డులను పొందారని ఆర్ఎస్ఎస్, బిజెపి నాయకులు భావిస్తున్నారు. ఆర్ఎస్ఎస్, బిజెపి నాయకుల అభిప్రాయం ప్రకారం, ముస్లింలు ఆధార్, ఎపిక్ కార్డులను పొందగలిగిన మరో ప్రాంతం బిహార్‌లోని పూర్వాంచల్. ఇందులో కిషన్‌గంజ్, పూర్ణియా, కతీహార్, భాగల్‌పూర్ ఉన్నాయి. అయితే, కిషన్‌గంజ్ మాదిరిగా ఇవి నేరుగా బెంగాల్ సరిహద్దును ఆనుకుని లేవు.

ఇండియా కూటమి మొదట్లో ఎస్ఐఆర్ ను పూర్తిగా రద్దు చేయాలని కోరుకుంది. అయితే, ఈ ఒక్క కారణంతో ఇసిఐ అంగీకరించలేదు. తన చర్యను సమర్థించుకోవడానికి అత్యుత్తమ న్యాయ నిపుణులను ఉపయోగిస్తోంది. దురదృష్టవశాత్తు, సిఇసి, ఇసిఐ తమ లక్ష్యంలో చాలా వరకు విజయం సాధించాయి. శుక్రవారం బిహార్‌లోని ముసాయిదా ఓటర్ల జాబితా నుండి 65 లక్షల పేర్ల తొలగింపును పరిశీలించే బాధ్యతను సుప్రీంకోర్టు రాజకీయ పార్టీలపై పెట్టింది. ఆన్‌లైన్‌లో అభ్యంతరాలు, తాజా దరఖాస్తులను దాఖలు చేయవచ్చని కూడా కోర్టు పేర్కొంది.



ఆధార్‌ను రుజువుగా అంగీకరించాలని మూడవసారి సర్వోన్నత న్యాయస్థానం సిఇసిని కోరినప్పటికీ, ఆ ఆదేశం అమలు అవుతుందా లేదా అనేది ఇంకా స్పష్టంగా లేదు.

తుది ఓటర్ల జాబితాను ప్రకటించడానికి చివరి తేదీ అయిన సెప్టెంబర్ 1లోగా బిఎల్‌ఏలు లేదా బిఎల్‌ఓలు ఈ పనిని పూర్తి చేస్తారా అనేది నిజంగా ఆసక్తికరంగా ఉంది. బిహార్‌లోని 12 ప్రధాన రాజకీయ పార్టీల బూత్‌స్థాయి ఏజెంట్లకు (బిఎల్‌ఏలకు) 65 లక్షల తొలగింపుల కచ్చితత్వాన్ని తనిఖీ చేయడంలో ఇసిఐకి సహాయపడాలని కూడా కోర్టు ఆదేశించింది. ఈ ఆదేశం నిరుపయోగంగా ఉంటుంది. గత రెండు నెలల్లో చనిపోయిన వారి పేర్లను కూడా గుర్తించలేని ఇసిఐ, 8 రోజుల్లో ఈ పనిని ఎలా సాధించగలదు? స్వచ్ఛమైన ఓటర్ల జాబితాను ప్రచురించాలనే డిమాండ్‌ను అడ్డుకోవడానికి ఇసిఐ నుండి వచ్చిన ఈ సూచన కేవలం ఒక పన్నాగం మాత్రమే.

సిఇసి జ్ఞానేశ్ కుమార్ సుప్రీంకోర్టు దృష్టిని మరల్చడంలో విజయం సాధించారని చెప్పడం అతిశయోక్తి కాదు. ఒకవేళ సిఇసి, ఇసిఐ నిజంగా ఆ తప్పును సరిదిద్దడానికి నిబద్ధతతో ఉండి ఉంటే, ప్రారంభ విచారణ సందర్భంగా రెండు నెలల క్రితమే ఈ సూచనతో ముందుకు వచ్చి ఉండాల్సింది. ప్రతిపక్ష పార్టీలు ఫిర్యాదు చేసినప్పటికీ, బిఎల్‌ఏలు జోక్యం చేసుకోవడానికి అనుమతించకూడదనే సిఇసి మొండితనం ఆ తప్పును సరిదిద్దడానికి దాని అయిష్టతను స్పష్టం చేసింది. మరణం, పలు చోట్ల నమోదు, వలస,ఆచూకీ తెలియని కారణంగా తొలగించబడిన 65 లక్షల ఓటర్ల పరిశీలనను బిఎల్‌ఏలు ఎనిమిది రోజుల్లో పూర్తి చేస్తారనేది ఒక భ్రమ.

ఓటర్లు తమ అభ్యంతరాలను ఆన్‌లైన్‌లో సమర్పించవచ్చని కూడా సర్వోన్నత న్యాయస్థానం సూచించింది. ఇటీవల వచ్చిన వరదల వల్ల నిరాశ్రయులైన వలస కూలీలు లేదా పేదలు తమ ఫారాలను ఆన్‌లైన్‌లో సమర్పించగలరని ధైర్యంగా ఆ బెంచ్లోని న్యాయమూర్తులు చెప్పగలరా? అభాగ్యులకు ఆన్‌లైన్ సదుపాయాలను సిఇసి, ఇసిఐ అందుబాటులోకి తీసుకురాగలవా? భోజ్‌పూర్‌లోని జమానియాతో సహా వేలాది జనాభా ఉన్న రెండు గ్రామాలు పూర్తిగా నాశనమయ్యాయి అనే వాస్తవం న్యాయమూర్తులకు తెలిసి ఉండాలి. నితీశ్ ప్రభుత్వం వారిని ప్రత్యామ్నాయ ప్రదేశానికి తరలించడానికి కూడా చర్యలు తీసుకోలేదు. ఎవరు ఎక్కడకు తరలించబడ్డారో తెలియదు. ఈ గ్రామాల ప్రజలకు నివాస గుర్తింపుగా ఆధార్‌ను కూడా అందించడం సాధ్యమేనా?

సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ నుండి రెండు ఫిర్యాదులు అంగీకరించబడ్డాయని శుక్రవారం ఇసిఐ ప్రకటించింది. ఆ రోజు విచారణ ముగింపులో కోర్టు తన ఉత్తర్వులో ఈ విషయాన్ని గుర్తించింది. అయితే, రాజకీయ పార్టీలు పత్రాలను సమర్పించడానికి ఆసక్తి చూపడం లేదనే అభిప్రాయం ఏర్పడటం బాధాకరం. కోర్టు మాట్లాడుతూ '1.68 లక్షల బిఎల్‌ఏలు ఇప్పటివరకు కేవలం రెండు అభ్యంతరాలను మాత్రమే దాఖలు చేయడం చూసి మేము ఆశ్చర్యపోయాము' అని పేర్కొంది. కానీ వాస్తవం ఏమిటంటే, బిఎల్‌ఏలు అభ్యంతరాలను సమర్పించడానికి అనుమతించబడటం లేదు. ఈ మేరకు సిపిఐ(ఎంఎల్) ఒక అధికారిక ఫిర్యాదు కూడా సమర్పించింది.

బిఎల్‌ఓలు అలాంటి (ఆన్‌లైన్) ఫారాలను స్వీకరించకుండా ఎందుకు నిరోధించబడ్డారని సిఇసి నుండి ఒక సాధారణ, స్పష్టమైన సమాధానాన్ని కోర్టు కోరి ఉండాల్సింది. ఇండియా కూటమి, ముఖ్యం గా రాహుల్ గాంధీ ఈ కుంభకోణాన్ని బయటపెట్టడమే లక్ష్యంగా పెట్టుకున్నప్పుడు,ఇసిఐ వాదనను ఎవరైనా ఎలా నమ్మగలరు? సీనియర్ న్యాయవాదులైన కపిల్ సిబల్, బృందా గ్రోవర్, అభిషేక్ మను సింఘ్వీ, ప్రశాంత్ భూషణ్ , ఇతరులకు ఈ విషయం తెలియదని ఈసీఐ ప్రజలు నమ్మాలని కోరుకుంటుందా?

సిపిఐ(ఎంఎల్) ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య మాట్లాడుతూ 'మా బూత్‌స్థాయి ఏజెంట్లు (బిఎల్‌ఏలు) మొదటి రోజు నుంచే ఫిర్యాదులు సమర్పిస్తున్నారు. అన్యాయమైన తొలగింపులకు వ్యతిరేకంగా ఫిర్యాదుల కోసం ఫారం 6ను కూడా ఉపయోగించవచ్చని ప్రధాన ఎన్నికల అధికారి స్పష్టం చేశారు. మా బిఎల్‌ఏలు అదే చేస్తున్నారు. అయినప్పటికీ ఇసి'0' ఫిర్యాదులు చూపిస్తోంది!' అని ఆయన అన్నారు. 'మేము మళ్లీ విచారించినప్పుడు, బిఎల్‌ఏలు సంతకం చేయాల్సిన అఫిడవిట్ గురించి మాకు చెప్పారు. చివరికి, నేటి విచారణకు ముందు, వారు మా రెండు ఫిర్యాదులను మాత్రమే అంగీకరించారు' అని దీపాంకర్ తెలిపారు. 'మాకు దాదాపు 3,000 మంది బిఎల్‌ఏలు ఉన్నారు, కానీ వారిలో సగం మంది పేర్లు ఇంకా అధికారికంగా ప్రభుత్వం ద్వారా గుర్తించబడలేదు, ఇది కూడా మా ఫిర్యాదులను దాఖలు చేయగల సామర్థ్యాన్ని పరిమితం చేస్తోంది' అని ఆయన అన్నారు. బిహార్‌లోని సిపిఐఎంఎల్ లిబరేషన్‌కు చెందిన 1,496 బిఎల్‌ఏలను ఎన్నికల అధికారులు అధికారికంగా గుర్తించారు.

అయినప్పటికీ రాహుల్ శుక్రవారం ఓటర్ల జాబితాలోని తప్పులను సరిదిద్దడానికి సిఇసి అయిష్టతకు అసలు కారణాన్ని బయటపెట్టారు. 'ఎస్ఐఆర్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బిజెపి, ఇసి మీ ఓట్లను దొంగిలించడానికి చేసే ప్రయత్నం. మోదీ ప్రభుత్వం 'దొంగిలించిన ఓట్ల'పై ఏర్పడింది, అందుకే అది ప్రజల సమస్యలను పట్టించుకోదు. నేను మిమ్మల్ని ఒక సూటి ప్రశ్న అడగాలనుకుంటున్నాను. దొంగిలించిన ఓట్ల ద్వారా ఏర్పడిన ప్రభుత్వం ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశ్యం ఎప్పుడైనా కలిగి ఉంటుందా?' అని ఆయన అన్నారు. 'రికార్డు స్థాయి నిరుద్యోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తోంది. కానీ ప్రభుత్వం పెట్టుబడిదారుల ఖజానాలను నింపుతూనే ఉంది'అని ఆయన అన్నారు.

'మీరు జీవించినా, చనిపోయినా, బాధపడినా అది వారికి తేడా చేయదు. ప్రజలు ఓటు వేసినా వేయకపోయినా, దొంగతనం ద్వారా తిరిగి అధికారంలోకి వస్తామని వారికి నమ్మకం ఉంది. ఎస్ఐఆర్ అనేది మీ ఓట్లను దొంగిలించడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బిజెపి, ఇసి చేసే ప్రయత్నం. మీ ఓటు హక్కులను లాక్కోవడానికి వారు తమ వంతు కృషి చేస్తున్నారు. ఓట్ చోరీ అనేది భారతదేశ రాజ్యాంగంపై దాడి' అని ఆయన అన్నారు.

# ప్రతిభులను ఆకర్షిస్తున్న చైనా, బెంబేలెత్తుతున్న అమెరికా!



ఎం.కోటేశ్వరరావు

అవును ఎవరు అవునన్నా కాదన్నా, మరొకటన్నా ఇది నిజం. సూర్యుడు తూర్పున ఉదయించి పశ్చిమాన అస్తమిస్తున్నట్లుగా మేథావులందరూ పశ్చిమ దేశాలలోనే పుట్టారు, మిగతా దేశాల వారు అక్కడికే వెళతారు అన్నట్లుగా కొందరు చాలా కాలంగా జనాల మెదళ్లకు ఎక్కించారు. ఇప్పుడు చైనా కమ్యూనిస్టులు దాన్ని తలకిందులు చేస్తున్నారు. గత శతాబ్దిలో ప్రపంచాన్ని ఏలిన చమురుకు ప్రాధాన్యత కొనసాగుతూనే ఉంది. అయితే అదే సర్వస్వం కాదని తేలిపోయింది. దాన్ని పక్కన పెట్టే " ప్రతిభ " ప్రత్యామ్నాయ హరిత ఇంధనం, క్వాంటమ్, కృత్రిమ మేథ వంటి రూపాల్లో ముందుకు వస్తున్నది. చమురుతో పని లేకుండా నడిచే విద్యుత్ వాహనాలు రోడ్లను ముంచెత్తటం తెలిసిందే. ఈ పూర్వరంగంలో శాస్త్ర, సాంకేతిక రంగాల్లో 2035 నాటికి అమెరికాను అధిగమించేందుకు చైనా నడుంకట్టటం గురించి కొద్ది నెలలుగా మీడియాలో విశ్లేషణలు వెలువడుతున్నాయి, అవేవీ కమ్యూనిస్టులు నడిపేవి కాదు, చివరికి కరడుగట్టిన ఆర్ఎస్ఎస్ వాదుల పచ్చి కమ్యూనిస్టు వ్యతిరేక పత్రిక "స్వరాజ్య "లో 2025 జూన్ 27న అమిత్ మిశ్రా అనే విశ్లేషకుడు కూడా రాశారు.దాన్ని నవీకరించి ఆగస్టు మూడున తిరిగి ప్రచురించారు. " మేథోవంతుల ఆకర్షణ : వేయి ప్రతిభల చైనా వ్యూహం దాని ఔన్నత్యాన్ని ఎలా ముందుకు నెడుతున్నది " అనే శీర్షిక( కోర్టింగ్ జీనియసెస్ : హౌ చైనాస్ థౌసెండ్ టాలెంట్స్ స్ట్రాటజీ ఈస్ ఫ్యూయలింగ్ ఇట్స్ ఎసెంట్)తో ఒక విశ్లేషణ వెలువడింది. ఇక్కడ దీన్ని ప్రస్తావించటం అంటే చైనాకు మిత,మతవాదుల సర్టిఫికెట్ లేదా ప్రశంసల గురించి కాదు. చైనా ఎలా దూసుకుపోతున్నదో చూడండి అనే ఉక్రోషం, అసూయ ప్రదర్శన దాని వెనుక ఉందని చెప్పేందుకే.

ఇక సందర్భానికి వస్తే ఈ ఏడాది అక్టోబరు ఒకటి నుంచి అంటే విప్లవదినోత్సవం రోజు నుంచి చైనా ప్రభుత్వం ప్రపంచంలోని యువ ప్రతిభావంతులను ఆకర్షించేందుకు కె రకం వీసాలను జారీ చేయాలని నిర్ణయించింది. ఎందుకు అంటే 2035నాటికి శాస్త్ర, సాంకేతిక రంగాలలో అగ్రగామి దేశంగా మారేందుకు అక్కడి కమ్యూనిస్టు పార్టీ నిర్ణయించింది. కొత్తగా పట్టా పుచ్చుకున్న స్వదేశీయులు లేదా విదేశీ విశ్వవిద్యాలయాల నుంచి వచ్చిన వారు, ఇతర దేశాల్లో ఇప్పటికే ఆయా రంగాలలో పనిచేస్తున్న వారిని ఆకర్షించేందుకు పూనుకుంది. ఇటీవలి కాలంలో చైనా విధాన నిర్ణయాలలో ఇది పెద్దదని భావిస్తున్నారు. తనకు ఎదురులేనంతవరకు చైనాను ఎదగనిచ్చిన అమెరికా ఎప్పుడైతే తన ఆధిపత్యానికి అన్ని రంగాలలో ప్రతిఘటన ఎదురవుతున్నదని గ్రహించిందో అప్పటి నుంచి అడ్డుకోవటం ప్రారంభించింది. వైట్‌హౌస్‌లో ఏ పార్టీ వారున్నా అదే చేస్తున్న పూర్వరంగంలో దానికి ధీటుగా చైనా కమ్యూనిస్టు పార్టీ చేసిన కసరత్తు నుంచి వెలువడిందే తాజా నిర్ణయం. ప్రధాని లీ క్వియాంగ్ సంతకంతో అది చట్టంగా మారింది. స్టెమ్(సైన్సు, టెక్నాలజీ, ఇంజనీరింగ్, గణితం) రంగాలలో ప్రతిభావంతులైన విదేశీ యువతను ఆకర్షించేందుకు సరికొత్త " యువ ప్రతిభ " కె వీసా ప్రత్యేకత ఏమంటే చైనాలో ఉన్న కంపెనీల యజమానులు లేదా సంస్థల నుంచి సిఫార్సులు అవసరం లేదు.నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇప్పటికే అమల్లో ఉన్న ప్రతిభావంతులైన యువశాస్త్రవేత్తల కార్యక్రమంలో వయస్సు గరిష్ట పరిమితి 45 సంవత్సరాలు, మరో పథకానికి 40 ఏండ్లు. దీనికి ఎలాంటి వయో పరిమితి నిబంధన లేదు. ఇతర దేశాలతో పోటీ పడుతూ వేతనాలు, వసతి, బోనస్, పిల్లలకు విద్య వంటి ఇతర సౌకర్యాలను కల్పిస్తారు. దేశ విధానానికి లోబడి పరిశోధనలో స్వేచ్ఛ ఉంటుంది. ఇప్పటి వరకు విదేశీ పెట్టుబడులకు ఎలాంటి రాయితీలు ఇచ్చి ప్రోత్సహించారో ఇప్పుడు ప్రతిభావంతులైన వారిని ఆకర్షించేందుకు అలాంటి విధానాన్నే ముందుకు తెచ్చారని చెప్పవచ్చు. ఇలాంటి ప్రత్యేక వీసాలు అమెరికా, కెనడా, బ్రిటన్, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో ఎప్పటి నుంచో ఉన్నాయి.

అమెరికాలో చైనా సంతతికి చెందిన వారి మీద పెరుగుతున్న జాత్యహంకార వివక్ష, ఆంక్షలు, పరిశోధనలకు కేటాయింపుల కోత, గూఢచర్య ఆరోపణలతో వేధింపులు, రెండు దేశాల మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతల పూర్వరంగంలో అనేక మంది అక్కడి నుంచి బయటపడేందుకు చూస్తున్నారు. మంచి పండ్లను ఏరి దిగుమతి చేసుకున్నట్లుగా దశాబ్దాల తరబడి, అమెరికా, ఇతర పశ్చిమ దేశాలు మేథోవలసతో ఎంతగానో లబ్ధిపొందాయి. ఇప్పుడు అటునుంచి వలసలకు చైనాతో నాంది పడిందంటే అతిశయోక్తి కాదు. అయితే ఇది ఒక్క రోజులో జరిగింది కాదు.చైనా కమ్యూనిస్టు పార్టీ నేత లి యువాన్ చావో 2008లో "వేయి ప్రతిభావంతుల పథకాని(టిటిపి)కి రూపకల్పన చేశారు .విదేశాల్లో ఉన్న చైనా సంతతికి చెందిన వారిలో కనీసం రెండువేల మందిని స్వదేశానికి ఆహ్వానించి ఒక నవకల్పన సమాజంగా దేశాన్ని మార్చాలని తలపెట్టారు. 2011తో ఈ పథకాన్ని అమల్లోకి తెచ్చినపుడు ఏటా 50 నుంచి వందమందిని పదేండ్ల పాటు ఆకర్షించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే దానికి మించి ఇప్పటి వరకు ఏడువేల మంది శాస్త్రవేత్తలు, ఆర్థికవేత్తలు, వాణిజ్య,పారిశ్రామికవేత్తలు వచ్చారని అంచనా, వారిలో ఇతర దేశాలకు చెందినవారు కూడా ఉన్నారు. మరొక సమాచారం ప్రకారం 2010 నుంచి 2021 మధ్య కాలలో కనీసం 20వేల మంది చైనా జాతీయులు అమెరికా నుంచి స్వదేశానికి వెళ్లారు. ఇలాంటి వారు చూపుతున్న ప్రతిభను బట్టి మిలియన్ల యువాన్లను బోనస్, ఇతర రాయితీలను ప్రతిఫలంగా చెల్లించుతున్నారు. అమెరికా నుంచి వచ్చే వారు విద్రోహచర్యల నిమిత్తం వస్తున్నారా, నిజంగానే పనిచేసేందుకా అని నిర్ధారించుకొనేందుకు సునిశిత పరిశీలనలు కూడా చేశారని వార్తలు. ఈ పథకానికి చైనా పెద్ద ప్రచారం ఇవ్వలేదు గాని దాని తీరుతెన్నులు గమనించిన అమెరికా జాతీయ గూఢచార సంస్థ, ఎఫ్‌బిఐ గుండెలు బాదుకుంటూ నివేదికలు రూపొందించాయి. చైనా ఆర్థిక, మిలిటరీ రంగాలలో పురోగమించటానికి చట్టబద్ధంగా, అక్రమ పద్ధతుల్లో అమెరికా మేథో సంపదను చైనా కొల్లగొడుతున్నదని ఆరోపించారు. ఈ ప్రచారం పెరగటంతో చైనా కొత్త పద్ధతుల్లో క్విమింగ్ పేరుతో ప్రతిభావంతులను ఆకర్షించేందుకు పూనుకుంది. 2019 నుంచి 2023వరకు ఐదు వందలకు పైగా ప్రభుత్వ పత్రాలను పరిశీలించిన రాయిటర్స్ వార్తా సంస్థ చైనా ఇస్తున్న నగదు, ఇతర మొత్తాల గురించి పేర్కొన్నది.

దశాబ్దాలుగా భారత్, చైనా వంటి దేశాల నుంచి ఎందరో ప్రతిభావంతులు ఎక్కువగా అమెరికా, ఇతర పశ్చిమదేశాలకు వలస వెళ్లారు. వ్యక్తిగతంగా ఆయా దేశాల పురోభివృద్ధికి ఎంతగానో తోడ్పడ్డారు. ఆర్థికంగా నిలదొక్కుకొని ఎదగటం ప్రారంభమైన తరువాత మరింత ముందుకు పోవాలంటే అలాంటి వలసల అవసరం ఎంతో ఉందని చైనా కమ్యూనిస్టు పార్టీ గుర్తించింది. కమ్యూనిస్టులు ప్రతిభావంతుల మీద కూడా తమ సిద్ధాంతాలను రుద్దుతారని, వారికి స్వేచ్ఛ ఇవ్వరని పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నారు.చైనా కమ్యూనిస్టులు దాన్ని కూడా గమనంలో ఉంచుకున్నారు. నూటనలభై కోట్ల జనాభా జీవితాలను ఉన్నత స్థితికి తీసుకువెళ్లాలంటే ఇంకా చేయాల్సింది చాలా ఉంది. దాన్లో భాగంగానే తమ దగ్గరలేని పెట్టుబడులను, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆహ్వానించారు. అవి తమ నుంచి లబ్ధిపొందుతాయని తెలిసినప్పటికీ దాని కంటే తాము ఎక్కువ ప్రయోజనం పొందుతామనే ముందు చూపు, ధైర్యంతో ఎన్ని విమర్శలు వచ్చినా సంస్కరణలకు తెరతీశారు, విజయం సాధించారు. సెమికండక్టర్లు, వైమానిక రంగం, 5జి, క్వాంటమ్ వంటి అనేక రంగాల్లో చైనా మరొకదాని వెనుక వెళ్లే పరిస్థితి నుంచి పోటీదారుగా మారింది.

గత నాలుగున్నర దశాబ్దాల సంస్కరణల ఫలితాలు, విధానాల గురించి కొంతమంది విమర్శలు చేయవచ్చు. ఇప్పుడు చైనా మరొకదశలో ప్రవేశించింది. అధికారాన్ని కార్మికవర్గం చేతిలో పెట్టటం ద్వారా విప్లవం చేయాల్సినపని చేసింది. సాధించిన అధికారం ఒక్కటే జన జీవితాలను మెరుగుపరచదని గుర్తించిన తరువాత తీసుకున్న చర్యలకు తగిన ఫలితాలు వచ్చాయి. వాటికి ఉన్న పరిమితులను గమనించి మరొక అడుగు ముందుకు వేస్తున్నది. విదేశీ పెట్టుబడులకు కొంత ప్రతిఫలాన్ని చెల్లించినట్లుగా, స్వదేశంలోనే సంస్థల పెరుగుదలకు వ్యక్తులను ప్రోత్సహించిన తీరు చూశాము. అలాగే ప్రతిభావంతులకు మిగతావారితో పోలిస్తే అధికమొత్తాలను ఇవ్వాల్సి ఉంటుందని గ్రహించింది. మరిన్ని పరిశోధనల ఫలితాలను జనకల్యాణానికి వినియోగించేందుకు పూనుకున్నది. ప్రపంచంలో ఉన్న ప్రతిభావంతులను చైనా ఆకర్షించటం అమెరికా మాదిరి కార్పొరేట్ల లాభాలకు కాదు, జనాల కోసం. ఈ ప్రయత్నం వెనుక వ్యూహాత్మక, రాజకీయ ప్రయోజనాలు కూడా ఉంటాయి. నిజానికి ఇది చైనా కమ్యూనిస్టు పార్టీకి కత్తిమీద సామువంటిదే. వచ్చేవారు ఆకాంక్షలకు అనుగుణంగా పని చేయాలి, శాస్త్ర రంగ నాయకత్వంతో పాటు రాజకీయ నాయకత్వంలో ఇమిడి పోయే విధంగా ఉండాలి. కమ్యూనిస్టుల గురించి అనేక తప్పుడు ప్రచారాలు జరిగిన నేపథ్యం,అన్యవర్గ ప్రభావంతో అలాంటి వారు ప్రతి చర్యనూ అనుమానంతో చూసే అవకాశం ఉంటుంది, సహజం. వీటన్నింటినీ గమనంలో ఉంచుకొనే చైనా కమ్యూనిస్టులు ఒక ప్రయోగం చేస్తున్నారని చెప్పవచ్చు. ఇప్పటి వరకు అది చేసిన వన్నీ మొత్తం మీద ఫలించాయి.

చైనాలో ప్రస్తుతం ప్రయోగశాలలు, పరిశోధనా కేంద్రాలు, విశ్వవిద్యాలయాల పర్యావరణం నానాటికీ పెరుగుతున్నది. ప్రపంచ స్థాయి సంస్థలలో చైనా వాటికి చోటుదక్కుతున్నది. క్వాంటమ్ కంప్యూటింగ్, బయోమెడిసిన్, కృత్రిమ మేథ, ప్రత్యామ్నాయ ఇంధన రంగాలలో సాధించే పురోగతిలో అగ్రగామిగా ఉన్న అమెరికాను అధిగమించాలన్నది కమ్యూనిస్టు పార్టీ నిర్దేశించిన లక్ష్యం. ఇది ప్రారంభం మాత్రమే. మరోవైపున చూస్తే అమెరికా, ఇతర పెట్టుబడిదారీ ధనిక దేశాలు పరిశోధకులను, వారితో కలిగే లాభాలను కోల్పోతే చూస్తూ ఊరుకోవు. ప్రమాణాలకు గీటురాళ్లుగా ఇప్పటి వరకు కొనసాగిన అమెరికా విశ్వవిద్యాలయాలు ఆ స్థానాన్ని నిలబెట్టుకుంటాయా? ప్రతిభావంతులను ఆకర్షించేందుకు పోటీ పడటంలో కెనడా, ఆస్ట్రేలియా, సింగపూర్, జర్మనీ, అరబ్ ఎమిరేట్స్ వంటివి కూడా ఉన్నాయన్నది మరచిపోరాదు. గుత్తాధిపత్యాన్ని దెబ్బకొట్టే విధంగా రానున్నరోజుల్లో పోటీ మరింత పెరగటం మంచిదే. వ్యక్తుల ప్రతిభకు ఎప్పుడూ గుర్తింపు ఉంటుంది, అయితే అది పూర్తిగా వారి స్వంతం కాదు, సమాజం నేర్పినదానికి తమ సృజనాత్మకత జోడింపు మాత్రమే.

ఉదాహరణకు విద్యుత్ బల్బ్‌ను చూస్తే, 1,799 సంవత్సరం నుంచి బల్బులు, బ్యాటరీల తయారీకి పరిశోధనలు ప్రారంభమయ్యాయి. అనేకమంది చేసిన కృషితో 1870, 80 దశకాల్లో పోటీ మరింత పెరిగింది.బ్రిటన్‌లో జోసెఫ్ స్వాన్, అమెరికాలో థామస్ ఎడిసన్ ఒకేసారి బల్బులను కనుగొన్నారు. స్వాన్ బల్బులు విలియమ్ స్టైయిట్ రూపొందించిన నమూనాల ప్రకారం ఉన్నాయి. వాటి ఫిలమెంటు చాలామందంగా ఉంది. ఎడిసన్ బల్బులో పలుచగా ఉండటంతో వాణిజ్య పరంగా అది విజయవంతమైంది. స్వాన్, ఎడిసన్ మధ్య పోటీ చివరకు వారిద్దరినీ ఒక దగ్గరకు చేర్చి ఎడిసన్ మరియు స్వాన్ ఎలక్ట్రిక్ లైట్ కంపెనీగా ఏర్పడి స్వాన్ రూపొందించిన ఫిలమెంట్‌తో మార్కెట్ చేశారు. కానీ పేరు ఎడిసన్‌కు వచ్చింది, దాని వెనుక ఎందరో ఉన్నారు. ఆ తరువాత బల్బుల్లో ఎన్ని మార్పులు, చేర్పులు జరిగాయో మనకు తెలిసిందే.

అందువలన ప్రతి నవకల్పన సమాజానికి ఉపయోగపడుతుందా, కార్పొరేట్ల లాభాలకా అన్నదాన్ని బట్టి శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాల వర్గదృకృథం గురించి చెప్పుకోవాల్సి ఉంటుంది. చైనా కార్మికవర్గ వైఖరితో ప్రతిభకు పట్టం కడుతున్నదని చెప్పవచ్చు.

## కట్...కట్...కట్...

# ఉద్యోగ, పెన్షనర్ల పై వేలాడుతున్న కత్తి!?

దేశవ్యాప్తంగా ఉన్న ఉద్యోగులు,పెన్షనర్ల భవితవ్యం ప్రమాదపు టంచులపై ఉంది. కేంద్రప్రభుత్వం తెస్తున్న చట్టాలు ఉద్యోగులు,పెన్షనర్ల భద్రతపై కత్తిలా వ్రేలాడుతున్నాయి. ఇప్పటికిప్పుడు ప్రమాదం లేకపోయినా ప్రమాదపు అంచులపై కాలం నడక తప్పడంలేదు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ఆమోదం పొందిన 'ఫైనాన్షియల్ బిల్లు – 2025' పెన్షనర్ల పాలిట శాపంగా మారింది. ఆ బిల్లులో స్పష్టంగా లోక్‌మత్ కమీషన్ చేసిన పెన్షనర్ల రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఉపసంహారించుకోవాలన్న సూచనలు పొందుపరిచారు. కనుక 2026లో బిల్లు ఆచరణలోకి వచ్చేనాటినుండి పెన్షనర్ల పదవీ విరమణ బెనిఫిట్స్‌కు సర్వమంగళం పాడి నట్లే? ఇదిలా ఉండగా ఆబిల్లులోనే పెన్షనర్ల భద్రతకు సంబంధించిన అంశాలకు సంబంధించి పెన్షన్ పెంపుదలపై 'ప్రభుత్వం అనుమతుల మేరకు' అనే వాక్యం చేర్చడం వలన పెరిగే కరువు భత్యం, వేతన సవరణలు వర్తింపజేయడం ఆయా ప్రభుత్వాల దయాదాక్షిణ్యతలకు వదిలివేయడం జరిగింది. అటూ, ఇటూ కాని స్పష్టత లేని వాక్యాలు చట్టంలో మర్మ గర్భితంగా చేర్చడం వలన ఆయా ప్రభుత్వాలు పెన్షనర్ల కున్న హక్కును లాగేసుకునే ప్రమాదం సైతం పొంచి వుంది. ఇదిలా ఉండగా ఇప్పటికే మన తెలంగాణా రాష్ట్రం లో2014,ఏప్రియల్ నుండి రిటైర్ అయిన 8వేల మంది ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ 16లక్షల గ్రాడ్యుయిటీతోపాటు,పెన్షన్ కమ్యుటేషన్, దాచుకున్న జనరల్ ప్రావిడెంట్ ఫండ్, ఎర్న్‌డ్ లీవు ఎన్‌క్యాష్‌మెంట్ సొమ్ములు రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ లో పెట్టింది. రిటైర్ ఉద్యోగులఈబకాయిలమొత్తం 9వేల కోట్లు పైమాటే నని ఒక అంచనా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ బకాయిలు ఎప్పుడు మంజూరు చేస్తుందోనని రిటైర్ ఉద్యోగులు ఏడాదిన్నర కాలంగా ఎదురు చూస్తున్నారు. 1982లో సుప్రీంకోర్టు రిటైర్ ఉద్యోగి డి.యస్.నకాలి కేసులో పెన్షన్ అనేది ప్రభుత్వం ఇచ్చే దయాదాక్షిణ్యం కానేకాదు. ఉద్యోగుల గత సేవలను దృష్టిలో ఉంచుకొని పెన్షన్ పొందే హక్కు వారికి సంక్రమిస్తుందని సుప్రీంకోర్టు స్పష్టం చేయడంతోపాటు, ఉద్యోగులతో సమానంగా కరువు భత్యం, పే కమీషన్ పెన్షనర్లకు వర్తిస్తుందని స్పష్టం చేసింది. ఆ తీర్పు ఇచ్చిన డిసెంబర్ 17నే దేశవ్యాప్తంగా రిటైర్ ఉద్యోగులు పెన్షన్ డేగాజరుపుకుంటున్నారు. ఇప్పుడు కేంద్రం తెచ్చిన నూతన ఫైనాన్స్ చట్టం ప్రభుత్వ దయాదాక్షిణ్యాలకు రిటైర్డ్ ఉద్యోగుల హక్కులు వదిలివేయడంతోపాటు, రిటైర్ ఉద్యోగుల పెన్షన్ భద్రతపై కత్తి వేలాడుతూనే ఉంటుంది.

అమెరికా అధ్యక్షుడుగా ట్రంప్ అధికారం లోకి రాగానే ఆర్థిక స్థిరత్వం పేరుతో లక్షలాది మంది ఉద్యోగులను తొలగించారు. ప్రపంచ దేశాలపై ఇబ్బడి ముబ్బడిగా పన్నులు వేసి పడేశారు. ఇదే బాటలో మన నరేంద్ర మోడీ కొందరు పనిచేయని ఉద్యోగులను, మరికొందరు అవినీతి పరులైన ఉద్యోగులను, రెడ్ టేపిజమ్ ప్రదర్శించి ప్రజలను చులకనగా చూసే ఉద్యోగులపై వేటువేసే పేరుతో రాజ్యాంగ చట్టంలోని ఆర్టికల్ 311ను సవరించనున్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 311(1) అనేది ఉద్యోగిని అర్థాంతరంగా డిస్మిస్ చేయడాన్ని, లేదా తొలగించడాన్ని, ర్యాంకు తగ్గించడంవంటి ప్రభుత్వ చర్యలనుండి భద్రత కలిపిస్తుంది. ఇక ఆర్టికల్ 311(2) నిబంధనలు కేవలం క్రిమినల్ కేసులో శిక్ష పడ్డప్పుడు, మరి కొన్ని తీవ్రమైన సందర్భాల్లో చర్యలు తీసుకోవడం, అది ఉద్యోగికి సమాచారం ఇచ్చి, సంజాయిషీ చెప్పుకునే అవకాశం ఇచ్చి మాత్రమే సంబంధిత ఉద్యోగిని తొలగించే అవకాశం ఉంటుంది. రాజ్యాంగంలో ఉద్యోగులకు భద్రత కల్పిస్తున్న 311 ఆర్టికల్ నందు సవరణ చేయాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం ఉంది.

అంబేద్కర్ ఉద్యోగ భద్రత, ప్రభుత్వాల నుండి రక్షణ కల్పించారు. ప్రపంచీకరణ, సరళీకరణ, గ్లోబలీకరణ విధానాలు రావడంతో కాగితాలు బదులు కంప్యూటర్ పరిజ్ఞానం అందుబాటులోకి రావడం, ఐటి లాంటి సెక్టారులో ప్రైవేటు ఉద్యోగాలు అవకాశంగా రావడం, అటు తర్వాత రెగ్యులర్ నియామకాలకు బదులు ఔట్ సోర్సింగ్ సేవలు అందుబాటులోకి రావడంతో ప్రభుత్వ ఉద్యోగుల ప్రాధాన్యత తగ్గింది. ఉద్యోగులు కూడా చాలా సందర్భాల్లో చాలామంది ఉద్యోగులు తమ చేతిలో ఉన్న అదికారం దుర్వినియోగం చేయడం, కొందరు అదేపనిగా అవినీతి రూపాలుగా తమసేవలను మార్చడం, ప్రజాసేవకులుగా కాకుండా తామేదో ప్రత్యేక వర్గం అన్న భావనలు కొందరు ఉద్యోగుల్లో ఏర్పడి ప్రజలతో సత్సంబంధాలు కోల్పోయిన స్థితి ఉంది. ఇప్పుడు ప్రభుత్వాలు రాజ్యాంగ బద్ధంగా ఆర్టికల్ 311ప్రకారం సంక్రమించిన హక్కులను తొలగిస్తున్నా,సవరిస్తున్నా కనీసం స్పందన లేని స్థితి నెలకొంది. ప్రధాని మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్న చట్టం మార్పుల్లో , లేదా సవరణల్లో ఆర్టికల్ 311కూడా ఒకటి కావడం పెద్ద విశేషం ఏమీకాదు? ఇదే జరిగితే ప్రైవేటు ఉద్యోగాల మాదిరిగా ప్రభుత్వ ఉద్యోగులకు భద్రత లేనట్లే!, అంతేకాదు నిరంకుశ ప్రభుత్వాలు ఏర్పడినప్పుడు ఉద్యోగులను వారి చేతిలో పావులుగా మార్చుకోవడానికి సైతం ఈ చట్టసవరణ తోడ్పడే ప్రమాదం కూడా ఉంది. కనుక ప్రభుత్వ ఉద్యోగులలో మార్పు రావడంతో పాటు, ఇట్లాంటి చట్టాలను సమైక్యంగా ఉద్యోగులు ఎదుర్కొనడం ద్వారా భవిష్యత్తు తరాలకు ఉద్యోగవ్యవస్థకు మేలుచేసిన వారవుతారు. ప్రభుత్వాలు కూడా ఉద్యోగులు హక్కులను, రాజ్యాంగ స్ఫూర్తితో ఆలోచించి మాత్రమే చట్ట సవరణలకు పోవాల్సి ఉం టుంది..

ఎన్.తిర్మల్, 9441864514,
thirmal.1960@gmail.com

## లాయర్స్ యూనియన్ నిరసన



**ప్రజాపక్షం/జనగామ టౌన్:** జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా ఆలిండియా లాయర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ గాజుల రవీందర్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాది తన్నీరు శ్రీకాంత్‌పై దాడిని ఖండిస్తూ, దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా లాయర్స్ నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో కన్వీనర్ బట్టినాథ్, ఐలు కో కన్వీనర్ విజయకుమార్, అమృతరావు, గణేష్, సీనియర్ నాయకులు స్వామి, శ్రీనివాస్, సంపత్, బాలబోయిన సంపత్, శ్రీనివాస రాగూర్,తదితరులు పాల్గొన్నారు.

## భూ భారతి దరఖాస్తుల పరిష్కరణ



**ప్రజాపక్షం/రాయపర్తి:** భూ భారతి దరఖాస్తులను పరిష్కరించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి అన్నారు. మంగళవారం రాయపర్తిలోని తహసీల్దారు కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న భూ భారతి దరఖాస్తులను త్వర గా పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు శ్రీనివాస్, డి ప్యూ టీ తహసీల్దారు శ్రీనివాస్‌రెడ్డి, ఆర్ఐ చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత: కలెక్టర్



**ప్రజాపక్షం/భూపాలపల్లి:** వసతి గృహాల విద్యార్థుల సంక్షేమం, సౌకర్యాల కల్పన పట్ల ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. సోమవారం నుండి ప్రత్యేక అధికారులు, పోలీస్, క్లస్టర్ అధికారులు వసతి గృహాలను తనిఖీ చేస్తూ వసతి గృహాల్లో మెనూ అమలు, సౌకర్యాలను పరిశీలిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక, పోలీస్ అధికారులు విద్యార్థులతో కలిసి అల్పాహారం, మధ్యాహ్న భోజనం చేస్తూ, విద్యార్థుల సమస్యలు, ఇబ్బందులను అడిగి తెలుసుకుంటున్నారని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ, విద్యార్థులు మీరు ఏటువంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా నిర్భయంగా అధికారులకు తెలియజేయాలని సూచించారు. మీ సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఉపాధ్యాయులు, వార్డెన్లు విద్యార్థులతో స్నేహితుల వలే ఉండాలని, వారిపై కాఠిన్యం చూపిస్తే కఠిన చర్యలు తీసుకోబడతాయని కాకుండా అవసరమైతే పోలీస్ కేసులు నమోదుతో పాటు శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## మట్టి గణేష్ విగ్రహాల పోస్టర్ల ఆవిష్కరణ



**ప్రజాపక్షం/ములుగు:** వినాయక చవితి సందర్భంగా వినాయక విగ్రహాల తయారీలో కృత్రిమ రంగులు, రసాయనాల వినియోగం వలన జల వనరుల కాలుష్యానికి గురవుతున్నాయని, అందుచే కృత్రిమ రంగులు, రసాయనాలతో చేసిన విగ్రహాలను మానివేసి మట్టితో చేసిన విగ్రహాలను పూజించి చెరువులను కలుషితం కాకుండా కాపాడుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్ తన ఛాంబర్‌లో అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జీతో కలిసి వినాయక చవితి పండగను పురస్కరించుకొని ఈ సంవత్సరం పర్యావరణంపై అవగాహన కల్పించేందుకు మట్టి గణేష్ విగ్రహాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమాలలో భాగంగా 8 అంగుళాల మట్టి గణపతులను అందించి పర్యావరణంపై అవగాహన కార్యక్రమాలను తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి వారిచే నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. చెరువుల్లో మట్టి మేటలని తొలగించడానికి చెరువులో స్వచ్ఛత కాపాడడానికి వినాయక చవితి సందర్భంగా ప్రజలు, భక్తులు నడుము బిగించాలని మట్టితో వినాయక విగ్రహాలు తయారు చేసి భక్తితో చెరువులోకి చేర్చొచ్చని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ వెంకటేష్, కాలుష్య నియంత్రణ మండలి ఎఇఎం సుభాష్ నాయక్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సాయుధ దళ కార్యాలయంలో ఎస్‌పి తనిఖీ



**ప్రజాపక్షం/ములుగు:** ములుగు జిల్లా ఎస్‌పి డాక్టర్ శబరీష్ వార్షిక తనిఖీలలో భాగంగా ములుగు జిల్లా సాయుధ దళ కార్యాలయాన్ని మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి మొదటగా సాయుధ బలగాల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం సాయుధ దళ కార్యాలయం పరిసరాలను, వాటి పరిశుభ్రతను క్షుణ్ణంగా పరిశీలించారు. అధికారులందరిని పిలిచి వారు నిర్వర్తిస్తున్న విధులను అడిగి తెలుసుకున్నారు. వివిధ కార్యాలయాలు మొత్తం కలియతిరిగి పరిశీలించారు. ఆయా కార్యాలయాలకు వెళ్ళి రికార్డులను పరిశీలించి, ఆయా కార్యాలయాలలో పనిచేసే అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు రికార్డులు పెండింగ్ లేకుండా పని పూర్తి చేయాలని ఆదేశించారు. బిడి టీం సభ్యులు తమ విధులలో ఎల్లవేళలా అప్రమత్తత కలిగి ఉండాలని సూచించారు. మోటార్ ట్రాన్స్‌ఫోర్ట్ కార్యాలయాన్ని సందర్శించి అందులో పనిచేసే అధికారులు, సిబ్బంది గురించి వివరాలు ఆరా తీశారు. జిల్లాకు కేటాయించిన వాహనాల గురించి వాటి పనితీరుపై సమీక్ష చేశారు. సిబ్బంది యొక్క వ్యక్తిగత సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీల్లో అడిషనల్ ఎస్‌పి సదానందం, ఆర్‌ఐలు స్వామి, వెంకటనారాయణ, తిరుపతి, ఆర్‌ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## మండలంలో కలెక్టర్ విస్తృత పర్యటన



**ప్రజాపక్షం/తరిగొప్పుల:** జిల్లాలో సాగుకు సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని అమ్మకాలు పూర్తి అయ్యేంత వరకు ఫర్టిలైజర్ షాప్ యజమానులు సరిపడా సిబ్బందిని పెట్టుకుని రైతులకు ఇబ్బంది కలిగించవద్దని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మంగళవారం మండలంలో కలెక్టర్ విస్తృత తనిఖీలు, పరిశీలనలు జరిపారు. ముందుగా ఆగ్రోస్ సేవ కేంద్రాన్ని, పలు ఫర్టిలైజర్ షాపులను కలెక్టర్ సందర్శించి స్టాక్ రిజిస్టర్‌లను పరిశీలించారు. అనంతరం కెజిబివికి వెళ్లి మధ్యాహ్న భోజన తయారీని పరిశీలించి వంటకి వాడే ప్రతి వస్తువు తాజాగా ఉండాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల దగ్గరకు వెళ్లి లబ్దిదారులతో మాట్లాడి ఇసుక, మొరం సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం జెడ్పీ హైస్కూల్‌కు వెళ్లి ఉపాధ్యాయుల హాజరు పరిశీలించారు. విద్యార్థులు సమయం వృథా కాకుండా బాగా చదువుకుని మంచి మార్కులు సాధించాలన్నారు.ఈ కార్యక్రమంలో తహశిల్దార్ మైపాల్‌రెడ్డి, ఎంపిడిఒ దేవేందర్, వ్యవసాయ, విద్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

# రోగులకు మెరుగైన వైద్య సేవలు

### కలెక్టర్ సత్యశారద ఆదేశం * ప్రభుత్వ ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/ వరంగల్:** ఎంజిఎం ఆసుపత్రికు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని వైద్యులను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎంజిఎం ప్రభుత్వ ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మికంగా తనఖి చేశారు. ఆసుపత్రిలోని ఓపి, జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, జనరల్ సర్జరీ, సైక్రియాటిక్, ఇంటెన్సివ్ కేర్, సర్జికల్ యూనిట్, ఎమర్జెన్సీ క్యాజువాలిటీ తదితర విభాగాలను కలెక్టర్ స్వయంగా పరిశీలించి ఆయా వార్డుల్లో అందుతున్న వైద్య సేవల వివరాలను రోగులను అడిగి తెలుసుకున్నారు. ఎప్పుడు, ఏ ఇబ్బందితో ఆసుపత్రికి వచ్చారు, డాక్టర్లు చూశారా, మందులు ఇచ్చారా, పరీక్షలు చేస్తున్నారా, నర్సులు, సిబ్బంది సేవలపై రోగులను అడిగి కలెక్టర్ ఆరా తీశారు. ఓపిసేవలు, ఆన్లైన్ రిజిస్ట్రేషన్‌లను పరిశీలించారు. సీజనల్ వ్యాధుల దృష్ట్యా ఎక్కువ మంది రోగులు వస్తున్నందున దానికనుగుణంగా త్వరితంగా సేవలు అందేలా చూడాలన్నారు. ఆసుపత్రి పరిసరాలను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పారిశుద్ధ్యం అంశంలో ఎటువంటి లోటుపాట్లు ఉండటానికి వీలు లేదని, అత్యంత ప్రాధాన్యత అంశంగా పరిగణించాలని కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రి ఫార్మసీ స్టోర్‌లో అన్ని రకాల డ్రగ్స్ (మందులు) అందుబాటులో ఉండాలని, వైద్య శాఖ ఉన్నతాధికారులతో ఎప్పటికప్పుడు ఫాలో అప్ అవుతూ ఆసుపత్రిలో మందుల స్టాక్ వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా హెల్పింగ్ హ్యాండ్ సంస్థ ద్వారా ఏర్పాటుచేసిన సహాయ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. రోగుల సౌకర్యార్థం ఫార్మసి వద్ద అదనంగా ఏర్పాటు చేసిన ల్యాబ్‌ను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ఆసుపత్రిలోని జనరల్ మెడిసిన్ విభాగ డాక్టర్లు, అధికారులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ సత్య శారద మాట్లాడుతూ పేషంట్ల సౌకర్యార్థం ఆసుపత్రిలో వెంటనే టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటుచేసి అన్ని విభాగాల వార్డ్ ల వద్ద ప్రదర్శించాలన్నారు. అప్పటివరకు కలెక్టరేట్ టోల్ ఫ్రీ నంబర్ 1800 425 3424 కు సంప్రదించి వైద్యానికి చికిత్సకు సంబంధించిన ఫిర్యాదులు చేయవచ్చని కలెక్టర్ తెలిపారు. డాక్టర్లు, సిబ్బంది అందరూ ఎఫ్ఆర్‌సి ద్వారానే హాజరు ఖచ్చితంగా వేయాలన్నారు. డెంగీ, సీజనల్, ఇతర వ్యాధుల పట్ల అప్రమత్తమై పేషెంట్లకు ఇబ్బంది కలగకుండా త్వరితగతిన సేవలు అందించాలన్నారు. ఓపి లో ఎక్కువమంది పేషంట్లు వస్తున్నందున వారిని త్వరితంగా వైద్య సేవలు అందించేందుకు వైద్యుల సంఖ్య పెంచడం లేదా షిఫ్టుల వారిగా డాక్టర్లను ఏర్పాటు చేయాలని పర్యవేక్షకులకు సూచించారు. ప్రతి రోజు ఆసుపత్రిలోని అన్ని విభాగాల వైద్య సేవల నివేదిక విధిగా పంపాలని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అన్ని విభాగాల వద్ద ఏర్పాటుచేసిన 20 ఫిర్యాదుల పెట్టెలలో పేషేంట్లు వేసిన ఫిర్యాదులను డాక్టర్ల సమక్షంలో తెరచి ఆయా సమస్యలు లేకుండా చూడాలని, డబ్బులు అడిగిన సెక్యూరిటీ గార్డు పై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని, నర్సుల సేవలపై వచ్చిన ఫిర్యాదులను హెడ్ నర్స్ చే చదివించి సంబంధిత వారిపై తగుచర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం ఆసుపత్రిలోని వర్క్ షాప్ ప్రాంతంలో ప్రైవేట్ దుకాణాల, వెండింగ్ జోన్ ఏర్పాటుకు కొనసాగుతున్న పనులను కలెక్టర్ పరిశీలించి తగు సూచనలు చేశారు. క్యాజువాలిటీకు అత్యవసరంగా పేషెంట్లకు తీసుకురావడానికి, తిరిగి వెళ్ళుటకు ఒకే దారి ఉన్నందున ప్రత్యామ్నాయంగా క్యాజువాలిటీ ముందు భాగంలో దారి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. వర్షాల వల్ల క్యాజువాలిటీకు వచ్చే రహదారిపై గుంతలను పరిశీలించిన కలెక్టర్ ఇంజనీరింగ్ అధికారులను పిలిపించి తక్షణమే మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పార్కింగ్ జోన్ కు కూడా ప్రతిపాదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంజిఎం పర్యవేక్షకులు డాక్టర్ కిషోర్, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్‌కుమార్ రెడ్డి, డాక్టర్ మురళి, ఆర్ఎంఒలు అన్ని విభాగాల హెచ్ఒడిలు, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఏళ్లు గడిచినా మారని పరిస్థితి




**ప్రజాపక్షం/నెక్కొండ:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రం లోని ఆర్టీసీ బస్టాండ్ దాదాపు 11 సంవత్సరాల అయినా కనీస వసతులు లేక బస్సు బస్టాండ్ లోకి వెళ్లలేక ప్రయాణికులు వెళ్లలేక తీవ్రమైన ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే ఈ బస్టాండుకు వివిధ గ్రాంట్స్ నుండి లక్షలాది రూపాయలు వెచ్చించిన నేతలు జేబులు నింపుకున్నారే తప్ప ఎలాంటి వసతులు కల్పించకపోవడంతో ప్రయాణికులు నిత్యం అవస్థలు పడుతున్నారు. దీనికి తోడు అధికారుల నిర్లక్ష్యం ఆర్టీసీ అధికారులు చుట్టూ ఉన్న ప్రదేశాల్లోని చిన్నచిన్న షాపు లనుండి లక్షలాది రూపాయల సంవత్సరానికి వసూలు చేస్తున్నారే తప్ప ఎలాంటి వసతులు కల్పించడం లేదు. కొందరు ఆర్టీసీ స్థలం నుండి వారి వారి వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. అలాంటి వారి నుండి అధికారులు ఎంత తీసుకుంటున్నారో ఎలా అనుమతిస్తున్నారోఅర్థం కాని పరిస్థితిలో ప్రయాణికులు ఉన్నారు.

## మట్టి గణపతులను పూజిద్దాం

### ఎమ్మెల్యే నాయిని పిలుపు



**ప్రజాపక్షం /హనుమకొండ :** మట్టి గణపతులను పూజించాలని, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నగరంలోని భక్తులకు,ప్రజలకు స్వచ్ఛందంగా మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. పంపిణీ అనంతరం ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ హనుమకొండ జిల్లా ప్రజలందరికీ ముందుగా వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ఈ వినాయక నవరాత్రి ఉత్సవాలు పర్యావరణ హితంగా ఉండాలని కోరుతూ నగరంలో 30000 విగ్రహాలకు అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం వినాయక మండపాలకు ఉచిత విద్యుత్తు సరఫరా అందిస్తున్నదని వెల్లడించారు. మావంతుగా చేపట్టిన ఈ కార్యక్రమంలో ప్రజలందరూ స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని కోరారు.ఈ మట్టి గణపతుల పూజతో పాటుగా ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని అన్నారు.ఇప్పటికే అధికారులకు కచ్చితమైన ఆదేశాలను ఇచ్చామని నవరాత్రి వేడుకలలో ఎటువంటి ఆటంకాలు లేకుండా చూడాలని,నగరంలో ఏర్పాటు చేసిన మండలాలలో పర్యవేక్షణను చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, భక్తులు పాల్గొన్నారు.

**మదర్ థెరీసాజయంతి సందర్భంగా నివాళులు**

వరంగల్ పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మదర్ థెరీసా జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాల వేసి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ "మదర్ తెరిసా తన జీవితాన్ని సేవకే అంకితం చేసిన మహానీయురాలని,పేదలు, నిరుపేదలు, అనాథలు, రోగులు ఎవరికైనా తల్లిలా తోడుగా నిలిచి, మానవత్వానికి ప్రతీకగా నిలిచారని, ఇలాంటి మహనీయుల ఆలోచనలు మనందరికీ ప్రేరణగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నిజాయితీ, నిబద్ధత పెట్టుబడి

### పాల ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య ఏర్పాటు

### పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి



**ప్రజాపక్షం/హనుమకొండ :** నిజాయితీ నిబద్ధత పెట్టుబడిగా పరకాల ఇందిరా మహిళ పాల ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య లిమిటెడ్ ఏర్పడుతుందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం మహిళా సాధికారతకు అత్యధిక ప్రాధాన్యతనిస్తోందని, ప్రతీ మహిళ అభివృద్ధిలో భాగస్వామ్యం కావడానికి అవసరమైన పథకాలు, సదుపాయాలు అందిస్తున్నామన్నారు.మహిళలకు ఉపాధి కల్పించే ఉద్దేశంతోనే డైరీ ఏర్పాటుకు కృషి,మహిళల కోసం మహిళలతో పరకాల ఇందిరా మహిళ డైరీ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.మంగళవారం కాజీపేట ఫాతిమా నగర్ లోని బాలవికాస కాన్ఫరెన్స్ హాల్ లో నిర్వహించిన పరకాల ఇందిరా మహిళా పాల ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య లిమిటెడ్ సన్నాక సమావేశంలో ముఖ్యఅతిథిగా పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల భాగస్వామ్యంతోనే పరకాల ఇందిరా మహిళా పాల ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య లిమిటెడ్ డైరీ అభివృద్ధి సాధ్యం అవుతుందన్నారు.మహిళలకు ఆర్థిక స్వావలంబనతో పాటు, పాలు ఉత్పత్తి రంగంలో స్థిరమైన ఆదాయం లభిస్తుందని,గ్రామీణ కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడటమే కాకుండా,స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు.మహిళలు సాధించలేనిది ఏమీ లేదని, మహిళలలో కమిట్మెంట్ ఉంటుందన్నారు. మనం ఏర్పాటు చేయనున్న డైరీ కి ప్రభుత్వ సహాయం ఉందని, మహిళలకు ఉపాధి కల్పించే ఉద్దేశంతోనే డైరీ ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని, మహిళా సంఘాలు ఆర్థికంగా బలపడాలంటే పాడి పరిశ్రమలు అభివృద్ధి చేసుకోవాలన్నారు. మహిళల పెట్టుబడి, ధైర్యం, నీతి, నిజాయితీ, నిబద్ధత అని ఉంటే ఏదైనా సాధ్యమన్నారు. ముల్కనూరు మహిళా సమాఖ్య డైరీ నిర్వహణలో ప్రవీణ్ రెడ్డి, జిఎం భాస్కర్ రెడ్డి సహకారంతో ముందుకెళ్దాం అన్నారు.రాష్ట్ర, దేశ ఆర్థిక స్థితిని నిర్దేశించే స్థాయిలో డ్వాక్రా గ్రూపులు ఉన్నాయన్నారు.లాదెళ్ల,సంగెం లో ఏర్పాటు చేయనున్న మహిళా శిక్షణ కేంద్రాలు మహిళల ఉపాధి అవకాశాలు పెంపొందించేందుకు కృషి చేస్తాయన్నారు. ఈ సందర్భంగా ట్రైనింగ్ సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ డిఆర్‌డిఓ, జెడ్పి సీఈవో రామ్ రెడ్డి,డిఆర్‌డిఓ హనుమకొండ మేన శ్రీను, డిసిఓ నీరజ, వెటర్నరీ జెడి ఎనిమల్ హస్బెండరీ డాక్టర్ బాలకృష్ణ,డాక్టర్ రాధాకృష్ణ, ఏపీడి లు వెంకటేశ్వర్లు, రేణుకా దేవి, ముల్కనూర్ సొసైటీ మేనేజర్ రవీందర్, డిపిఎంఎస్ లు వరలక్ష్మి, శ్రీలత, ఏపీఎంలు, సీసీలు, సొసైటీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు

## భూభారతి దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ పరిశీలన




**ప్రజాపక్షం/శాయంపేట :** మండలంలోని వివిధ గ్రామాలలో భూ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన భూభారతి దరఖాస్తులను వేగవంతంగా పరిష్కార చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా శాయంపేట మండల తహసీల్దార్ జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా భూభారతి దరఖాస్తుల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను స్థానిక తహసిల్దార్ సత్యనారాయణ, ఇతర అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. మండల వ్యాప్తంగా భూభారతి దరఖాస్తులు ఎన్ని వచ్చాయని, అందులో ఎన్నిటిని ఆమోదించారని, ఎన్ని దరఖాస్తులు తిరస్కరణ అయ్యాయని తహసీల్దార్, అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వచ్చిన దరఖాస్తులలో ఏ ఏ కారణాల చేత తిరస్కరణ అయ్యాయని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. తిరస్కరణ అయిన దరఖాస్తులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో వచ్చిన దరఖాస్తులపై విచారణ చేయాలని, ఏయే ఆధారాలతో భూమిపై ఉన్నారనే వివరాలను వి చారించాలన్నారు. భూభారతి దరఖాస్తుల పరిష్కార చర్యలను మరింత వేగవంతం చేయాలని, ప్రతిరోజు పురోగతి ఉండాలన్నారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బందితో మాట్లాడి వారు నిర్వర్తిస్తున్న విధుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసిల్దార్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పారిశుద్ధ్యం.. అస్తవ్యస్తం..?







**ప్రజాపక్షం/ భూపాలపల్లి:** భూపాలపల్లి మున్సిపాలటిలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. జిల్లా కేంద్రంలో స్థానిక హైటెక్ కాలనీలోని తహసీల్దార్ కార్యాలయం రోడ్డులోని ప్రభుత్వ పాఠశాలకు ఎదురుగా ఉన్న చెత్తకుండి నిండిపోయి రోడ్లపైకి చెత్త చేరటంతో అక్కడ దుర్గంధం వెదజల్లుతుంది.ఆ మార్గం గుండా నిత్యం మండల మెజిస్ట్రేట్ తహసీల్దార్,జిల్లా కోర్టు జడ్జీలు, ఎంపిడిఒలు నిత్యం ఆ మార్గం గుండా వందలాది మంది వెళ్లు తుంటారు. ప్రభుత్వ అధికారులు ప్రయాణిస్తున్న మార్గంలోనే పారిశుద్ధ్యం కొరవడిందని కొట్టచ్చినట్టుగా కళ్లకు కనబతుంటే ఇంత కంటే సాక్షం ఇంకేమికావాలి.మంగళవారం కురిసిన వర్షాలకు చెత్తతో పాటు వ్యర్థాలు రోడ్డుపైకి రావటంతో కాలనీలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.భూపాలపల్లి మొదట నగర పంచాయితి ఆతరువాత మున్సిపాలిటిగా 30 వార్డులతో రూపాంతరం చెందింది. సుమారు 1లక్ష జనాభ కలిగిన పెద్దపట్టణంగా అభివృద్ధి లో దూసుకుపోతుంది.కాని పట్టణా అభివృద్ధికి అనుగుణంగా సరిపడు వాహనాలు పారిశుద్ధ్య సిబ్బంది లేకపోడం లోపంగా కనిపిస్తుంది. ఒక్క పక్క వర్షాలకు ప్రజలు జ్వరాల బారిన పడి సీజనల్ జ్వరాలు విజృంభిస్తున్న తరుణంలో పారిశుద్ధ్యం లోపంతో ప్రజలు రోగాల భారిన పడే ప్రమాదంలో పొం చి ఉందని భయాం దోళనకు గురవుతున్నారు. మున్సిపాలిటిలో 30 వార్డులలో 12 స్వచ్ఛ ఆటోలు మాత్రమే ఉండగా అందులో నాలుగు ఆటోలు రిపేరులో ఉంటే కేవలం 8 మాత్రమే పనిలో ఉన్నాయి. ఈ 30 వార్డులలో 8 ఆటోలతోనే సరిపెట్టు కోవలసి వస్తుంది. ఆరు ట్రాక్టర్లకు గాను రెండు రిపేరులో ఉంటే నాలుగు మాత్రమే పనిలో ఉన్నాయి. డోజర్ ఒక్కటి ఉంటే అది కూడా రిపేర్‌లో ఉన్నది. కంప్యాక్ట్1, స్వీపింగ్ మిషన్ ఒక్కటి ఉండగా అవి నామ మాత్రంగా పనిచేస్తు న్నాయి. భూపాలపల్లి 30 వార్డులకు 67 మంది పారిశుద్ధ్య కార్మికులుపనిచేస్తున్నారు.150 మంది సిబ్బంది చేయవలసిన పని కేవలం 67 మందితో పని చేపించి వారిపై పని భారం మోపుతున్నారు. 150 మ ంది ఉండాల్సిన పట్టణంలో కేవలం 67 మంది మాత్రమే సిబ్బంది ఉంటే మున్సిప ల్ పరిశుభ్రత స్వచ్ఛత ఎలా సాధ్యమవుతుంది. 30 వార్డులలో రోజు చెత్త సేకరించక పోవడం వల్ల వారం రోజులకు ఒక్క సారి వార్డులలోకి సిబ్బంది రావ టంతో చెత్తకుండిలో ఉన్న చెత్త గుట్టలు గుట్టలుగా పేరుకు పోయి కాలనీలు అన్ని దుర్గంధం వెదజల్లుతున్నాయి. అదే విధంగా స్థానిక బస్టాండ్ ఆవరణంలో చెత్త తో నిండి వాసన వెదజల్లుతుంది.ఇంత జరుగుతున్న సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు చర్చింటుకున్నారు.ఇప్పటికైనా సంబంధిత మున్సిపల్ అధికారులు స్పందించి తగిన సిబ్బందిని పెట్టుకొని, రిపేరులో ఉన్న ఆటోలు,ట్రాక్టర్‌లను వెంటనే రిపేర్ చేయి ంచి వెంటనే చెత్తను తొలగించి స్వచ్ఛతను కాపాడి ప్రజలు అనారోగ్య బారిన పడకుండా చూడాలని కోరుతున్నారు.

## అధికారులు అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్



**ప్రజాపక్షం/భూపాల-పల్లి :** జిల్లాలో రాబోయే కొన్ని రోజులపాటు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ప్రజలు, జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. వర్షాలు కొనసాగుతున్న సమయంలో ఎలాంటి నిర్లక్ష్యం చూపకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. మండల, గ్రామ స్థాయి అధికార యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ప్రజల నుండి వచ్చే సమాచారం పై వెంటనే స్పందించాలని ఆయన ఆదేశించారు. సహాయక చర్యల కోసం తహసీల్దార్లు, ఎమర్జెన్సీ టీములు సిద్ధంగా ఉంచాలని సూచించారు. వాతావరణ శాఖ ముందస్తు ఇస్తున్న సమాచారం ప్రకారం ప్రజలు, యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

## శ్రీ చైతన్య విద్యార్థుల ప్రభంజనం

### అభినందించిన కళాశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలంలోని పొన్నెకల్లుపంచాయతీపరిధిలో గల శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం చాటారు. సోమవారం జెఎన్‌టియూ హైదరాబాద్ విడుదల చేసిన రెండవ సంవత్సరం , రెండవ సెమిస్టర్ పరీక్ష ఫలితాలలో చక్కని ప్రతిభను కనబరిచారు. కంప్యూటర్ సైన్స్ విభాగంలో మరోజు త్రిష 9.40, ఆదిరాజు ప్రియశ్రీ 9.2, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మిషన్ లెర్నింగ్ విభాగంలో తప్పెట్ల యోనా 8.95, డేటా సైన్స్ విభాగంలో ఎస్‌కే షబానా 8.80, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రికల్ విభాగంలో నాగప్రవీణ్ 8.95, తేజ 8.71,ఎలక్ట్రికల్ విభాగంలో బి.శ్రావణి 8.75, కె.లక్ష్మి 8.5,మెకానికల్ విభాగంలో జీ.వరుణ్ 8.86, 61మంది విద్యార్థులు 8.0 సిజిపిఏని సాధించారు. వీరిని కళాశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ మల్లెంపాటి శ్రీ విద్య, ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ సాయిగీతిక విద్యార్థులను అభినందించారు. ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ రాజేష్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వైశాలి, డిప్లొమా ఇంఛార్జి కృష్ణ ప్రసాద్, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

## రామాలయం ఇఒగా దామోదర్ రావు

### ప్రస్తుత ఇఒ రమాదేవి బదిలీ




**ప్రజాపక్షం/భద్రాచలం :** భద్రాచల శ్రీ సీతారామచంద్ర స్వామివారి దేవస్థానం కార్యనిర్వాహణాధికారిగా కె.దామోదర్ రావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దామోదర్ రావు గత నెల వరకు భద్రాచలం రెవెన్యూ డివిజనల్ అధికారిగా విధులు నిర్వహించారు. ఇప్పటి వరకు పనిచేసిన ఎల్.రమాదేవిని బదిలీ చేశారు. ఆమె 2023 ఫిబ్రవరిలో రామాలయం ఇఒగా విధుల్లో చేరారు. పదవీ బాధ్యతలు చేపట్టిన నాటి నుండి ఆమె ఆలయంలో పలు సంస్కరణకు శ్రీకారం చుట్టారు. దీంతో ఆలయ పరిపాలన గాడిలో పడటమే కాకుండా ఆదాయం కూడా గణనీయంగా పెరిగింది. మరోపక్క రామాలయ భూములను కాపాడేందుకు ఆమె చూపిన చొరవ దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంది.

## ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

### కలెక్టర్ జితేష్ వి పాటిల్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** వివిధ అనారోగ్య కారణాలతో ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మంగళవారం పాల్వంచ మండల పరిధిలోని శేఖరం బంజర్ గ్రామంలోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా రికార్డులు, రిజిష్టర్, ఔషధ నిల్వలు, వాక్సిన్ భద్రత, ల్యాబ్ సదుపాయాలను నిశితంగా పరిశీలించిన ఆయన సిబ్బందితో మాట్లాడారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగుల పట్ల సిబ్బంది మర్యాద పూర్వకంగా మెలగాలని, సమయపాలన పాటించాలని, విధుల పట్ల నిర్లక్ష్యాన్ని వీడి క్రమ శిక్షణతో పనిచేయాలని, గర్భిణీలు, చిన్నపిల్లలు, వృద్ధుల వైద్య సేవల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఈ సందర్భంగా భవనం పై కప్పు స్లాబ్ లీకేజీని పరిశీలించిన కలెక్టర్ సంబంధిత అధికారులను తక్షణమే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని సదుపాయాలు కల్పించాలన్నారు. జిల్లాలోని ప్రతీ ఆరోగ్య కేంద్రం నమ్మకమైన ఆరోగ్య కేంద్రాలుగా మారాలని, జిల్లాలో ఆరోగ్య సేవలు మెరుగుపరిచేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట డాక్టర్ కృష్ణకుమారి, పిహెచ్ఒ శ్రీనివాసరావు, ఎల్‌టి శృతి, స్టాఫ్ నర్స్ రాములమ్మ, ఫార్మాసిస్ట్ లలిత, మెడికల్ అసిస్టెంట్ సుధాకర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీల్లో 'యాప్ సోపాలు'

### ముందుకు సాగని ముఖ గుర్తింపు ధృవీకరణ



**ప్రజాపక్షం/కల్లూరు :** కల్లూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో కల్లూరు, తల్లాడ, పెనుబల్లి మండలాల పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలలో పౌష్టికాహారం అందించేందుకు తప్పనిసరిగా ముఖ గుర్తింపు కావాలని ఉద్దేశంతో ప్రభుత్వ ఆదేశాలతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. అంగన్‌వాడి కేంద్రాల పరిధిలో టి హెచ్ ఆర్ బాలామృతం తదితరాలను లబ్ధిదారులకు అందించేందుకు వినియోగిస్తున్న పోషన్ అభియాన్ యాప్ కు పారదర్శకత దిశగా ఇటీవల కేంద్ర ప్రభుత్వం ముఖ గుర్తింపు జోడించడంతో కష్టాలు ప్రారంభమయ్యాయని అంగన్‌వాడి ఉపాధ్యాయులు తెలుపుతున్నారు. ఆరు నెలలు దాటిన ఈ కార్యక్రమానికి శుభం కార్డు పడటం లేదని పేర్కొంటున్నారు. లబ్ధిదారుల వివరాలు నమోదు చేసినప్పుడు అప్డేట్ కావడానికి ఒకటి రెండు రోజులు పడుతుందని వారు తెలుపుతున్నారు. యాప్ సమస్యలపై అనుసంధానం చేసి చేతులు దులుపుకున్నారే తప్ప సమస్యలపై స్పందించడం లేదని వారు వివరిస్తున్నారు. యాప్ లో ఆధార్ నమోదు చేసుకున్న వారు ఓటీపీలు పూర్తి వివరాలు చెప్పడానికి వారం పది రోజులు పడుతుందని వారు తెలుపుతున్నారు. మరికొందరు తల్లులు ఓటిపిలు చెప్పడానికి అనుమానిస్తున్నారని పేర్కొంటున్నారు. యాప్ కు అనుకూలంగా ఉన్న ఫోన్ సహకరించకపోవడంతో అదో ఇబ్బంది పడుతున్నామని వివరిస్తున్నారు. కల్లూరు, తల్లాడ, పెనుబల్లి మండలాల పరిధిలో ఏసి డిపిఓల పర్యవేక్షణతో ఇబ్బందులను తొలగిస్తున్నామని, ఈ విషయమై సిడిపిఓ ను జ్యోతి నిర్మలను వివరణ కోరగా సమస్యలు ఉన్న మాట వాస్తవమేనని అట్టి సమస్యలను అధిగమిస్తున్నామని తెలిపారు

# ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

### లాభసాటి వ్యాపారాలను ప్రారంభించాలి

### మహిళా ప్రాంగణాన్ని సందర్శించిన కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఉపాధి అవకాశాలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. మహిళలు నైపుణ్యంతో లాభసాటి వ్యాపారాలను ప్రారంభించాలని తెలిపారు. మంగళవారం ఖమ్మం నగరం దుర్గాభాయి మహిళా శిశు వికాస కేంద్రం, మహిళా ప్రాంగణాన్ని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సందర్శించారు. మహిళ ప్రాంగణ పరిసరాలను కలెక్టర్ పరిశీలించారు. ప్రాంగణానికి కావాల్సిన మౌలిక సదుపాయాల గురించి మహిళా ప్రాంగణ మేనేజర్‌ను అడిగి తెలుసుకున్నారు. మహిళలకు అందిస్తున్న వృత్తి విద్యా కోర్సులు, టీచింగ్ రూమ్స్, వసతి గృహం, డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. గ్రామీణ ప్రాంత మహిళలకు వ్యవసాయ రంగంలో వినూత్న పద్ధతుల ద్వారా అధిక ఆదాయం సాధించేందుకు, స్వయం ఉపాధికి అందిస్తున్న డ్రోన్ శిక్షణను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2047 నాటికి దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 100 సంవత్సరాలు పూర్తయ్యే నేపథ్యంలో మన తెలంగాణ రాష్ట్రం ట్రిలియన్ డాలర్ ఎకానమిగా ఎదిగి దేశాభివృద్ధికి మనం తోడ్పాటు అందించాలనే లక్ష్యంతో తెలంగాణ రైజింగ్ 2047 పాలసీతో ప్రభుత్వం ముందుకెళ్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే మహిళల వర్క్ ఫోర్స్ పెరగడం చాలా కీలకమన్నారు. ఆర్థిక వ్యవస్థలో మహిళలను భాగస్వామ్యం చేయడం వల్ల ప్రగతి చాలా రేట్లు పెరుగుతుందన్నారు. వయస్సుతో సంబంధం లేకుండా శిక్షణ తీసుకుంటున్న మహిళలను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.

డ్రోన్ వాడకంపై కూడా శిక్షణ అందించడం అభినందనీయమన్నారు. వ్యవసాయ రంగం ఖమ్మం జిల్లా ఆర్థిక వ్యవస్థకు కీలకమన్నారు. ఆరు లక్షల ఎకరాల వ్యవసాయ భూమి ఉందని, సంవత్సరానికి పది లక్షల ఎకరాలు సాగు అవుతున్నాయన్నారు. ప్రస్తుతం రైతులకు కూలీలు దొరకడం లేదని వ్యవసాయరంగం యాంత్రీకరణ వైపు వెళ్తుందని, డ్రోన్ వినియోగిస్తే ఒక ఎకరం భూమిలో పురుగుమందు పిచికారి 15 నిమిషాల్లో చల్లవచ్చునన్నారు. డ్రోన్ వాడకం వల్ల రోజుకు దాదాపు రూ. 15వేల వరకు సంపాదించవచ్చునని, నెలలో 20 రోజులు పనిచేస్తే కలెక్టర్ కంటే ఎక్కువగా సంపాదించవచ్చునని తెలిపారు. నానో యూరియా వాడకం డ్రోన్ ద్వారా సాధ్యమవుతుందన్నారు.

రాబోయే రోజుల్లో డ్రోన్ వినియోగం పెరుగుతుందని తెలిపారు. వ్యాపార రంగంలో లాభార్జనే ధ్యేయంగా ముందుకెళ్లాలని, కష్టమర్లలో నమ్మకం కలిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా ప్రాంగణ మేనేజర్ వేల్పుల విజేత, సిబ్బంది సరస్వతి, స్పందన, మల్లిక, విజయ్ కుమార్, సుధీర్, సుకన్య, మౌనిక, లాలయ్య, జయ, శారద, అనిత, దుర్గారావు, శాంతమ్మ, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.



## పర్యావరణ పరిరక్షణ దిశగా అడుగులేద్దాం

### మట్టి విగ్రహాలతో చవితి ఉత్సవాలు జరుపుకుందాం

### కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

**ప్రజాపక్షం/కొత్తగూడెం :** మట్టి విగ్రహాలతో వినాయక చవితి ఉత్సవాన్ని జరుపుకోవడం ద్వారా పర్యావరణ పరిరక్షణవైపు అడుగులేద్దామని ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కార్పొరేషన్ పరిధిలోని పలు సెంటర్లలో ఏర్పాటుచేసిన మట్టి విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ మట్టి విగ్రహాలతో వినాయకచవితి పండుగను జరుపుకోవాలన్నారు. హానికరమైన రసాయన, ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్‌తో తయారు చేసిన విగ్రహాలు వాడటం ద్వారా పర్యావరణానికి హాని కలుగుతుందని, తద్వారా పలు రకాల ఇబ్బందులు ఎదురవుతాయని చెప్పారు. ప్రభుత్వం పలు స్వచ్ఛంద సంస్థల చొరవతో ప్రజల్లో అవగాహన పెరుగుతోందని, మరింత ప్రచారం కల్పించడం ద్వారా మట్టి విగ్రహాలు ఏర్పాటును విస్తృతం చేయాలన్నారు. నియోజవర్గంలోని గణేష్ మండపాల వద్ద పారిశుధ్య పనులు ఎప్పటికప్పుడు చేపట్టాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ శాఖ పర్యవేక్షణ చేయాలని తెలిపారు. పండుగ సందర్భంగా ఆయన నియోజకవర్గ ప్రజలకు శుభా కాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా, కార్పొరేషన్ కమీషనర్ సుజాత, అధికారులు అహ్మద్, వీరభద్రాచారి, రంగప్రసాద్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు ఎస్‌కె.ఫహీం, గెద్దాడు నగేష్, కేశవరావు, యూసుఫ్, బోయిన విజయ్‌కుమార్, సత్యనారాయణ చారి, దుర్గ, సతీష్, నర్సింహా, అజీజ్, నీడల సుధాకర్ పాల్గొన్నారు.

# ఇండోర్ విధానాలు ఖమ్మంలో అమలు

### స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దేందుకు సహకరించాలి

### మేయర్ పునుకొల్లు నీరజ



**ప్రజాపక్షం/ఖమ్మంఅర్బన్ :** ఇండోర్ నగరంలో అమలవుతున్న విధానాలను ఖమ్మం నగరంలో అమలుపరిచి స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దనున్నట్లు, అందుకు ప్రజలు కూడా సహకరించాలని ఖమ్మం నగరపాలక సంస్థ మేయర్ పునుకొల్లు నీరజ తెలిపారు. మంగళవారం మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమాజోహరాతో కలిసి ఖమ్మం కార్పొరేషన్ కార్యాలయంలో తన చాంబర్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి, ఇండోర్ స్టడీ టూర్‌కు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఇండోర్ నగర స్టడీ టూర్‌లో ఎన్నో అనుభవాలను గుర్తించామన్నారు. ఇండోర్ నగరం వరుసగా దేశంలోనే శుభ్రమైన నగరంగా అవార్డు పొందుతుందన్నారు. దానికి కారణం అక్కడ పారిశుధ్య నిర్వహణ, శుభ్రత పట్ల ప్రజలకు అవగాహన, ఆధునిక సాంకేతిక వినియోగిస్తున్నారన్నారు. ఇండోర్ నగరంలో వ్యర్థాలను వేరుచేయడం, ప్రతి ఇంటి నుంచి ఖచ్చితంగా అమలు చేస్తున్నారన్నారు. రీసైక్లింగ్ ద్వారా వ్యర్థాలను వనరులుగా మార్చుతున్నారన్నారు. ప్రజల భాగస్వామ్యాన్ని పెంచి శుభ్రతను ఒక ఉద్యమంగా తీర్చిదిద్దడంతో పాటు గ్రీన్ ఎనర్జీ వినియోగం, సాంకేతిక పద్ధతులను ఉపయోగించడం, వెహికిల్ ట్రాకింగ్ కంట్రోల్ రూము ఏర్పాటు వంటి విధానాలను అక్కడ అవలంభిస్తున్నారన్నారు. ఇండోర్ నగరంలో అవలంభిస్తున్న విధానాలు ఖమ్మం నగరానికి కూడా చాలా అవసరమన్నారు. ఇండోర్ నగరంలో అవలంభిస్తున్న విధానాలను ఖమ్మం నగరంలో కూడా అమలు చేసేందుకు మంత్రి తుమ్మల నాగేశ్వర రావు సహకారంతో తగు చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలో మున్సిపల్ సిబ్బందికి ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఎన్‌జివోస్ కూడా ముందుకు వస్తే వారి భాగస్వామ్యంపై పారిశుధ్య నిర్వహణ, శుభ్రతపై ప్రజల్లో అవగాహన కార్యక్రమం చేపడతామన్నారు. ప్రజల సహకారంతో ఇండోర్ తరహాలో ఖమ్మం నగరాన్ని స్మార్ట్ సిటీగా నిలపడమే లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా ఖమ్మం నగర ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు దుద్దుకూరి వెంకటేశ్వరరావు, మలీదు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



## వినాయక ఉత్సవాలకు పటిష్ఠ బందోబస్తు

### చోరీ కేసుల ఛేదనలో పురోగతి

### మైనర్లు, మద్యం మత్తులో వాహనాలు నడిపితే కేసులు

### పోలీస్ కమిషనర్ సునీల్ దత్

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** వినాయక నవరాత్రోత్సవాల సందర్భంగా ప్రజా భద్రతతో పాటు ప్రశాంత వాతావరణానికి భంగం కలుగకుండా పటిష్ట బందోబస్తు చేపట్టాలని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం జరిగిన నేర సమీక్షా సమావేశంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ గణేష్ విగ్రహాల ప్రతిష్టాపన మొదలు నిమజ్జనం వరకు ఎక్కడ చిన్న పొరపాటుకు తావు లేకుండా ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు. ఉత్సవాల్లో భక్తులకు, ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు కలుగకుండా విధిగా మండపాలను సందర్శించి నియమనిబంధనలు పాటించేలా చూడాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించడానికి సిద్ధంగా ఉండాలన్నారు. విజుబుల్ పోలీసింగ్‌కు తగిన ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు రాత్రి వేళల్లో పోలీస్ పెట్రోలింగ్ పెంచాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగే నేరాలపై డివిజన్ స్థాయి అధికారులు విధిగా సమీక్షించాలని, చార్జ్‌షీట్‌లను సకాలంలో దాఖలు చేయడం అలవర్చుకోవాలని పోలీస్ అధికారులకు సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్‌లో నేరాల రేటు విశ్లేషణ, శిక్ష విధించే రేట్లను పెంచడం వంటి విషయాలపై అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళలపై, చిన్నారులపై జరిగే నేరాలు, మాదక ద్రవ్యాల రవాణాను ఏమాత్రం సహించబోమని స్పష్టం చేశారు. ప్రధాన చోరీ కేసుల దర్యాప్తులో పురోగతి, మహిళలు, పిల్లలపై జరిగే నేరాలు, వ్యవస్థీకృత నేర ముఠాలు, మాదక ద్రవ్యాల సంబంధిత నేరాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రహదారుల్లో ట్రిబుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్‌తో పాటు మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేసి శిక్షపడేలా పోలీసులు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని సిపి ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషనల్ డిసిపి లా అండ్ ఆర్డర్ ప్రసాదరావు, ఎసిపిలు రమణమూర్తి, తిరుపతిరెడ్డి, రెహమాన్, రఘు, సాంబరాజు, మహేష్, సర్వర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

### అనారోగ్యంతో ఉన్నా వేధించిన అధికారులు

### ఖండించిన ఎంప్లాయిస్ యూనియన్



**ప్రజాపక్షం/ ఖమ్మం :** అధికారుల వేధింపులతో మణుగూరు డిపోకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అనారోగ్యంతో రెండుసార్లు గుండె ఆపరేషన్ అయిన వ్యక్తికి కావాలనే కండక్టర్ లేని టిమ్స్ సర్వీస్‌ను అప్పగించడంతోపాటు దూర ప్రాంత సర్వీసులకు కేటాయించడంతో తన పరిస్థితి బాగాలేదని చెప్పినా అధికారులు పట్టించుకోకపోవడంతో తీవ్ర వేదనకు గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళితే... మణుగూరు డిపోలో సైదులు సాహెబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సైదులుకు తిరుపతి, శ్రీశైలం నడిచే దూర ప్రాంతాలకు చెందిన టిమ్స్ సర్వీస్‌కు డ్యూటీ వేశారు. ఆయన డ్యూటీ వేసే సూపర్‌వైజర్లను మణుగూరు డిపో మేనేజర్లను కలిసి తనకు అంతగా చదువు రాదని, దానికి తోడు అనారోగ్యం ఉందని టిమ్స్ డ్యూటీ చేయలేనని తన ఆవేదనను వారి ముందు తెలిపారు. మణుగూరు డిపో మేనేజర్ అది తమ పరిధిలో లేదని ఖమ్మం రీజినల్ మేనేజర్‌ను కలిసి అనుమతి తెచ్చుకుంటే కండక్టర్‌తో కూడిన సర్వీస్‌కు డ్యూటీ వేస్తామని చెప్పడంతో సోమవారం ఖమ్మం రీజినల్ మేనేజర్‌ను కలిశారు. సైదులు తన ఆరోగ్య పరిస్థితిని, డ్యూటీ వివరాలను ఆర్ఎంకు వివరించారు. అయినా కాస్త కనికరం కూడా చూపకుండా నువ్వు దూర ప్రాంత సర్వీసులకు వెళ్లాల్సిందేనని నీకు కండక్టర్‌ను కేటాయించబోమని స్పష్టం చేయడంతో తీవ్ర మనోవేదనకు గురైన సైదులు ఆర్ఎం కార్యాలయం వద్దనే పురుగు మందు తాగాడు. వెంటనే సిబ్బంది అతనిని వైద్య చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. సైదులు వైద్య చికిత్స పొందుతున్నాడు. అధికారుల వేధింపుల కారణంగానే సైదులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని ఆర్టీసి కార్మికులు ఆరోపిస్తున్నారు.

**ఎంప్లాయిస్ యూనియన్ ఖండన :**

అధికారులు సిబ్బందిని వేధించడాన్ని ఆర్టీసి ఎంప్లాయిస్ యూనియన్ తీవ్రంగా ఖండించింది. అనారోగ్య పరిస్థితులను పరిగణలోకి తీసుకోకపోవడం అత్యంత బాధాకరమని ఎంప్లాయిస్ యూనియన్ ఖమ్మం రీజియన్ కమిటీ తెలిపింది. సిబ్బందిని అక్కున చేర్చుకుని వారి సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు ఇబ్బందులకు గురిచేయడం వల్లనే సైదులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని తెలిపింది. సైదులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించింది. ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి గూడూరు సత్యనారాయణ, ఖమ్మం రీజియన్ అధ్యక్షులు బూదాటి శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శి పిల్లి రమేష్ ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. అధికారులు వేధింపులు ఆపకపోతే ఆందోళన తప్పదని వారు హెచ్చరించారు. ఆర్టిసికి సంబంధించి సైదులు ఆత్మహత్యాయత్నం చివరిది కావాలని లేకుంటే ప్రత్యక్ష ఆందోళనకు సిద్ధమవుతామని వారు తెలిపారు.

## యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన సదస్సు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ర్యాగింగ్ విద్యార్థుల జీవితాలను ఛిద్రం చేస్తుందని ఖమ్మం ఖానాపురం హవేలీ సబ్ ఇన్‌స్పెక్టర్ గౌతమి తెలిపారు. మంగళవారం ఎస్‌బిఐటి కళాశాలలో యాంటీ ర్యాగింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సదస్సులో సబ్ ఇన్‌స్పెక్టర్ గౌతమి మాట్లాడుతూ ఏవిధమైన దుశ్చర్య అయినా అది మాటల ద్వారా కానీ, చేతల ద్వారా కానీ, మానసికంగా కానీ, సెక్స్‌వల్‌గా కానీ ఇతరులకు ఇబ్బందులు కలిగించడం ర్యాగింగ్‌గా పరిగణిస్తారన్నారు. విద్యార్థులు తెలిసీతెలియక ఇటువంటి తప్పిదాలకు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ మాట్లాడుతూ తమ కళాశాలలోని విద్యార్థులు క్రమశిక్షణను అవలంభించడం ద్వారా ర్యాగింగ్ ఫ్రీగా క్యాంపస్‌ను నిలిపామన్నారు. విద్యార్థుల మధ్య సఖ్యతను పెంపొందించడం ద్వారా సీనియర్, జూనియర్ అనే బేధం లేకుండా చేయగలిగామన్నారు. కరస్పాండెంట్ డా.జి.ధాత్రి మాట్లాడుతూ ర్యాగింగ్ బారిన పడిన వారు ఆత్మవిశ్వాసం కోల్పోయి ఆత్మహత్యకు పాల్పడే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకాడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, ఎవివి శివప్రసాద్, జె.రవీంద్రబాబు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఆడపిల్లలే జాతికి, సృష్టికి మూలం

### డిఎంఅండ్‌హెచ్ఒ బి.కళావతిబాయి



**ప్రజాపక్షం/ఖమ్మం వైద్యవిభాగం :** ఆడపిల్లలే జాతికి, సృష్టికి మూలమని డిఎంఅండ్‌హెచ్ఒ బి కళావతిబాయి అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పిసిపిఎన్‌డిటి యాక్ట్ అడ్వయిజరీ కమిటీ సమావేశాన్ని డిఎంఅండ్‌హెచ్ఒ ఛాంబర్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అడ్వయిజరీ కమిటీని ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ సేవ్ గర్ల్ చైల్డ్ అంటే బాలికలను రక్షించడం మాత్రమే కాదు ప్రతి గర్భిణీ స్త్రీ స్వేచ్ఛగా, స్వతంత్రంగా ప్రసవం అయ్యేలా అన్ని జాగ్రత్తలు తీసుకుందామని అన్నారు. ముఖ్యంగా ఆడపిల్ల స్వేచ్ఛగా పుట్టాలి, గౌరవంగా పెరగాలి, జ్ఞానంతో ఎదగాలి, ఆడపిల్లలలేని సమాజం ఊహించలేమని, ఆడపిల్లలే జాతికి, సృష్టికి మూలకారకులని తెలిపారు. జిల్లాలో అందరం కలిసి పుట్టబోయే ఆడపిల్లల శాతం తగ్గకుండా సీరియస్‌గా మానిటరింగ్ చేయాలని, భ్రూణ హత్యలు, అబార్షన్లు, లింగ నిర్ధారణ చేస్తున్న వ్యక్తులు సంస్థలు, ఫెసిలిటిస్‌పై గట్టి నిఘా పెట్టాలని, క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఎఎన్ఎం, అంగన్వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలకు గర్భస్థ పూర్వ మరియు గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షల చట్టంపై పూర్తి స్థాయిలో శిక్షణ ఇచ్చి అవగాహన కల్పించి అబార్షన్లు, భ్రూణ హత్యలు జరగకుండా కట్టడి చేద్దామని పేర్కొన్నారు. ఈ విషయంలో ప్రతి నెల నిర్వహించే కార్యక్రమాలపై సమీక్ష చేసుకుందామని, డిపిఆర్ఒ ప్రత్యేక చొరవ తీసుకుని సేవ్ గర్ల్ చైల్డ్, బేటి బచావో..బేటి పడావో..కార్యక్రమాలపై మానవీయ కథనాలను జర్నలిస్టులతో రాయించాలని కోరారు. ఆడపిల్లలను రక్షించడానికి కొందరు మంచివారు గర్భిణీ స్త్రీకి ప్రసవానికి ముందు, ప్రసవం తర్వాత సహాయం అందిస్తున్నవారికి, ఆడపిల్ల పుట్టడానికి చేయూతనిస్తున్న వారిని అభినందించాలని, ఆడపిల్ల ఉంటేనే సమాజం మానవత్వంతో ఉంటుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి బి.కళావతి బాయి తెలిపారు. బాలికలు పుట్టడానికి ముందే వివక్షను ఎదుర్కొంటున్నారని, వారికి పుట్టే, జీవించే, పెరిగే హక్కులు అందరితో పాటు సమాన హక్కులున్నాయని, స్కానింగ్ సెంటర్లపై, అబార్షన్లు చేస్తున్నా వారిపై ప్రత్యేక నిఘా పెట్టామని, గర్భస్థ పూర్వ మరియు గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షల చట్టం( ప్రొహిబిషన్ ఆఫ్ సెక్స్ సెలెక్షన్) చట్టాన్ని అతిక్రమిస్తే చట్టం ప్రకారమే సీజ్ చేస్తామని ఎంసిహెచ్ ప్రోగ్రాం ఆఫీసర్ డా చందు నాయక్ తెలిపారు.



ఈ సమావేశంలో డిసిహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్, హెడ్ఆఫ్‌ద డిపార్మెంట్ పిడియాట్రిక్స్ డాక్టర్ బాబురత్నాకర్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వెంకటరమణ, డిపిఆర్ఓ గౌస్, డిసిపిఓ విష్ణువర్ధన, డెమో సుబ్రహ్మణ్యం, అసిస్టెంట్ డైరెక్టర్ కె శ్రీనివాసరావు, జాగ్రతి స్వచ్ఛంధ సేవా సంస్థ కుముదిని, హెల్త్ ఎడ్యుకేటర్ అన్వర్, డిఎంసి సయ్యద్ సమీనా, హెల్త్ సూపర్‌వైజరు నర్సయ్య, డిఈఓ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# కొలువు దీరనున్న గణపయ్య

### మంటపాలకు తరలుతున్న గణనాధులు

### భారీ సెట్టింగ్‌ల మధ్య పందిళ్లు

### చవితికి వర్షపు దెబ్బ



**ప్రజాపక్షం/ఖమ్మం :** గణపతి ప్రత్యేక పూజలకు వేళ అయింది. విఘ్నాలను హరించే విఘ్నేశ్వరుని జన్మదినమే వినాయక చవితి. గణేష్ ఉత్సవమంటే ఓ సందడి. గతం కంటే భిన్నంగా గణేష్ నవరాత్రోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. భాద్రపద మాసంలో వచ్చే తొలి పండుగ వినాయక చవితి. ఈ ఏడాది ఆగస్టు 27 బుధవారం నాడు ఈ పండుగను నిర్వహిస్తున్నారు. గ్రామాలు, పట్టణాలు అనే తేడాలు లేకుండా చవితి పందిళ్లను భారీగా ఏర్పాటు చేశారు. పలు చోట్ల భారీ గణనాధులను పూజలకు సిద్ధం చేస్తున్నారు. తొమ్మిది రోజుల పాటు విశిష్ట పూజలు నిర్వహించేందుకు భారీ సెట్టింగ్‌ల నడుమ చవితి పందిళ్లను ఏర్పాటు చేస్తున్నారు. మంగళవారం నాడే గణనాధులు మండపాలకు తరలుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో స్థానిక సమరాన్ని దృష్టిలో ఉంచుకుని పోటా పోటీగా వినాయక చవితి ఉత్సవాలను నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత విద్యుత్ సౌకర్యాన్ని కల్పించినప్పటికీ నవరాత్రి ఉత్సవ కమిటీ సభ్యులు తప్పనిసరిగా పోలీసుల వద్ద అనుమతి తీసుకోవాల్సి ఉంది.

**మట్టి విగ్రహాలకు విస్తృత ప్రచారం :**

ఎప్పటి మాదిరిగానే మట్టి విగ్రహాలకు ఈ ఏడాది విస్తృత ప్రచారం కల్పిస్తున్నారు. స్వచ్ఛంద సంస్థలు ఉచితంగానే మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు మట్టి విగ్రహాలను ప్రకృతి పర్యావరణం దృష్ట్యా వినియోగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**ప్రశాంతంగా ఉత్సవాలు :**

వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా, ఘనంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తుంది. ఉత్సవ నిర్వహణ, నిమజ్జనం తదితర విషయాలకు సంబంధించి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు పటిష్ట భద్రతను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే గణేష్ నవరాత్రి ఉత్సవ కమిటీలతో అధికార యంత్రాంగం సమావేశాలు నిర్వహించింది.

**ఉత్సవాలకు వర్షం అడ్డంకి :**

ఈ ఏడాది చవితి ఉత్సవాలపై వర్ష ప్రభావ సూచన కనిపిస్తుంది. మంగళవారం మొత్తం ఎడతెరిపి లేకుండా చినుకులు పడుతూనే ఉన్నాయి. వాతావరణ శాఖ రాగల మూడు రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని ప్రకటన చేయడంతో గణపతి పూజా కార్యక్రమాలపై వర్షం ప్రభావం ఉండే అవకాశం ఉంది.

**విరివిగా పూజా సామాగ్రి అమ్మకాలు :**

వినాయక పూజా కార్యక్రమాలకు సంబంధించి పత్రి ఇతర పూజా సామాగ్రిని అమ్ముకునే దుకాణాలు విరివిగా వెలిశాయి. ముఖ్యంగా పత్రి, కూరగాయలు, జిల్లేడు, జమ్మి, ఉమ్మెత మొదలైనవి రోడ్లపై పెట్టి విరివిగా విక్రయిస్తున్నారు.

# క్రీడ

## సంజూ విధ్వంసం..



### 9 సిక్స్‌లతో వీర విహారం!

ఆసియా కప్ 2025 టోర్నీ ప్రారంభానికి ముందు సంజూ శాంసన్ దుమ్మురేపుతున్నాడు. ఆదివారం భారీ శతకంతో చెలరేగిన సంజూ శాంసన్.. తాజాగా విధ్వంసకర హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు. కేరళ క్రికెట్ లీగ్ 2025లో కొచ్చి బ్లూ టైగర్స్‌కు సారథ్యం వహిస్తున్న సంజూ శాంసన్ నిలకడగా ఆడుతూ.. విధ్వంసకర బ్యాటింగ్‌తో టీమిండియా మేనేజ్‌మెంట్‌కు గట్టి వార్నింగ్ ఇస్తున్నాడు. మంగళవారం తిస్సూర్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఓపెనర్‌గా బరిలోకి దిగిన సంజూ శాంసన్.. 46 బంతుల్లో 4 ఫోర్లు, 9 సిక్స్‌లతో 89 పరుగుల చేశాడు. మరో సెంచరీ దిశగా సాగిన సంజూ శాంసన్‌ను అజినాస్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. మిగతా బ్యాటర్లు నిరాశపర్చడంతో కొచ్చి బ్లూ టైగర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 188 పరుగులు చేసింది. కొల్లమ్ సెయిలర్స్ జట్టుతో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో సంజూ సెంచరీ సాధించిన విషయం తెలిసిందే. 16 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్న సంజూ 42 బంతుల్లో శతకం పూర్తి చేసుకొని బౌలర్లను ఊచకోత కోసాడు. ఓపెనర్‌గా తన బిగ్ హిట్టింగ్ సామర్థ్యాన్ని చాటి చెప్పాడు. శుభ్‌మన్ గిల్ కంటే తాను ఎంతో మెరుగైన ఓపెనర్‌నని అల్టిమేటం జారీ చేశాడు. ఆసియాకప్ 2025 కోసం ఎంపిక చేసిన భారత జట్టులో సంజూ శాంసన్‌కు అవకాశం దక్కింది. కానీ అతన్ని తుది జట్టులో కొనసాగించే అవకాశాలు తక్కువగా ఉన్నాయని చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్.. మీడియా సమావేశంలో వెల్లడించాడు. సంజూ శాంసన్ జట్టులో ఉన్నప్పటికీ ఓపెనర్‌గా శుభ్‌మన్ గిల్ ఆడుతాడని హింట్ ఇచ్చాడు. గిల్, యశస్వి జైస్వాల్ టీ20 ఫార్మాట్‌కు అందుబాటులో లేకపోవడంతోనే సంజూ శాంసన్ ఓపెనర్‌గా ఆడాడని, అది అతని పర్మినెంట్ ప్లేస్ కాదని అగార్కర్ చెప్పుకొచ్చాడు. మరోవైపు అభిషేక్ శర్మ ఓపెనర్‌గా సత్తా చాటాడని, అతని చేరికతో జట్టుకు బౌలింగ్ ఆప్షన్ పెరుగుతుందన్నాడు.

అయితే భారత్ తరఫున గత 10 ఇన్నింగ్స్‌ల్లో సంజూ శాంసన్ ఓపెనింగ్ చేసి మూడు శతకాలు సాధించాడు. కానీ గిల్ రాకతో అతన్ని ఓపెనింగ్ ఆడిస్తారా? అనేది సందేహంగా మారింది. ఒకవేళ గిల్ ఓపెనింగ్ చేస్తే సంజూ శాంసన్ బెంచ్‌కు పరిమితమయ్యే అవకాశాలు ఉన్నాయి. ఎందుకంటే లోయరార్డర్‌లో సంజూ కంటే వికెట్ కీపర్‌గా జితేష్ శర్మ బాగా సెట్ అవుతాడు. మరీ హెడ్ కోచ్ గౌతం గంభీర్ ఏం చేస్తాడో చూడాలి.

## కొత్త స్పాన్సర్ కోసం బిసిసిఐ అన్వేషణ

డ్రీమ్ 11 వైదొలగడంతో బిసిసిఐ కొత్త స్పాన్సర్ వేటలో పడింది. అయితే వచ్చే నెల ఆసియాకప్ లోపు స్పాన్సర్ ఖరారయ్యే అవకాశం కనిపించట్లేదు. డబ్బుతో ముడిపడి ఉన్న అన్ని ఆన్‌లైన్ గేమ్‌లను నిషేధిస్తూ ప్రభుత్వం కొత్త చట్టం తేవడంతో డ్రీమ్ 11.. టీమ్‌ఇండియా టైటిల్ స్పాన్సర్‌గా కొనసాగరాదని నిర్ణయించుకున్న సంగతి తెలిసిందే. డ్రీమ్ 11తో ఒప్పందం ముగిసిన విషయాన్ని బిసిసిఐ కార్యదర్శి దేవజిత్ సైకియా ధ్రువీకరించాడు. 'మేం వాళ్లతో కొనసాగలేం. కొత్త స్పాన్సర్ కోసం అన్వేషిస్తున్నాం. ఆ ప్రక్రియ కొనసాగుతోంది' అని చెప్పాడు. భారత జాతీయ జట్లకు స్పాన్సర్‌గా ఏడాదికి రూ. 358 కోట్లతో డ్రీమ్ 11.. బిసిసిఐతో ఒప్పందం చేసుకుంది. అది ముగియడానికి ఇంకా ఏడాది సమయముంది. అయితే అర్ధంతరంగా ఒప్పందం నుంచి వైదొలిగినా డ్రీమ్ 11పై బోర్డు చర్యలు తీసుకునే అవకాశం లేదు. మరో గేమింగ్ సంస్థ మై11సర్కిల్ కూడా ఐపిఎల్ స్పాన్సర్‌గా వైదొలిగే అవకాశముంది. అయిదేళ్లకు గాను ఏడాదికి రూ. 125 కోట్లతో మై11సర్కిల్ ఒప్పందం చేసుకుంది.

## జతిందర్ సింగ్‌కు కెప్టెన్సీ..

### ఒమన్ స్క్వాడ్‌లో నలుగురు అన్‌క్యాప్డ్ ప్లేయర్లు

నిరుడు టీ20 వరల్డ్ కప్‌లో ఆడిన ఒమన్ ఈసారి ఆసియా కప్ పోటీల్లో గొప్ప ప్రదర్శన చేయానుకుంటోంది. తొలిసారి ఈ మెగా టోర్నీకి అర్హత సాధించిన ఈ పసికూన సంచలన విజయాలతో పెద్ద జట్లకు షాకివ్వాలని భావిస్తోంది. అందుకే యువకులు, సీనియర్లతో కూడిన పటిష్టమైన స్క్వాడ్‌ను ప్రకటించారు సెలెక్టర్లు. పదిహేడు మందితో కూడిన బృందానికి జతిందర్ సింగ్ సారథ్యం వహించనున్నాడు. మంగళవారం ఎంపిక చేసిన స్క్వాడ్‌లో నలుగురు అన్‌క్యాప్డ్ ప్లేయర్స్‌కు చోటు దక్కడం విశేషం. 'ఆసియా కప్ ఆడాలనే మా కల సాకారమైంది. అంతర్జాతీయ వేదికపై తమ ప్రతిభను చాటేందుకు మా ఆటగాళ్లకు ఇది సువర్ణావకాశం. భారత్, పాకిస్థాన్ వంటి బలమైన జట్లతో తలపడడం ఏ క్రికెటర్‌కైనా కొత్త ఉత్సాహాన్ని ఇస్తుంది. పొట్టి ఫార్మాట్‌లో ఏదైనా సాధ్యమే. ఒక్క అద్భుతమైన ఓవర్ చాలు మ్యాచ్ ఫలితం మారిపోవడానికి. మా బృందం పటిష్టంగా ఉంది. మా దేశంలో టీ20 టోర్నమెంట్ జరుగుతున్నందున మ్యాచ్ విన్నర్లనే ఆసియా కప్‌కి ఎంపికచేశాం అని ఒమన్ హెడ్‌కోచ్ దులీప్ మెండిస్ అన్నాడు.

అంతేకాదు పెద్ద జట్లతో ఆడేటప్పుడు ఒత్తిడి ఉంటుందని.. అందుకు మానసికంగా ధ్రుఢంగా ఉండేలా తమ ఆటగాళ్లకు శిక్షణ ఇప్పించామని కోచ్ వెల్లడించాడు. ఆసియా కప్‌లో మేము కచ్చితంగా ప్రభావం చూపిస్తాం. క్రికెట్ దేశంగా ఒమన్ ఎదుగుతోంది అని చాటుతాం. సీనియర్లు, యువకులతో కూడిన స్క్వాడ్ అద్భుతంగా ఆడుతుందని ఆశిస్తున్నా' అని ఆయన పేర్కొన్నాడు. దేశవాళీలో, క్వాలిఫయర్ మ్యాచుల్లో రాణించిన కుర్రాళ్లకు ఆసియా కప్ బెర్తు కట్టబెట్టారు సెలెక్టర్లు. తొలిసారి జట్టులోకి వచ్చిన సూఫియన్ యూసుఫ్, జికిరా ఇస్లాం, ఫైజల్ షా, నదీమ్ ఖాన్‌లు ఈ



టోర్నీతో టీ20ల్లో అరంగేట్రం చేయనున్నారు. భారత్, పాకిస్థాన్, ఈతిథ్య యూఏఈతో పాటు ఒమన్ జట్టు గ్రూప్ ఏలో ఉంది. లీగ్ దశలో సెప్టెంబర్ 12న పాకిస్థాన్‌తో తలపడనుందీ పసికూన. అనంతరం సెప్టెంబర్ 15న యూఏఈ, సెప్టెంబర్ 19న టీమిండియాను ఢీకొట్టనుంది ఒమన్.

**ఒమన్ స్క్వాడ్ :** జతిందర్ సింగ్(కెప్టెన్), హమ్మద్ మిర్జా, వినాయక్ శుక్లా, సుఫీయన్ యూసుఫ్, అశిష్ ఒడెదరా, అమిర్ ఖలీం, హాహమ్మద్ నదీమ్, సూఫియన్ మహమూద్, అర్యాన్ బిష్త్, కరన్ సొనావలే, జిక్రియా ఇస్లాం, హస్నైన్ షా, ఫైజల్ షా, ముహమ్మద్ ఇమ్రాన్, నదీమ్ ఖాన్, షకీల్ అహ్మద్ సమయ్ శ్రీవాత్సవ.

# మహిళ

## ఫోకస్

మహిళల అభ్యున్నతికి ఎన్ని చట్టాలు చేసినా, ఎన్ని పథకాలను ప్రవేశపెట్టినా పరిస్థితిలో చెప్పుకోదగిన మార్పు రావడం లేదు. ప్రత్యేకించి మహిళల స్వావలంబన అనేది అందని ద్రాక్షగానే మిగిలిపోతున్నది. మహిళల సామాజిక ఆర్థిక పరిస్థితులపై జాతీయ అంతర్జాతీయ తాజా నివేదికలు, గణాంకాల ప్రకారం, మహిళల జీవన స్థితిగతుల్లో కొద్దిపాటి పురోగతి ఉన్నప్పటికీ, అది కేవలం కొన్ని ప్రాంతాలు లేదా వర్గాలకు మాత్రమే పరిమితమైంది.




## పేదరికం యథాతథం..

స్థూలంగా చూస్తే మాత్రం పేదరికం యథాతథంగానే ఉంది. ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం, ప్రస్తుత పోకడలు ఇలాగే కొనసాగితే 2030 నాటికి 342.4 మిలియన్ల మంది మహిళలు, యువతులు రోజుకు 2.15 డాలర్లు (సుమారు 188 రూపాయలు) కంటే తక్కువ ఆదాయంతో జీవిస్తూ ఉంటారు. ప్రపంచవ్యాప్తంగా, శ్రామిక శక్తి భాగస్వామ్యంలో లింగ అంతరం 1990 నుండి స్తబ్దుగా ఉంది, పురుషుల భాగస్వామ్యం దాదాపు 80 శాతం, మహిళల భాగస్వామ్యం 50 శాతం వద్ద ఉంది. ప్రపంచవ్యాప్తంగా లింగ వేతన అంతరం 20 శాతంగా అంచనా వేస్తున్నారు. కాలక్రమేణా అంతరం తగ్గినప్పటికీ, ఇటీవలి సంవత్సరాలలో పురోగతి స్థిరంగా ఉంది. మహిళలు అనధికారిక ఉపాధిలో ఎక్కువగా ఉంటున్నారు. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 60 శాతం మహిళా ఉపాధి అనధికారిక ఆర్థిక వ్యవస్థల్లోనే కనిపిస్తుంది. తక్కువ ఆదాయ దేశాలలో, ఈ సంఖ్య 90 శాతం కంటే ఎక్కువగా ఉంది. సగటున పురుషుల కంటే స్త్రీలు, బాలికలు రోజుకు 2.5 రెట్లు ఎక్కువ గంటలు జీతం లేని ఇంటి పని లేదా పిల్లల సంరక్షణ సంరక్షణలోనే గడుపుతున్నారు. ఇది వారి శారీరక, మానసిక, ఆర్థిక పరిస్థితులపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. ప్రస్తుత వేగంతో, వేతనం లేని సంరక్షణ పనులలో లింగ అంతరం కనీసం మరో 22 నుంచి 28 సంవత్సరాలు కొనసాగుతుందని అంచనా. ఈ అంచనా మరింత పెరిగే అవకాశాలే ఎక్కువ. కాగా, వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ విడుదల చేసిన '2024 గ్లోబల్ జెండర్ గ్యాప్ ఇండెక్స్' ప్రకారం ఆరోగ్యం, మనుగడలో లింగ అంతరం 96 శాతం తగ్గింది. ఇది ఆశాజనకమైన పరిణామమే. అయితే, ఆహార అభద్రతలో లింగ అంతరాలు పెరగడం ఆందోళన కలిగించే అంశం. పురుషులలో 27.6 శాతం మందితో పోలిస్తే 31.9 శాతం మంది మహిళలు మధ్యస్త లేదా తీవ్రమైన ఆహార అభద్రతతో ఉన్నారు. ఇప్పటికీ అనేక విషయాల్లో మహిళలకు చట్టపరమైన అడ్డంకులు కొనసాగుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా 16 శాతం మంది మహిళలు గృహ హింసను నేరంగా పరిగణించని దేశాలలో నివసిస్తున్నారనడం దిగ్భ్రాంతికి గురి చేసే వాస్తవం. 2024లో మహిళల పార్లమెంటరీ సీట్ల వాటా 27.2 శాతంగా ఉంది, ఇది 2015లో 22.3 శాతానికి తగ్గింది. ప్రస్తుత రేటు ప్రకారం, నిర్వాహక పాత్రలలో లింగ సమానత్వాన్ని చేరుకోవడానికి దాదాపు 100 సంవత్సరాలు పడుతుంది. 15 నుంచి 49 ఏళ్ల మధ్య వయసున్న మహిళల్లో 56.3 శాతం మందికి మాత్రమే వారి లైంగిక, పునరుత్పత్తి ఆరోగ్యంఐ అదే విధంగా హక్కులపై పూర్తి నిర్ణయం తీసుకునే అధికారం ఉంది. మన దేశం విషయానికి వస్తే పరిస్థితి కొంత మెరుగ్గా ఉంది. 15 లేదా అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న వారిలో మహిళా శ్రామిక శక్తి భాగస్వామ్య రేటు 201718లో 23.3 శాతం ఉండగా, అది 2022–23లో 37 శాతానికి పెరిగింది. అయితే, స్త్రీ, పురుషుల మధ్య శ్రామిక శక్తి భాగస్వామ్య రేటులో గణనీయమైన అసమానత కొనసాగుతునే ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో పురుషులకు చెల్లించే మొత్తాలు మహిళల కంటే సుమారు రెట్టింపుగా ఉంది. పట్టణ ప్రాంతాల్లో కనీసం మూడింట ఒక వంతు తేడాను గమనించవచ్చు. పురుషుల కంటే ఎక్కువ మంది మహిళలు స్వయం ఉపాధి పొందుతున్నారు, కానీ గ్రామీణ మహిళల్లో 42.7 శాతం మంది గృహ సంస్థలలో సహాయకులుగా ఉన్నారు, పురుషులలో కేవలం 11 శాతం మంది మాత్రమే ఉన్నారు. ఈ పరిస్థితుల్లో మహిళల వికాసం జరుగుతున్నదని అనుకోవడం అత్యాశే.

## ఉప్పు తగ్గించుకుంటే మేలు..

ఇటీవల కాలంలో ఎక్కువ వినిపిస్తున్న పేరు 'ఓస్టియోపోరోసిస్'. దీనిని తెలుగులో బోలు ఎముకల వ్యాధి అంటారు. మహిళల్లో ఈ సమస్య ఎక్కువ. దీని నివారణ కోసం ఆహార పరిమితులు అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. ప్రత్యేకించి ఉప్పును సాధ్యమైనంత వరకూ తగ్గించాలి. ఉప్పు అధికంగా ఉంటే ఆహారాన్ని భుజిస్తే, అది, ఎముకల నుండి కాల్షియంను బయటికి పంపే ప్రమాదం ఉంటుంది. అందుకే ఎక్కువ ఉప్పు లేదా ప్రాసెస్ చేసిన ఆహారాలు తినకూడదు. అదే విధంగా, చిప్స్, బ్రెడ్, ప్యాకెట్ ఫుడ్స్, ప్యాకెటెడ్ ఫుడ్స్ వంటి ప్రాసెస్డ్ ఆహార పదార్థాల్లో అధిక ఉప్పు, సాచ్యురేటెడ్ ఫ్యాట్స్, కన్సర్వేటివ్స్ ఉంటాయి. ఇవి ఎముకల ఆరోగ్యానికి హానికారకం కావచ్చు. టీ లేదా కాఫీ ఎక్కువగా తాగితే కాల్షియం శోషణ తగ్గుతుంది, అందుకే కెఫిన్ పరిమితంగా తీసుకోవడం మంచిది. ఆల్కహాల్ అధికంగా తీసుకోవడం వల్ల ఎముకలు పటిష్టతను కోల్పోతాయి. సాధ్యమైనంత వరకూ ఆల్కహాల్‌కు దూరంగా ఉండాలి. ప్రోటీన్స్‌ను అతిగా వాడకూడదు. మొత్తానికి, ఎముకల ఆరోగ్యానికి తగినంత కాల్షియం, విటమిన్ 'డి', ప్రోటీన్, పంచదార, ఉప్పు తక్కువగా ఉండే ఆహారం, పండ్లు, కూరగాయలు, సోయా, చేపలు, పాల ఉత్పత్తులు ఎంతో ఉపయోగకరం. వీటిని వ్యాయామంతో కలిపి జీవన విధానాన్ని మార్చుకుంటే ఓస్టియోపోరోసిస్ ప్రమాదాన్ని తగ్గించవచ్చు.



(ఇది వివిధ మాధ్యమాల నుంచి సేకరించిన సమాచారం మాత్రమే. పాఠకుల అవగాహనకు ఇది ఉపయోగపడవచ్చు. కానీ వైద్యుల సూచనలు, సలహాలు తీసుకోవడం తప్పనిసరి).

# రాజకీయ జోక్యాలతో సింగరేణి భవిష్యత్తు ప్రమాదకరం

### ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి



**ప్రజాపక్షం/శ్రీరాంపూర్ :** మితిమీరిన రాజకీయ జోక్యాలతో సింగరేణి భవిష్యత్తు ప్రమాదంలో ఉందని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. సోమవారం శ్రీరాంపూర్‌లోని ఎస్ఆర్‌పి 3గనిలో ఏర్పాటు చేసిన ద్వార సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గత రాష్ట్ర ప్రభుత్వం వల్ల సింగరేణిలో రాజకీయ జోక్యం పెరిగిందని, ఇప్పుడున్న ప్రభుత్వం కూడా రాజకీయ జోక్యాన్ని కొనసాగుతుందన్నారు. దీని వల్ల సింగరేణి సంస్థ యొక్క విధులన్నీ దుర్వినియోగం అవుతున్నాయని ఆరోపించారు. గత రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ జోక్యం వల్ల సింగరేణికి రూ.27 వేల కోట్ల బకాయిలు పడిందని, ఇప్పుడున్న రాష్ట్ర ప్రభుత్వం అవి చెల్లించకపోగా అదనంగా మరో రూ. 15 వేల కోట్లు బకాయిలు చేసిందని, రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి సంస్థకి దాదాపు రూ.42 వేల కోట్ల బకాయిలు ఉందన్నారు. వీరి విధానాల వలన సింగరేణి సంస్థకు తీవ్ర నష్టమన్నారు. సింగరేణిలో గుర్తింపు సంఘంగా గెలిచిన ఎఐటియూసి సమస్యల పరిష్కారంలో వైఫల్యం చెందుతుందని ఆరోపిస్తున్న ఐఎన్‌టియుసి నాయకులు మా ప్రభుత్వమే అని చెప్పుకొని తిరుగుతున్నాయని, నిజంగా వారికి కార్మికులపై, సంస్థపై చిత్తశుద్ధి ఉంటే బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం చెల్లించేలా ఎందుకు ప్రయత్నాలు చేయడం లేదని ప్రశ్నించారు? గత 5 సంవత్సరాలుగా సింగరేణిలో జరగని స్ట్రక్చర్ సమావేశాలను ఎఐటియూసి అవినీతికి తావు లేకుండా కార్మికులకు సర్ఫేస్ జనరల్ మజ్దూర్ పోస్టులను ఇప్పించడం జరిగిందని పేర్కొన్నారు. కార్మికు సమస్యల పరిష్కారం కోసం రెండు సార్లు స్ట్రక్చర్ సమావేశాలు జరిగాయని, అందులో కొన్ని సమస్యలను పరిష్కరించేందుకు యాజమాన్యం అంగీకరించిందని వాటికి సంబంధించిన సర్క్యులర్లు కూడా జారీ చేయడం జరిగిందన్నారు.

ఈ ఆర్థిక సంవత్సరం సింగరేణి వచ్చిన లాభాలను వెంటనే ప్రకటించి లాభాలలో 35 శాతం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి ప్రధాన కార్యదర్శి ముస్కే సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీసైదా, సహాయ కార్యదర్శి మోక్కూరి కొమురయ్య, జిఎం చర్చల కమిటి ప్రతినిధులు పరసాద్ రెడ్డి, సంపత్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, ట్రేడ్స్మెంట్స్ ఇంచార్జ్ సురేష్, ఫిట్ కార్యదర్శులు మురళీ చౌదరి, లచ్చన్న, లక్ష్మణ్, సోషల్ మీడియా ఇంచార్జ్ జాడి రాజ్‌కుమార్, మల్లేష్, నగేష్, సాయిబాబా, విక్కి, సురేష్, ప్రనిల్, సారయ్య పాల్గొన్నారు.

## 'మధ్యాహ్న భోజనం' ప్రైవేట్ పరం చేసే కుట్ర విరమించుకోవాలి

### వంట కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : జంపాల రవీందర్



**ప్రజాపక్షం/మంగపేట :** ఏటూరునాగారం, మంగపేట మండలాలు వంట కార్మికుల సంయుక్త సమావేశము పోరెడ్డి ప్రమీల, గడ్డం భారతి అధ్యక్షతన ఏటూరునాగారం బాలుర వసతి గృహం ఆవరణలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ హాజరై మాట్లాడుతూ పాఠశాలలలో గత 23 సంవత్సరాలుగా వంట బిల్లులు, కోడిగుడ్ల బిల్లులు, వేతనాలు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్నా విద్యార్థులకు నాణ్యమైన భోజనాలు అందిస్తున్న వంట కార్మికులను ఈ మధ్యలో ఎవ్వరికి కోపం వచ్చినా తొలగించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కనుక వంట కార్మికుల బతుకులు తెలిసిన స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర మంత్రి సీతక్క ఎవ్వరినీ తొలగించకుండా కృషి చేయాలని కోరారు. అలాగే ఎన్నికల్లో హామీ ఇచ్చిన ప్రకారం రూ.10 వేల వేతనం వెంటనే అందించే విధంగా కృషి చేయవలసినదిగా కోరారు. ఇంకా 9 నెలల అల్పాహారం బిల్లులు, అయిదు నెలల కోడిగుడ్ల బిల్లులు, వంట బిల్లులు వెంటనే ఇప్పించాలని కోరారు. అలాగే గ్యాస్ సిలిండర్లు కోడిగుడ్లతో సహ సరుకులు మొత్తం ప్రభుత్వమే సరఫరా చేయాలని లేదా మెనూ చార్జీలు ప్రతీ విద్యార్థికి రూ.25 చెల్లించాలన్నారు. అలాగే మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైయివేట్ పరం చేసే కుట్రపూరిత ఆలోచన విధానాలను విరమించుకోవాలన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్నవారు తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు పోరెడ్డి ప్రమీల, సహాయ కార్యదర్శి గడ్డం భారతి, పుష్ప, లక్ష్మి, జానకి, భానావతి, సమ్మక్క, తదితరులు పాల్గొన్నారు.

## హాస్పిటల్ సిబ్బంది సమస్యలు వెంటనే పరిష్కరించాలి

### భోగె ఉపేందర్

**ప్రజాపక్షం/ కాగజ్‌నగర్ :** కాగజ్‌నగర్ పట్టణంలోని హాస్పిటళ్లలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్, కాంట్రాక్టు సిబ్బంది పలు సమస్యలతో తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఈ సమస్యని వెంటనే పరిష్కరించాలని ఎఐటియూసి జిల్లా ప్రధాన కార్యదర్శి భోగె ఉపేందర్ మంగళవారం కాగజ్‌నగర్ ఏరియా హాస్పిటల్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని టివివిపి పరిధిలో పనిచేస్తున్న కాగజ్‌నగర్, సిర్పూర్ (టి), బెజ్జూర్, తిర్యాణి, వాంకిడి హాస్పిటళ్లలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు సిబ్బందికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లింపు, ఇపిఎఫ్, ఇఎస్ఐ సమస్యల పరిష్కారం కోసం ఇప్పటికే పలుమార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినప్పటికి స్పందన లేదని విమర్శించారు. హాస్పిటల్ జూనియర్ అసిస్టెంట్ కార్తీక్‌కు నిరవధిక సమ్మె నోటీసు అందజేసినట్లు తెలిపారు. సెప్టెంబర్ 1వ తేది లేదా ఆ తర్వాత ఎప్పటినుంచైనా సమ్మె ప్రారంభమవుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు టి. దివాకర్, ఉపాధ్యాక్షులు ఆత్మకూరి చిరంజీవి, కార్మికులు తుకారాం, తిరుపతి, మారుతి, దేవిరావు, పరమేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.




## ప్రభుత్వ హాస్పిటల్‌లో టెండర్లు పిలవాలి

### కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి
### పిఎఫ్ డబ్బులు జమ చేయకపోతే ఆందోళన చేపడుతాం :పల్లా దేవేందర్ రెడ్డి



**ప్రజా పక్షం/నల్లగొండ :** ప్రభుత్వ హాస్పిటల్ లో పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ గార్డ్స్, పేషంట్ కేర్ కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని ఎఐటియుసి తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం నల్లగొండ లో జరిగిన మెడికల్ కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎఐటయుసి అనుబంధం) జనరల్ బాడీ సమావేశానికి పల్లా దేవేందర్ రెడ్డి ము ఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ నల్లగొండ జిల్లా హాస్పిటల్‌లో ప్రస్తుతం ఉన్న శానిటేషన్ టెండర్ కాలపరిమితి త్వరలో ముగిస్తుండడం తో వెంటనే కొత్త టెండర్లను పిలిచి కనీస వేత నం ప్రతి కార్మికునికి రూ.26వేలు వచ్చే విధం గా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆ యన డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా కేం ద్ర హాస్పిటల్‌లో గత కొన్ని నెలలుగా కార్మికు ల ఖాతాలో పిఎఫ్ డబ్బులు జమకావటం లేదని తక్షణమే జమ చేయాలని ఆయన కోరారు. కార్మికుల ఖాతాలో పిఎఫ్ డబ్బులు జమ చేయకపోతే ఎఐటియుసి ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని పేర్కొన్నారు. సమాజంలో పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలు పెరగకపోవడంతో చాలి చాలని వేతనాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదు సంవత్సరాలకొకసారి మార్చాల్సిన కనీస వేత న చట్టాలు 10 సంవత్సరాలు పైగా తెలంగాణ రాష్ట్రంలో మార్చకపోవడం వల్ల కార్మికులు కనీస వేతనాలకు నోచుకోవడం లేదని అన్నా రు. బెడ్ల సంఖ్య పెరగడం వలన కార్మికులపై అధిక భారం పడుతుందని ఆరోపించారు. పెండింగ్‌లో ఉన్న పిఎఫ్ బకాయిలను వెంట నే చెల్లించాలని, పండుగ జాతీయ సెలవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో యూనియన్ నాయకులు ఏం యాదగిరి, టి పద్మ,పి ఎల్లమ్మ,ఏ పద్మ, ఆర్‌భాగ్యమ్మ,యాదమ్మ, డి.జయమ్మ, సీత ఇంద్ర మ్మ, పి.జీవిత,టీ.సునీత, అరుణ తదితరులు పాల్గొన్నారు.

## ఎంజెఆర్ బిఇడి కళాశాలపై చర్యలు

### ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి :ముదిగొండ మురళీకృష్ణ

**ప్రజాపక్షం/మర్రిగూడ :** యూనివర్సిటీ నిబంధనలు తుంగలో తొక్కి బిఈడి కళాశాలలు రకరకాల ఫీజుల పేరుతో విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేసి, డిసర్టేషషన్,డెవలప్మెంట్,ల్యాబ్,లైబ్రరీ అని అధిక ఫీజులను ముక్కు పిండి వసూలు చేస్తున్నారని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ ఆరోపించారు. మర్రిగూడ మండల కేంద్రంలోని ఎంజెఆర్ ప్రైవేటు బిఈడి కళాశాల యాజమాన్యం విద్యార్థుల దగ్గర్నుంచి అధిక పీసులు వసూలు చేస్తున్నారని యూనివర్సిటీ అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ అధిక ఫీజులు వసూలు చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, యాజమాన్యం వెంటనే విద్యార్థులకు ఫీజులు తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు.కళాశాలలో అర్హత కలిగిన లెక్చరర్స్ సరిపడ లేరని,దీనివలన విద్యార్థులకు చదువు సరిగా అందడం లేదని అన్నారు.కళాశాల యాజమాన్యం కౌన్సిలింగ్ సీటు వచ్చిన విద్యార్థుల దగ్గర కూడా అధిక పీసులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. కళాశాల యాజమాన్యంపై యూనివర్సిటీ అధికారులు చర్యలు తీసుకోకపోతే తమ సంఘం ఆధ్వర్యంలో ప్రైవేటు బిఇడి కళాశాలల ఎదుట ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.



# స్థానికం REGIONAL NEWS

కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## యూరియా కోసం క్యూలైన్‌లో రైతుల చెప్పులు

టోకెన్ల ద్వారా యూరియా పంపిణీ



**ప్రజాపక్షం/ఇల్లందకుంట:** ఇల్లందకుంట యూరియా కోసం రైతులు అవస్థలు పడుతున్నారు. ఇల్లందకుంట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి 450 బస్తాలు వచ్చాయి. 18 గ్రామాల నుంచి ఉదయం 4 గంటల నుంచి దాదాపు 600 మంది రైతులు చెప్పులను క్యూలైన్‌లో పెట్టారు. రైతుల మధ్య గొడవలు తలెత్తకుండా ఇల్లందకుంట ఎస్ఐ క్రాంతికుమార్ ఆధ్వర్యంలో రైతులకు టోకెన్లు పంపిణీ చేసి ఒక రైతుకు ఒక యూరియా బస్తా అందించి సామరస్యంగా పంపిణీ చేశారు. రైతులకు యూరియా కొరత లేదని, సరిపడా స్టాక్ ఎప్పటికప్పుడు వస్తుందని తెలిపారు. మండలంలోని రైతులు సోదరులు అవసరాన్ని మించి యూరియాను పంట పొలాలకు అధిక మోతాదులో వేయకూడదన్నారు.

## ఎమ్మెల్యే సత్యనారాయణను పరామర్శించిన కేంద్ర మంత్రి



**ప్రజాపక్షం/కరీంనగర్:** మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సోదరుడు కవ్వంపల్లి రాజేశం ఇటీవల మృతిచెందగా కేంద్ర మంత్రి బండి సంజయ్ మంగళవారం ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి ఆయనను పరామర్శించారు. మంత్రి వెంట ఎమ్మెల్సీ అంజిరెడి, బీజేపీ పార్టీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి ఉన్నారు.

## మద్దతుదారుల సమావేశంలో ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్



**ప్రజాపక్షం / సారంగాపూర్ :** జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండల కేంద్రంలో కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం మద్దతుదారులతో ముఖ్య సమావేశంలో జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ పాల్గొని స్థానిక సంస్థల ఎన్నికలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి పని చేసి జగిత్యాల నియోజకవర్గ అభివృధ్ధికి కృషి చేస్తానని అన్నారు. స్థానిక సంస్థలలో పార్టీని గెలిపించాల్సిన బాధ్యత అందరిపైన ఉందని అన్నారు. అధికార పార్టీకి మద్దతుగా ఉన్నపుడే అభివృద్ధి సాధ్యమని అన్నారు. రోళ్ల వాగు పూర్తి కోసం తనవంతుగా కృషి చేస్తున్నానని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలనే అత్యధికంగా జగిత్యాల నియోజకవర్గానికి 14పల్లె దవాఖానాలు మంజూరు, జగిత్యాలకు 203కోట్లతో నూతన ఆసుపత్రి మంజూరు చేయడం జరి గిందన్నారు. 2కోట్ల ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు మంజూరు కావడం జ రిగిందన్నారు. జగిత్యాల జిల్లా నియోజకవర్గానికి అత్యధికంగా ఈజిఎస్ నిధులు మంజూరు అయినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కెడిసిసి జిల్లా మెంబర్ ముప్పాళ్ల రామచందర్ రావు, ప్యాక్స్ చైర్మన్‌లు నరసింహ రెడ్డి, మల్లారెడ్డి, నాయకులు రాజేందర్ రెడ్డి, మనోహర్ రెడ్డి, సురేందర్, సుధాకర్ రావు, శేఖర్ గౌడ్, ఢిల్లీ రామారావు, లావణ్య గంగాధర్, శ్రీనివాస్ రావు, మండల గ్రామాల ముఖ్యనాయకులు,కార్యకర్తలు, యూత్ నాయకులు పాల్గొన్నారు.

## వివిధ అభివృద్ధి పనుల పర్యవేక్షణ

**ప్రజాపక్షం/జగిత్యాల:** ప్రభుత్వ ఆదేశాల మేరకు గిరిజన గ్రామాలలో వివిధ అభివృద్ధి పనుల కొరకు అంచనాలను తయారు చేయడానికి జగిత్యాల జిల్లా రాయికల్ మండలం జగన్నాథ్‌పూర్, నాయకపు గూడెం గ్రామాలో అభివృద్ధి పనుల కొరకు జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని గిరిజన గ్రామాలు తండాలలో అవసరమైన సీసీ రోడ్లు, బీటి రోడ్లు, డ్రైనేజీలు పాఠశాల భవనాలు, అంగన్‌వాడీ సెంటర్లు, గ్రామపంచాయితీ కార్యాలయాలు, కమ్యూనిటీ హాల్, వాటర్ ట్యాంకులు వంటి సౌకర్యాలను గుర్తించి అవసరమైన అంచనాలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గిరిజన అభివృద్ధి శాఖ అధికారి రాజ్‌కుమార్, డిపివో మదన్, పీఆర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లక్ష్మణ్‌రావు, ఎంపీడీవోలు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## భూమికి హద్దులు చూపాలి

సిపిఐ మండల కార్యదర్శి వేల్పుల శ్రీనివాస్



**ప్రజాపక్షం/కొహెడ:** నాటి దివంగత ఎమ్మేల్యే దేశిని చిన్న మల్లయ్య ఆధ్వర్యంలో పంపిణీ చేసిన భూమికి రెవెన్యూ అధికారులు హద్దులు చూపాకపోవడంతో నిరుపేదలు అనేక అవస్థలు పడుతున్నారని సిపిఐ ఆధ్వర్యంలో మోకపై గుడిసెలు వేసి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి వేల్పుల శ్రీనివాస్ మాట్లాడుతూ ఇండ్ల పట్టాలు ఇచ్చిన హద్దులు చూపకపోవడంతో అధికారుల నిర్లక్ష్యం వహిస్తున్నారని పలుమార్లు రెవెన్యూ అధికారులకు మొరపెట్టుకున్న తహసీల్దార్ స్పందిస్తున్నారు.రెవెన్యూ సర్వేర్ మాత్రం కనికరించకపోగా మోకపై రాకుండా హద్దులు ఏర్పాటు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.తహసీల్దార్ చెప్పిన మాటను రెవెన్యూ సర్వేర్ వినకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. అధికారులు చేస్తున్న నిర్లక్ష్యానికి నిరసనగా మంగళవారం ప్రభుత్వం ఇచ్చిన స్థలాలలో గుడిసెలు వేసి నిరసన తెలిపారు..ఈ కార్యక్రమంలో కొహెడ మండల సిపిఐ సీనియర్ నాయకులు భోనగిరి శంకర్, జాగిరి బాలయ్య, గర్రెపల్లి రవీందర్, రామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## జగదేవ్‌పూర్‌లో ఇద్దరు ఆత్మహత్య

పురుగుల మందు తాగి వృద్ధుడు, ఉరి వేసుకోని వృద్ధురాలు

**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** మండల కేంద్రమైన జగదేవ్‌పూర్‌లో వేర్వేరు కారణాలతో ఓ వృద్ధుడు, ఓ వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనలు మంగళవారం చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి పోలీసు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పీర్లపల్లి గ్రామానికి చెందిన మాదబోయిన మల్లయ్య(80)అనే వృద్ధుడు జగదేవ్‌పూర్‌లోనే తిరుగుతూ సాయంత్రం తన స్వగ్రామానికి వెల్లేవాడు సోమవారం సాయంత్రం ఇంటికి వెల్లలేదు. మంగళవారం ఉదయం జగదేవ్‌పూర్‌లో కూరగాయాల మార్కెట్‌లో విగత జీవిగా పడి ఉన్నాడు. ఇది చూసిన గ్రామస్థులు స్థానిక పోలీసులకు సమాచారం అందించగా వారు సంఘటన స్థలంలో పరిశీలించగా అతడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లుగా ధృవికరించి పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా ఆ వృద్ధునికి వివాహం కాకపోవడంతో తన సోదరుని కుమారుల వద్ద ఉంటున్నట్లు ఎస్ఐ తెలిపారు. అలాగే జగదేవ్‌పూర్ గ్రామానికి చెందిన ఎర్ర రామవ్వ (60)భర్త, ఇద్దరు కూతుర్లు గత నాలుగు సంవత్సరాల క్రితం ఆనారోగ్యంతో మృతి చెందారు. అప్పటి నుండి రామవ్వ ఒంటరిగానే ఉంటుంది. అయితే ఆమే గత కొంత కాలం నుండి అనారోగ్యంతో భాదపడుతుండేది. దింతో మానసిక వేదనకు గురైన ఆమే సోమవారం సాయత్రం తన ఇంట్లోనే దులానికి ఉరి వేసుకోని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. బాధితుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని విచారణ నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# సేవా దృక్పథంతో వైద్య సేవలు

కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి



**ప్రజాపక్షం/కరీంనగర్:** ప్రభుత్వ ప్రైవేట్ వైద్యులు ఎవరైనా సేవా దృక్పథంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో మంగళవారం ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వాహకులకు క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్, పిఎన్‌డిటి చట్టంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ ప్రైవేట్ ఆసుపత్రులు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలన్నారు. అగ్ని ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. అత్యవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. అత్యవసర మార్గాలు, లిఫ్టులు ఉన్న చోట అదనపు మెట్ల మార్గాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. పది మంది కంటే ఎక్కువ ఉద్యోగులు ఉంటే ఐసిసి కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రైవేట్ అంబులెన్సులను వారి ఆసుపత్రుల్లోనే నిలుపుకోవాలని, ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద నిలిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మున్సిపల్ శాఖకు చెల్లించాల్సిన ఆస్తి పన్నులను విధిగా చెల్లించాలన్నారు. సిజేరియన్ కాన్పులలో కరీంనగర్ ముందుండడం బాధాకరమైన విషయమని అన్నారు. అనవసరంగా సిజేరియన్లు చేయకూడదని, సాధ్యమైనంత వరకు నార్మల్ డెలివరీలకు ప్రయత్నించాలని సూచించారు. లింగనిర్ధారణ, భ్రూణ హత్యలు వంటివి వెలుగు చూసే కఠినమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సాధారణ డెలివరీలలో ప్రభుత్వ ఆసుపత్రులు ముందు వరుసలో ఉన్నాయని తెలిపారు. గత ఏడాదిన్నర కాలంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో 12 శాతం డెలివరీలు పెరిగాయని తెలిపారు. ప్రతినెలా ఆన్‌లైన్‌లో సమర్పించాల్సిన ఓపి, ఐపి తదితర నివేదికలను 5వ తేదీ లోపు సమర్పించాలన్నారు. అన్ని ప్రైవేట్ ఆస్పత్రిల్లోనూ ఆరోగ్య మహిళ ఉచిత వైద్య సేవలు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా లభించే మందుల వివరాలు డిస్‌ప్లే చేయాలని ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ సనా, ఐఎంఏ జిల్లా అధ్యక్షులు డాక్టర్ నరేష్, ప్రైవేట్‌ఆస్పత్రులనిర్వాహకులు,వైద్యులుపాల్గొన్నారు.

## సురవరంకు ఎఐఎస్ఎఫ్ ఘన నివాళి



**ప్రజాపక్షం/రామడుగు:** సిపిఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి మరణం వామపక్ష ప్రజాస్వామ్య ఉద్యమాలకు తీరని లోటు అని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్ అన్నారు. మంగళవారం రామడుగు మండలం గుండి కేంద్రంలో ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సురవరం సుధాకర్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్ మాట్లాడుతూ నల్లగొండ జిల్లాను ఫ్లోరైడ్ రహిత ప్రాంతంగా కృషి చేసి ఉత్తమ పార్లమెంటేరియన్‌గా పేరు తెచ్చుకుని అనేక కమిటీలలో బాధ్యతలు నిర్వహించిన గొప్ప మేధావి అని కొనియాడారు. తొలి నాళ్ల నుంచి చివరి వరకు కమ్యూనిస్టు పార్టీతోనే ఉంటూ నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి పనిచేశారని చెప్పారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసి కృషి చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ఎర్రజెండా పట్ల తనకున్న నిబద్ధత క్రమశిక్షణ ధైర్యశాలి పోరాటాలు మార్గదర్శకంగా స్ఫూర్తినిస్తాయన్నారు. సురవరం ఆశయాల సాధన కోసం పయనిస్తూ ముం దుకు సాగాలని, ప్రజా సమస్యలపై నిరంతర పోరాటాలు నిర్వహించడమే ఆయనకు ఘన నివాళులులని తెలిపారు. ఎఐఎస్ఎఫ్ నాయకులు మచ్చ ర మేష్, మహేష్, మహిపాల్, క్రాంతి, కళ్యాణ్, మహబూబ్, ప్రశాంత్ తదితరులున్నారు.

## మేము కాలబెట్టడం మొదలు పెడితే మీరు తట్టుకోలేరు

బండి సంజయ్ ఆరోపణలన్నీ తొండి ఆరోపణలే

'సుడా' చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి ఫైర్



**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా పక్కదారి పట్టిస్తున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చేస్తున్న ఆరోపణలన్నీ తొండి ఆరోపణలేనని సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. కరీంనగర్‌లోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 42 శాతం రిజర్వేషన్‌లో మై నార్టీలకు పది శాతం అని తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఓట్ చోరీ జరుగుతుందంటే ఓటు వేసిన అందరినీ అవమానపరిచినట్టేనని తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. దేవుళ్లపై వ్యా ఖ్యలు చేయకున్నా చేసినట్లు చెబుతున్నారని పేర్కొన్నారు. పక్కదారి పట్టించడం బండిసంజయ్ కుమార్‌కు వెన్నతో పెట్టిన విద్య అని నరేందర్‌రెడ్డి ఆరోపించారు. ఒక బిసి నాయకుడు 45 సంవత్సరాలుగా ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొని నిబద్దతో కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తూ రాష్ట్ర అధ్యక్షుడైన మహేష్‌కుమార్ గౌడ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని, కాంగ్రెస్ పార్టీని బిచ్చగాళ్ల పార్టీ అని మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దిష్టిబొమ్మలు, ఫ్లెక్సీలు కాలబెట్టడం మేము మొదలు పెడితే మీరు తట్టుకోలేరని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఇప్పటికైనా బండి సంజయ్ కుమార్ 42 శాతం రిజర్వేషన్, ఓటు చోరీ వంటి అంశాలపై ప్రజలకు తమ వైఖరి ఏమిటో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎండి తాజ్, జీడి రమేష్, పెద్దిగారి తిరుపతి, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, అస్థాపురం రమేష్, శభాన మహమ్మద్, ఊరడి లత, యనమల మంజుల, కిరణ్ రెడ్డి, మాసుంఖాన్, తోట అంజయ్య, కొట్టె ప్రభాకర్, మామిడి సత్యనారాయణ రెడ్డి, ఇమ్రాన్, హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## 'విదేశీ ఉపాధి'కు భరోసాగా టామ్ కామ్


పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** విదేశీ ఉపాధి కు భరోసా గా టామ్ కామ్ పని చేస్తుందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో టామ్ కామ్ కోర్సులపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ టామ్ కామ్ సంస్థ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగిందని, దీని ద్వారా విదేశాలలో సరైన ఉపాధి అవకాశాలు మన యువతకు అందించడం జరుగుతుందని అన్నారు. టామ్ కామ్ సంస్థ విదేశీ నియామక దారులతో అనుసంధానం చేసి అవసరమైన డాక్యుమెంటేషన్, ప్లేస్మెంట్ శిక్షణ వంటి సదుపాయాలు కల్పిస్తుందని అన్నారు. టామ్ కామ్ సంస్థ ద్వారా అందే ఉపాధి అవకాశాలు, వాటికి కావాల్సిన నైపుణ్యం, విద్యార్హతలు, అందే ఆదాయం, అక్కడ వసతి ఇతర వివరాలు సంపూర్ణంగా విద్యార్థులు తెలుసుకోవాలని, తమకు ఉన్న ప్రతి సందేహాన్ని ట్రైనర్ల నుంచి నివృత్తి చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. జపాన్‌లో ప్రస్తుతం నర్సింగ్ కేర్ (14–16 లక్షలు వార్షిక ప్యాకేజ్), జర్మనీ లో ఎలక్ట్రీషియన్ ( 32.76– 34.80 లక్షలు వార్షిక ప్యాకేజ్), ఫిజీ – ఫిట్టర్ / ఎలక్ట్రీషియన్ / సర్వీస్ టెక్నీషియన్ ( 6–10 లక్షలు వార్షిక ప్యాకేజ్)గ్రీస్ – హౌస్‌కీపింగ్ / వెయిటర్ / ఎలక్ట్రీషియన్ / మేసన్ (12 లక్షలు వార్షిక ప్యాకేజ్), ఇతర అవకాశాలు పోర్చుగల్, యుఎఇ దేశాల్లో అందుబాటులో ఉన్నాయని అన్నారు. విదేశీ ఉద్యోగ అవకాశాలను అంది పుచ్చుకునేందుకు ఆసక్తి గల యువతీ యువకులు తమ రెస్యూమ్ ను టామ్ కామ్ సంస్థ కు పంపి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కలెక్టర్ కోరారు. విదేశాలలో ఉపాధి పొందేందుకు ఆసక్తిగల పెద్దపెల్లి జిల్లా నిరుద్యోగ యువతీ యువకులకు డాక్యుమెంటేషన్, ప్లేస్మెంట్, శిక్షణ కోసం అవసరమయ్యే ఖర్చులో 20 శాతం వరకు పెద్దపల్లి జిల్లా యంత్రాంగం నుంచి సబ్సిడీగా అందిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. టామ్ కామ్ సంస్థ అందించే వివిధ కోర్సులు ఉపాధి అవకాశాలపై యువత సంపూర్ణ అవగాహన పెంచుకొని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం పెద్దపెల్లి జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు టామ్ కామ్ సంస్థ అందించే విదేశీ ఉద్యోగ అవకాశాలు తదితర అంశాల పై ట్రైయినర్లు సంపూర్ణ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టామ్‌కామ్ మేనేజర్ ఎస్. షబ్నా, జిల్లా ఉపాధి అధికారి తిరుపతి రావు, జిల్లా పరిశ్రమల అధికారి ఏ.కీర్తి కాంత్ సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తల్లో జోష్ నింపిన 'జనహిత'

అగ్రనేతల రాకతో ఉత్సాహంలో కార్యకర్తలు



**ప్రజాపక్షం/కరీంనగర్:** ఎఐసిసి రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో చేపట్టిన 'జనహిత' పాదయాత్ర కాంగ్రెస్ కార్యకర్తల్లో జోష్ నింపింది. ఈ నెల 24,25 తేదీల్లో జిల్లాలోని చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాకు చెందిన పార్టీ శ్రేణులు అధిక సం ఖ్యలో హాజరయ్యారు. మొదటి రోజు చేపట్టిన పాదయాత్రలో కార్యకర్తలు వేల సంఖ్యలో పాల్గొన్నారు. అదే రోజు రాత్రి గంగాధర ఎక్స్ రోడ్‌లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో పిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పీచ్‌తో కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపారు. బిజెపి, బిఆర్ఎస్ టార్గెట్‌గా తన ప్రసంగాన్ని కొనసాగించారు. రానున్న స్థానిక సంస్థల్లో అధిక సంఖ్యలో సీట్లను కైవసం చేసుకునేందుకు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కష్టపడ్డా ప్రతీ కార్యకర్తకు గుర్తింపు తప్పకుండా లభిస్తుందని హామీనిచ్చారు. రెండవ రోజు జరిగిన పా ర్టీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన మీటింగ్‌లో ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌చార్జిలు మాట్లాడారు. స్థానికంగా పార్టీ పరంగా ఎదుర్కొంటున్న సమస్యలను ఎఐసిసి ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పిసిసి చీఫ్‌ల దృ ష్టికి తీసుకుపోయారు.గత ప్రభుత్వం అనేక మంది కార్యకర్తలపై కేసులు పె ట్టి వేధించిందని వారికి అండగా నిలవాలని కోరారు. హుజురాబాద్ నియోజక వర్గంతో పాటు పార్టీ ఎమ్మెల్యేలు లేని చోట ఇన్‌చార్జిలకు స్టేట్ లెవల్ నామినేటేడ్ పోస్టులు ఇవ్వాలని కోరారు. హుజురాబాద్,కోరుట్ల, సిరిసిల్ల లాంటి నియోజకవర్గాల్లో ప్రోటో కాల్ సమస్యలు తలెత్తుతున్నాయని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లారు. పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలకు ఖచ్చితంగా సముచిత స్థానం లభిస్తుందని, రానున్న స్థానిక ఎన్నికల్లో పార్టీ సత్తా చాటే విధంగా కార్యకర్తలు కృషిచేయాలని పిసిసి చీఫ్ కోరారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను కార్యకర్తలు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. గ్రామ స్థాయిలో సర్కార్ చేపడుతున్న కార్యక్రమాలను చేరవేయడంలో మరింత ఉత్సాహంగా పనిచేయాలని, ప్రజల్లో మమేకమై రానున్న ఎన్నికల్లో అత్యధిక సీట్లు గెలవాలని సూచించారు. కష్టపడ్డ ప్ర తి కార్యకర్తకు న్యాయం జరుగుతుందన్నారు. నామినేటేడ్ పోస్టుల భర్తీలో పాత కాంగ్రెస్ కార్యకర్తలకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కోరగా పార్టీ కో సం కష్టపడ్డ వారిని కడుపుల పెట్టుకుంటుందని మహేశ్ కుమార్ హామీ నిచ్చారు.

## కరీంనగర్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి

కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి రాజేందర్‌రావు



**ప్రజాపక్షం/ కరీంనగర్ సిటీ :** కరీంనగర్‌లోని సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి చేస్తున్నానని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జి వెలిచాల రాజేందర్ రావు పేర్కొన్నారు. కరీంనగర్ అభివృద్ధికి కంకణం కట్టుకున్నానని, అన్ని రంగాల్లో తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నానని తెలిపారు. నేనున్నా మీకోసం కార్యక్రమంలో భాగంగా మంగళవారం అహ్మద్‌పురా, హుస్సేన్ పుర, విజయపురి కాలనీ, సిటిజన్ కాలనీ, రాజీవ్ చౌమాన్ తదితర ప్రాంతాల్లో రాజేందర్ రావు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా కాలనీ వాసులను స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కరీంనగర్‌లో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి చేస్తున్నానని పేర్కొన్నారు. ఇటీవల సిఎం రేవంత్ రెడ్డిని కలిసి కరీంనగర్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరానని తెలిపారు. రాష్ట్రంలోనే కరీంనగర్‌ను అత్యుత్తమ నగరంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చెప్పారని, అందుకోసం నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. దశలవారీగా సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే కరీంనగర్‌ను ఆదర్శనగరంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఆల్ఫోర్స్ ఇ- టెక్నోలో ఘనంగా వినాయక వ్రతోత్సవం




**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** కరీంనగర్‌లోని కొత్తపల్లిలో గల ఆల్ఫోర్స్ ఇ టెక్నో పాఠశాలలో పండుగ వాతావరణాన్ని తలపించే విధంగా ఏర్పాటు చేసిన శ్రీ వినాయక ఉత్సవ కార్యక్రమం వేడుకగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా అల్ఫోర్స్ విద్యాసంస్థల నిర్వాహకులు డాక్టర్ వి.వనజా నరేందర్ రెడ్డి హాజరై జ్యోతిప్రజ్వలన చేసి అట్టహాసంగా కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. తల్లిదండ్రుల ప్రేమకు ప్రతీక, సోదర భావానికి నిర్వచనమైన విఘ్నేశ్వరుడిని అన్ని వేళల్లో పూజించడం చాలా శ్రేయస్కరమని తెలిపారు. శుభఫలాలు ఇస్తాయని అభిప్రాయపడ్డారు. విఘ్నేశ్వరుడు ముల్లోకాలకు అధిపతి అని, ఏ పూజ ప్రారంభించినా గణపతి పూజ మొట్టమొదటగా ఆరాధించడం గణపతి యొక్క విశిష్టతను మనకు తెలియజేస్తున్నదని పేర్కొన్నారు. వినాయకుని జన్మదిన వేడుకలను మన దేశంలోనే కాకుండా విదేశాల్లో సైతం శోభాయమానంగా కుటుంబ సభ్యుల నడుమ నిర్వహించుకోవడం చాలా గొప్ప విషయమని చెప్పారు. తొమ్మిది రోజుల పాటు స్వామివారి ఉత్సవాలు వివిధ రకాల పూజలతో స్వామివారిని కొలుస్తూ వివిధ రకాల ద్రవ్యాలతో సైతం స్వామివారిని పూజించడం గొప్ప విషయమని తెలిపారు. ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకుని తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చే విధంగా ముందుకు పయనించి సమాజానికి దిక్సూచిగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులున్నారు.

## పాపన్న గౌడ్ విగ్రహ ఆవిష్కరణ



**ప్రజాపక్షం / కోనరావుపేట :** రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలంలోని నిమ్మపల్లి కోనరావుపేట జంక్షన్ వద్ద గౌడ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని మంగళవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మండల గౌడ సంఘం నాయకులలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహానీయుల విగ్రహాలను ఏర్పాటు చేయడం ద్వారా భావి తరాలకు చరిత్రను తెలియజేస్తాయని మహానీయులు చేసిన పోరాటం త్యాగాలు ఎప్పటికి మర్చిపోకుండా గుర్తుకు వస్తాయని వారి బాటలోనే యువత అడుగులు వేయాలని, వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ బడుగు బలహీన వర్గాల కోసం ఎంతో కృషి చేశారని బహుజనుల ఆకాంక్షను నెరవేర్చడానికి సర్వాయి పాపన్న పోరాటం చేశారని అలాంటి మహానీయుల అడుగు జాడల్లో నేడు ప్రజా ప్రభుత్వం ముందుకు పోతుందని వారి చరిత్రను భవిష్యత్ తరాలకు తెలియజేసేలా సామాజికంగా రాజకీయంగా ఎదగాలని ఆలోచనతో హైదరాబాద్ నడిబొడ్డున వారి విగ్రహానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ భూమి పూజ చేశారని అన్నారు. బిసిలకు 42శాతం రిజర్వేషన్ కల్పించడం లక్ష్యంగా రాష్ట్ర ప్ర భుత్వం ఉందని బిసి రిజర్వేషన్లు అమలు అయితే బిసిలకు ఉద్యోగ విద్య రాజకీయ ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వతాహాగా బిసి కాకుండా బిసిల అభ్యున్నతి కోసం పాటుపడుతున్నారని రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం సంక్షేమం అభివృద్ధి దిశగా ముందుకు పోతుందని అన్నారు. గౌడ సంఘం మండల అధ్యక్షుడు అబ్బసాని శంకర్ గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, జిల్లా అధ్యక్షుడు చిదుగు గోవర్థన్ గౌడ్, పులి లక్ష్మి పతి గౌడ్, సంపునూరి మల్లేశం గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంగలి వెంకన్న గౌడ్, బుర్ర రవితేజ గౌడ్, ఏఎంసి చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, వైస్ చైర్మన్ తాళ్లపల్లి ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఫీరోజ్ పాషా, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి, చేపూరి గంగాధర్, గౌడ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మట్టి విగ్రహాలనే పూజిద్దాం

ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు



**ప్రజాపక్షం/పెద్దపల్లి టౌన్ :** మట్టి విగ్రహాలనే పూజించే, పర్యావరణాన్ని కాపాడుదామని పెద్దపెల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. మంగళవారం రోజున పట్టణంలోని జెండా చౌరస్తా వద్ద పురపాలక సంఘం ఆధ్వర్యంలో మట్టి గణపతుల ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రకృతి పర్యావరణాన్ని కాపాడడానికి ప్రతి ఒక్కరూ కృషి చేస్తూ ప్రతిఒక్కరు మట్టి వినాయకులను పూజించాలని మట్టి వినాయకులను చెరువులో నిమజ్జనం చేసినప్పుడు త్వరగా కరిగిపోతాయని వాటి వల్ల చెరువులో ఉండే అటువంటి జీవరాశులకు ఎలాంటి హాని కలగకుండా ఉంటుందని, స్వచ్ఛంద సంస్థలు కూడా మట్టి వినాయకులను పంపిణీ చేసి వాటి ఆవశ్యకత ప్రజలకు వివరించాలని అన్నారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఇంత చక్కటి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నటువంటి మున్సిపల్ కమిషనర్ కు సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, వ్యవసాయ మార్కెట్ చైర్ పర్సన్ ఈర్ల స్వరూప, మాజీ కౌన్సిలర్లు, మెప్మా ఆర్పీలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## నేరాల నియంత్రణకు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం : సిఐ ప్రేమ్‌కుమార్

**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ :** నేరాల నియంత్రణలో భాగంగానే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు కాగజ్‌నగర్ సిఐ ప్రేమ్‌కుమార్ తెలిపారు. కాగజ్‌నగర్ పట్టణంలోని రిక్షా కాలనీలో మంగళవారం పోలీసుల ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని 36 ద్విచక్ర వాహనాలు, 18 ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల సహకారంతో నేరాలను అదుపుచేయడం సాధ్యమవుతుందని, సైబర్ నేరాలు పెరుగుతున్న తరుణంలో ప్రజలు అప్రమత్తంగా ఉండలని సిఐ అన్నారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని, ప్రతీ ఒక్కరూ సామరస్యంగా ఉండి శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఇద్దరు సిఐలు, ఏడుగురు ఎస్‌ఐలు, యాభై మంది సిబ్బంది పాల్గొన్నారు.

## యూరియా ఇవ్వడానికి షరతులా?

### సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి చిరంజీవి




**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** అన్నదాతలకు యూరియా ఇవ్వడానికి షరతులేంటని అని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆత్మకూరి చిరంజీవి ప్రశ్నించారు. మంగళవారం జిల్లా కేంద్రంలో స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వేసిన పంటలకు పెట్టుబడులు ప్రశ్నార్థకంగా మారుతున్నాయని, రైతులు రోజుల తరబడి యూరియా కోసం సహకార సంఘాల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ప్రభుత్వం కనికరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులను దృష్టిలో పెట్టుకొని యూరియాను అందుబాటులోకి తెచ్చి రైతులకు అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బోయిరే ప్రకాష్, తాళ్లపల్లి దివాకర్ పాల్గొన్నారు.

## విద్యార్థుల హాజరు వందశాతం ఉండేలా చర్యలు తీసుకోవాలి

### అదనపు కలెక్టర్ దీపక్ తివారి



**ప్రజాపక్షం/ సిర్పూర్(టి) :** ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల హాజరు శత శాతం ఉండేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్, ఇంచార్జి జిల్లా విద్యాధికారి దీపక్ తివారి అన్నారు. మంగళవారం సిర్పూర్ (టి) మండలంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పట్టిక, తరగతి గదులు, మధ్యాహ్న భోజనం నాణ్యత, నిత్యవసర సరుకులు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలకు గైర్హాజరు అయ్యే విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి క్రమం తప్పకుండా విద్యార్థులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం సదుపాయాలను కల్పించడంతో పాటు మెనూ ప్రకారం పోషక విలువలు కలిగిన ఆహారం అందిస్తూ విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని తెలిపారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులను నియమించి విద్యార్థులకు అర్థమయ్యే విధంగా పాఠ్యాంశాలను బోధించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఓ సత్యనారాయణ, మండల విద్యాధికారి వేణుగోపాల్ రావు, ప్రధానోపాధ్యాయులు సదాశివ సత్యనారాయణ, ఉపాధ్యాయులు, డాక్టర్ నవత, వైద్య సిబ్బంది ఏపీఓ చంద్రయ్య, ఈసి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి తిరుపతి, ఎఫ్‌ఎలు రాజేవ్వర్, బొందయ్య పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలి : ఎస్‌పి




**ప్రజాపక్షం/నర్సాపూర్ :** మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని మెదక్ జిల్లా ఎస్‌పి డివి శ్రీనివాస్ రావు అన్నారు. మంగళవారం నర్సాపూర్ పట్టణంలోని బివిఆర్ఐటి ఇంజనీరింగ్ కళాశాలలో డ్రగ్స్ పై, సైబర్ క్రైమ్ పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఎస్‌పి డివి శ్రీనివాస రావు మాట్లాడుతూ మత్తు పదార్థాలకు అలవాటు పడి విద్యార్థులు తమ విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. మత్తు పదార్థాలు అమ్ముతున్నారని తెలిస్తే అట్టి వ్యక్తులపై పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకోని తమను చదివిస్తున్నారని వారి ఆశలను నెరవేర్చాలన్నారు. సైబర్ క్రైమ్ పట్ల విద్యార్థులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైనా ఫోన్ ద్వారా లేనిపోని మెసేజ్ లు పంపితే వాటిని నమ్మవద్దని సూచించారు. సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులతో కలిసి మెలసి ఉండాలని ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ మహేందర్, సైబర్ క్రైమ్ డీఎస్పీ శ్రీ సుభాష్ చంద్రబోస్, తూప్రాన్ డిఎస్పి నరేందర్ గౌడ్, సీఐ జాన్‌రెడ్డి, ఎస్సై లింగం, కళాశాల యాజమాన్యం మేనేజర్ బాపిరాజు, ఏవో సురేష్ విద్యార్థులు ఉన్నారు.

## రైతులకు యూరియా సరఫరా చేయలేని కాంగ్రెస్ ప్రభుత్వం

### ఎమ్మెల్యే సునీతారెడ్డి



**ప్రజాపక్షం/నర్సాపూర్ :** యూరియా కోసం రైతులు నర్సాపూర్ మరోసారి రోడెక్కారు. గ్రామాలకు చెందిన రైతులు ఉదయం నుంచి వ్యవసాయ సహకార కేంద్రం వద్ద వేచి చూసి యూరియా రాదని తెలుసుకున్న రైతులు పెద్ద సంఖ్యలో నర్సాపూర్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో గంటపాటు రాస్తారోకో, ధర్నా చేపట్టారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి ధర్నా వద్దకు చేరుకొని రైతులకు మద్దతుగా ధర్నాలు కూర్చున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గద్దె దిగాలని, సిఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేస్తూ అంబేద్కర్ చౌరస్తాలో బైఠాయించారు దీంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయి ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది, ఈ విషయం తెలుసుకున్న తూప్రాన్ డిఎస్‌పి నరేందర్ గౌడ్, సిఐ జాన్ రెడ్డి, ఎస్సై లింగం ,తాసిల్దార్ శ్రీనివాస్, వ్యవసాయ అధికారి దీపికలు, సంఘటన స్థలానికి చేరుకొని సునీతారెడ్డికి రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. యూరియా వచ్చేంతవరకు ఇక్కడ నుండి కదిలేది లేదని ఎమ్మెల్యే సునీతారెడ్డి రైతులు రోడ్డుపై బైఠాయించారు. దీంతో ఎక్కడి వాహనాలు అక్కడి నిలిచిపోయి ట్రాఫిక్ అంతరాయం ఏర్పడడంతో ఎమ్మెల్యే సునీతారెడ్డిని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు యూరియా సరఫరా చేయడంలో విఫలమయిందన్నారు. రైతులు యూరియా కోసం పడిగాపుల పడుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు సత్యం గౌడ్, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

# ప్రశాంతంగా గణేష్ ఉత్సవాల నిర్వహణకు చర్యలు

### కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే







**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ రూరల్ :** జిల్లాలో గణేష్ నవ రాత్రులు, నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంత వాతావరణంలో జరిపేందుకు అన్నివిధాల చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. మంగళవారం జిల్లాలోని కాగజ్‌నగర్ మండలం పెద్దవాగు వద్ద గణేష్ నిమజ్జన స్థలాన్ని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, విద్యుత్ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నిమజ్జన ప్రదేశాల వద్ద భక్తులకు, వినాయక విగ్రహాలను ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధకారులను ఆదేశించారు. కార్యక్రమంలో కాగజ్‌నగర్ తహసీల్దార్ మధుకర్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి కోట ప్రసాద్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

### విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని సాధించే దిశగా అడుగులు వేయాలి

**కాగజ్‌నగర్ :** విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని వాటిని సాధించే దిశగా అడుగులు వేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. మంగళవారం కాగజ్‌నగర్ పట్టణంలోని బోడగుట్ట పైన గల ప్రధానమంత్రి శ్రీ జవహర్ నవోదయ విద్యాలయాన్ని సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లాతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను గౌరవించడం ద్వారా సమాజంలో మంచి పౌరుడిగా ఎదగాలని, నేటి పోటీ ప్రపంచంలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెంట్‌తో పోటీపడాలని, సాంకేతిక రంగం వైపు అడుగులు వేస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం పౌష్టిక ఆహారాన్ని అందించి వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులు, సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో విద్యాలయం ప్రిన్సిపల్, అద్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### పారదర్శకంగా పెన్షన్ల పంపిణీ

**ఆసిఫాబాద్ :** ప్రభుత్వం అందజేస్తున్న ఆసరా పెన్షన్లు పారదర్శకంగా పంపిణీ చేయడం జరుగుతుందని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సకలెక్టర్ చాంబర్‌లో జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి బ్రాంచ్ పోస్టల్ ఆఫీసర్స్ (బిపిఎం)లకు మొబైల్స్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆసరా పెన్షన్ల పంపిణి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం మరింత పారదర్శకంగా చేపట్టేందుకు మొబైల్స్ అందజేస్తోందని తెలిపారు. మొబైల్స్‌లో ప్రత్యేకంగా యాప్ ఉంటుందని, పెన్షన్‌దారులకు సంబంధించిన పూర్తిసమాచారం ఉంటుందన్నారు. ప్రతీనెల పెన్షన్ దారులకు ఐరిస్, వేలిముద్ర ద్వారా పెన్షన్ అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఓ దత్తారావు, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

### పూలాజీ బాబా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించాలి

**జైనూర్ :** జిల్లాలో ఈనెల 30న పూలాజీ బాబా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లో ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి ఖుష్బూగుప్తా, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి తో కలిసి జైనూర్ మండలం పట్నాపూర్‌లోని పూలాజీ బాబా సంస్థాన్‌లో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు, నిర్వహణ కమిటీ సభ్యులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జయంతి వేడుకలను అధికారులు, నిర్వహణ కమిటీ సభ్యులు సమన్వయంతో వ్యవహరించి విజయవంతం చేయాలని ఆదేశించారు. సమావేశంలో జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మెత విశ్వనాథ్, ఇంగ్లే కేశవరావు, విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శేషరావు, జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సీతారాం, మిషన్ భగీరథ ఇఇ సిద్దిక్, ఆసిఫాబాద్ సిఐ వరప్రసాద్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో డిఇకి తీవ్రగాయాలు

### పరామర్శించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/గజ్వేల్ :** నర్మెట్ట వద్ద ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ పనులు పరిశీలించేందుకు వెళ్తున్న డిఇ ప్రశాంత్ కుమార్‌కు గజ్వేల్ మండలం రిమ్మనగూడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆయనను గజ్వేల్ జిల్లా ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందిస్తుండగా, అదే రోడ్డు వెంట వెళ్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు సమాచారం అందింది. ఈ మేరకు ఆయన గజ్వేల్ చేరుకొని ప్రశాంత్ కుమార్‌ను పరామర్శించారు. రోడ్డు ప్రమాదంలో చేయి విరిగిందని ఆసుపత్రి సూపరిండెంట్ అన్నపూర్ణ తెలిపారు. దీంతో మెరుగైన వైద్యసేవల నిమిత్తం ప్రశాంత్‌కుమార్‌ను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హైదరాబాద్‌కు తన సొంత వాహనంలో పంపించారు. గాయాల బారిన పడిన ఆయిల్‌ఫామ్ అధికారులు శ్రీనివాస్, శ్రీకాంత్, మధుసూదన్ రెడ్డి తదితరులకు ప్రాథమిక చికిత్సలు నిర్వహించి గాంధీ ఆసుపత్రికి తరలించినట్లు డిసిసి అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్లు నరేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, విజయ మోహన్, వైస్ చైర్మన్లు సర్దార్ ఖాన్, ప్రభాకర్ గుప్త, నాచగిరి ఆలయ కమిటీ చైర్మన్ రవీందర్ గుప్త, కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డి, నేతలు మొనగారి రాజు, రాములు గౌడ్, రేగొండ గౌడ్, గాడిపల్లి శ్రీనివాస్, శివారెడ్డి, అజ్గర్, గుంటుకు శ్రీనివాస్ తదితరులు మంత్రి తుమ్మల నాగేశ్వర రావు వెంట ఉన్నారు.

## మూతపడిన ప్రభుత్వ పాఠశాలను పునః ప్రారంభించిన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/భైంసా :** భైంసా మండలంలోని బాబుల్ గావ్ గ్రామంలో మూతపడిన ప్రభుత్వ పాఠశాలను ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ మంగళవారం పునః ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన భోజనంతో పాటు ఉచిత పాఠ్య పుస్తకాలు, రెండు జతల యూనిఫామ్ అందించడంతో పాటు విశాలమైన తరగతి గదులు, ఆట స్థలం ఉంటాయన్నారు. తల్లిదండ్రులు ఆలోచించి తమపిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని సూచించారు.



## సంఘటితశక్తితో అభివృద్ధి సాధ్యం

### శిక్షణ కలెక్టర్ సలోని చాబ్రా



**ప్రజాపక్షం/ఆదిలాబాద్ :** సంఘటిత శక్తితోనే అభివృద్ధి సాధ్య పడుతుందని, జర్నలిస్టులు ఐక్యంగా ఉంటూ సంఘం అభివృద్ధితో పాటు సమాజాభివృద్ధికి తోడ్పాటు అందించాలని శిక్షణ కలెక్టర్ సలోని చాబ్రా అన్నారు. మంగళవారం ఎలక్ట్రానిక్ మీడియా ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గ ఎన్నికకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆదిలాబాద్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రెస్ క్లబ్ కార్యవర్గం ఎన్నిక మంగళవారం జరిగింది. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ చేపట్టారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో పాటు ఉపాధ్యక్షులు, కోశాధికారి పదవులకు నామినేషన్లను స్వీకరించగా.. అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా అన్నోజుల శ్రీనివాస్, ఆవునూరి దత్తాత్రి, ఉపాధ్యక్షులుగా కిరణ్, కోశాధికారిగా అవునూరి శ్రీనివాస్‌లు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా ఏ నవీన్‌కుమార్, సహాయ ఎన్నికల అధికారిగా సంజయ్ వ్యవహరించారు. ఈ మేరకు శిక్షణ కలెక్టర్ సలోని చబ్రా మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ మీడియా ప్రజా సమస్యలను వెలుగులోకి తెస్తుందన్నారు. జిల్లా యంత్రాంగం తరపున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. నూతన అధ్యక్షులు అన్నోజుల శ్రీనివాస్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ మీడియా ప్రెస్ క్లబ్ అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామన్నారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, ఎన్నో ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న ఇండ్ల స్థలాల కేటాయింపుకు కృషి చేస్తామని తెలిపారు.

# కేంద్రం నిర్లక్ష్యంతోనే యూరియా సమస్య

### ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య యాదవ్



**ప్రజాపక్షం/గజ్వేల్ :** కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే రాష్ట్రంలో యూరియా సమస్య తలెత్తిందని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య యాదవ్ ఆరోపించారు. కాగా ఆ నెపాన్ని కాంగ్రెస్ ప్రభుత్వంపై నెట్టుతుండడం సిగ్గుచేటన్నారు. బిజెపి రైతులను తప్పుదారి పట్టిస్తుండగా, మోదీ భయంతో బిఆర్ఎస్ నేతలు వారికి వంత పాడుతున్నారని ఎద్దేవా చేశారు. మంగళవారం రిమ్మనగూడ వద్ద డిసిసి అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం ఉస్మానియా యూనివర్సిటీని భ్రష్టు పట్టించగా, చక్కదిద్దే క్రమంలో సిఎం రేవంత్‌రెడ్డి ఓయూలో అడుగుపెట్టి సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. రాష్ట్ర అభివృద్ధిని జీర్ణించుకోలేని బిఆర్ఎస్ నేతలు అడ్డగోలు విమర్శలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే వెంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు వంటేరు నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, విజయమోహన్, వైస్‌చైర్మన్ సర్దార్‌ఖాన్, ప్రభాకర్‌గుప్త, నాచగిరి ఆలయ కమిటీ చైర్మన్ రవీందర్‌గుప్త, నియోజకవర్గ కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ రంగారెడ్డి, సుఖేందర్ రెడ్డి, సందీప్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, కనకయ్య, మొనగారి రాజు, రాములుగౌడ్, గుంటుకు శ్రీనివాస్, రేగొండగౌడ్, రమేష్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, గాడిపల్లి శ్రీనివాస్, అజ్గర్ తదితరులు ఉన్నారు.

## ప్రజా ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి : కలెక్టర్ కుమార్‌దీపక్



**ప్రజాపక్షం/చెన్నూర్ :** ప్రజల ఆరోగ్య రక్షణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. మంగళవారం చెన్నూర్ మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఆసుపత్రిలోని వార్డులు, ల్యాబ్, మందుల నిల్వలు, పరిసరాలను పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ ప్రజలను మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణతో కలిసి పట్టణంలోని అమృత్ 2.0లో భాగంగా చేపట్టిన నీటి ట్యాంక్ నిర్మాణ పనులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనంలో పోషక విలువలు ఉన్న ఆహారం, శుద్ధమైన నీటిని అందించాలని సూచించారు. అనంతరం ఇంటర్మీడియెట్ ఎంపిసి, పదో తరగతి విద్యార్థులకు స్వయంగా పాఠ్యాంశాలు బోధిస్తూ వార్షిక పరీక్షలకు సిద్ధం కావాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, మండల పరిషత్ అభివృద్ధి అదికారి మోహన్ పాల్గొన్నారు.

# స్వచ్ఛ మున్సిపాలిటీగా మెదక్‌ను తీర్చిదిద్దేందుకు కృషి

### మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్







**ప్రజాపక్షం/మెదక్ :** మెదక్ మున్సిపాలిటీని స్వచ్ఛ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మున్సిపాలిటీలో పర్యటించిన కలెక్టర్ జంతు జనన నియంత్రణ కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం మున్సిపాలిటీలో పర్యటించారు. పరిసరాల పరిశుభ్రతలో భాగంగా తడి, పొడి చెత్త వేరుచేసి శానిటేషన్ సిబ్బందికి అందించాలని మెదక్ మున్సిపాలిటీ స్వచ్ఛ మున్సిపాలిటీగా తీర్చిదిద్దాలని వార్డుల వారీగా ప్రజల సమస్యలపై తక్షణమే స్పందించి నివృత్తి చేసే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛమైన తాగునీరు, ప్రజారోగ్యం అంశాలను ప్రధాన ఏజెండాగా చేసుకుని ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సీజనల్ వ్యాధుల నివారణకు నీరు నిల్వ ఉన్న ప్రాంతాలలో ఆయిల్ బాల్స్ చేయాలని ఫాగింగ్ సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలని, సీజనల్ వ్యాధులను నిర్మూలించేందుకు పట్టణ ప్రజలు ప్రజారోగ్య, మున్సిపాలిటీ అధికారులకు సహకరించాలన్నారు. మెదక్ పట్టణంలో వ్యాపారులు ఇష్టమైన రీతిలో చెత్తను ఎక్కడ బడితే అక్కడ పార వేయకుండా చర్యలు చేపడుతూ పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, టౌన్ ప్లానింగ్ అధికారి ఇతర అధికారులు సిబ్బంది ఉన్నారు.

### సీజనల్ వ్యాధులపై అప్రమత్తత

**పాపన్నపేట :** సీజనల్ వ్యాధుల ప్రబలకుండా అధికారుల అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశించారు. మంగళవారం పాపన్నపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మితంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టిక ఓపి రిజిస్టర్ మందుల స్టాక్ రిజిస్టర్ పరిశీలించారు. ప్రజారోగ్య పరిరక్షణ ధ్యేయంగా సిబ్బంది సమయపాలన పాటిస్తూ రోగులతో మర్యాదగా మెలుగుతూ, మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. జ్వర సర్వే పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో పాపన్నపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### వినాయక చవితి పండుగను శాంతియుతంగా జరుపుకోవాలి

**మెదక్ :** జిల్లా వ్యాప్తంగా ప్రజలు శాంతియుతంగా మత సామరస్యాలకు ప్రతీకగా వినాయక చవితి పండుగను జరుపుకోవాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ జిల్లా ప్రజలకు సూచించారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సహకారంతో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధిశాఖ అధికారి జగదీష్ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ నగేష్, జడ్పీ సిఇఓ ఎల్లయ్యతో కలిసి కలెక్టరేట్‌లో మట్టి గణపతుల విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. కలెక్టర్ రాహుల్ రాజ్, కలెక్టరేట్‌లో పనిచేసే అన్ని శాఖల సిబ్బందికి మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. వినాయక మంటప నిర్వాహకులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తగు సూచనలు సలహాలు అందించారు. వినాయక చవితి పండుగను ప్రజలందరూ ప్రశాంతంగా జరుపుకునేందుకు జిల్లాయంత్రాంగం పటిష్ట ఏర్పాట్లు చేసిందన్నారు. మంటపాలు ఏర్పాటు చేసుకునేవారు పోలీస్ శాఖ అనుమతి తప్పనిసరి తీసుకోవాలని సూచించారు. భద్రత దృష్ట్యా మంటపాలలో ఎలక్ట్రిసిటీ, పోలీస్, ఫైర్, మెడికల్ అండ్ హెల్త్, అధికారుల ఫోన్ నెంబర్లు తప్పనిసరిగా ఉంచాలన్నారు. విద్యుత్ పనులు సొంతంగా చేయొద్దని సూచించారు. మంటపాల ఏర్పాటులో ప్రజలకు అసౌకర్యం కలిగించొద్దన్నారు. డిజెలకు అస్సలు అనుమతి లేదని రాత్రి 10గంటల తర్వాత మైక్ వాడొద్దని, హెచ్చరించారు. మంటపాల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఫైర్ సేఫ్టీ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ఏదైనా సమస్యలుంటే వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 1912 లేదా ఎఇ లైన్‌మైన్‌లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.






## 'మిస్టర్ రాము' ఆడియో ఆవిష్కరణ

బొంత రాము హీరోగా నటిస్తున్న సినిమా 'మిస్టర్ రాము'. ఈ చిత్రంలో అజయ్ ఘోష్ విలన్‌గా నటిస్తున్నారు. జబర్దస్త్ అప్పారావు మరో కీ రోల్ పోషించారు. ఈ చిత్రాన్ని రేణుక దేవి ఫిలింస్ బ్యానర్‌పై బొంత రాము నిర్మించారు. అజయ్ కౌండిన్య దర్శకత్వం వహించారు. ఈ సినిమా ఆడియో ఆవిష్కరణ హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నటుడు జబర్దస్త్ అప్పారావు మాట్లాడుతూ ఈ చిత్రంలో మంచి రోల్ చేసే అవకాశం ఇచ్చారు. ఈ సినిమాకు హృదయ్ ముగ్దల్ సూపర్ హిట్ మ్యూజిక్ అందించారు. నిర్మాత, హీరో బొంత రాము మాట్లాడుతూ నాకు హీరోగా నటించాలని కల ఉండేది. దర్శకుడు అజయ్ కౌండిన్య నాకు ఈ సబ్జెక్ట్ చెప్పినప్పుడు కథ నచ్చి తప్పకుండా చేద్దామని ముందుకు వచ్చాను. ఈ చిత్రంలో ఆటో డ్రైవర్ రోల్‌లో నటించాను. మిస్టర్ రాము తో పాటు నేను, డైరెక్టర్ అజయ్ కౌండిన్య కాంబినేషన్ లో మరో 9 చిత్రాలు చేయబోతున్నాం. మొత్తం మా కాంబినేషన్‌లో 10 సినిమాలు రాబోతున్నాయి.



## మంచి ఎంటర్‌టైనర్ సినిమా 'కన్యా కుమారి' : బన్నీవాసు

ప్రముఖ నటి మధు శాలిని ప్రెజెంటర్‌గా రూరల్ లవ్ స్టోరీ 'కన్యా కుమారి' చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నారు. రాడికల్ పిక్చర్స్ బ్యానర్‌పై సృజన్ అట్టాడ రచన, దర్శకత్వం, నిర్మాతగా రూపొందించిన ఈ చిత్రంలో గీత్ సైని, శ్రీచరణ్ రాచకొండ ప్రధాన పాత్రల్లో నటించారు. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్‌కి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ చిత్రం నేడు వినాయక చవితి సందర్భంగా గ్రాండ్‌గా రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రీరిలీజ్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ప్రెస్ మీట్‌లో నిర్మాత బన్నీ వాస్ మాట్లాడుతూ డైరెక్టర్ సృజన్ ఈ సినిమా చూడమని చాలా రోజులుగా అడిగారు. తర్వాత మధు శాలిని ఈ సినిమా గురించి చెప్పారు. మధు శాలిని సినిమాలో సంపాదించి మళ్లీ సినిమాల్లోనే ఇన్వెస్ట్ చేయడం అనేది చాలా గొప్ప విషయం. పంట పొలాలతో ఒక ప్రేమ కథని ముడి పెడుతూ చెప్పడం అనేది నాకు చాలా నచ్చింది. సినిమా స్క్రీన్ ప్లే చాలా బ్యూటిఫుల్‌గా ఉంటుంది. గీత్ సైని చాలా అద్భుతంగా నటించింది. తన క్యారెక్టర్ గుర్తుండిపోతుంది. ఈ మధ్యకాలంలో నేను చూసిన బెస్ట్ పెయిర్ ఇది. ఈ సినిమాని సపోర్ట్ చేయడానికి థియేటర్లో రిలీజ్ చేస్తానని చెప్పడానికి మెయిన్ రీజన్ ఈ సినిమా నాకు చాలా నచ్చింది. చాలా హార్డ్ వర్క్ తో చేసిన సినిమా అందుకే సపోర్ట్ చేస్తున్నాను అని చెప్పారు.



## 'మాస్ జాతర' వాయిదా


మాస్ మహారాజా రవితేజ హీరోగా నటించిన తాజా చిత్రం 'మాస్ జతర' చిత్రం ఆగస్టు 27వ తేదీన థియేటర్లలో విడుదల కావాల్సి ఉండగా కొన్ని సాంకేతిక కారణాల వల్ల వాయిదా పడింది. ఇటీవల పరిశ్రమ వ్యాప్తంగా జరిగిన సమ్మె, కీలకమైన కంటెంట్ పూర్తి చేయడంలో ఊహించని జాప్యం కారణంగా.. సినిమాను అనుకున్న తేదీకి సకాలంలో సిద్ధం చేయలేకపోయామని నిర్మాతల్లో ఒకరైన సూర్యదేవర నాగ వంశీ తెలిపారు. కంగారుగా సినిమాని విడుదల చేయడం కంటే కాస్త సమయం తీసుకొని అత్యుత్తమ చిత్రంగా మలిచి, ప్రేక్షకులకు గొప్ప అనుభూతిని అందించాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు నిర్మాతలు స్పష్టం చేశారు.మాస్ జతార చిత్రాన్ని అసలైన పండుగ సినిమాగా తీర్చిదిద్దడానికి ప్రతి విభాగం అవిశ్రాంతంగా కృషి చేస్తోందని, ప్రస్తుతం చిత్రానికి సంబంధించిన పనులు వేగంగా జరుగుతున్నాయని నిర్మాతలు తెలిపారు. కొత్త విడుదల తేదీ ఇంకా ఖరారు కానప్పటికీ, త్వరలోనే ప్రకటన వస్తుందని పేర్కొన్నారు.

## ఒగ్గు కళాకారుల నేపథ్యంలో 'బ్రహ్మాండ'




ప్రస్తుతం తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీలో ఆధ్యాత్మిక కథలకు కూడా మంచి ఆదరణ లభిస్తుంది. ఒకవైపు పెద్ద సినిమాలు ఎలా అయితే ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తీసుకొస్తున్నాయో, మరోవైపు చిన్న సినిమాలు చాలామంది హృదయాలను తాకుతున్నాయి. ఇక ప్రస్తుతం రాబోతున్న సినిమాలలో బ్రహ్మాండ సినిమా ఒకటి. ఈ సినిమా త్వరలోనే విడుదల అవుతున్న సందర్భంగా సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ సినిమాలో ప్రధాన పాత్రలో నటించిన ఆమని మాట్లాడుతూ.. బ్రహ్మాండ మూవీ తెలుగు ప్రేక్షకులకి ఓ కొత్త అనుభూతి అనుభూతిని ఇస్తుంది అని తెలిపారు. ఇంత మంచి సినిమా సినిమా డైరెక్ట్ చేసిన రాంబాబు మన మధ్య లేకపోవడం బాధాకారం అని అన్నారు. ఈ ఈవెంట్‌లో తెలంగాణ ఫిలిం ఛాంబర్ అధ్యక్షుడు డాక్టర్ ప్రధాని రామకృష్ణ గౌడ్ సంగీత దర్శకుడు వారిఉప్పల యాదగిరి, హీరో బన్నీ రాజు, నిర్మాత దాసరి సురేష్ పాల్గొన్నారు.

## 'నాలో నేను' సాంగ్ రిలీజ్



సంతోష్ శోభన్ హీరోగా నటిస్తున్న సినిమా 'కపుల్ ఫ్రెండ్లీ'. ఈ చిత్రంలో మానస వారణాసి హీరోయిన్‌గా నటిస్తోంది. యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ భాషల్లో నిర్మిస్తోంది. అజయ్ కుమార్ రాజు.పి కో ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రానికి అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వం వహిస్తున్నారు. మ్యూజికల్ రొమాంటిక్ లవ్ స్టోరీ మూవీగా 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమా నుంచి 'నాలో నేను' సాంగ్ రిలీజ్ చేశారు.

## 'ఏం జరుగుతోంది' పాట విడుదల




రశ్మిక మందన్న, దీక్షిత్ శెట్టి జంటగా నటిస్తున్న సినిమా 'ది గర్ల్ ఫ్రెండ్'. ఈ సినిమాను ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్ మెంట్ బ్యానర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. బ్యూటిఫుల్ లవ్ స్టోరీతో దర్శకుడు రాహుల్ రవీంద్రన్ రూపొందిస్తున్నారు. ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మాతలుగా వ్యవహిస్తున్నారు. 'ది గర్ల్ ఫ్రెండ్' సినిమా నుంచి 'ఏం జరుగుతోంది...' అనే పాటను ఆవిష్కరించారు.

## క్రీడా నేపథ్యంలో సినిమా చేయాలనుంది

నారా రోహిత్



హీరో నారా రోహిత్ హీరోగా నటించిన తాజా చిత్రం 'సుందరకాండ'. నూతన దర్శకుడు వెంకటేష్ నిమ్మలపూడి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా 27న (నేడు) విడుదల అవుతున్న సందర్భంగా మీడియాతో నారా రోహిత్ చిట్ చాట్ చేశారు. నిజానికి కం బ్యాక్ సుందర కాండతోనే చేయాలి. 2022లోనే ఈ సినిమా స్క్రిప్ట్ వర్క్ స్టార్ట్ చేశాము. డైరెక్టర్ వెంకటేష్ ఈ ఐడియా చెప్పినప్పుడు కంగారు పడ్డాను. ఆడియన్స్ ఎలా తీసుకుంటారో అనిపించింది. ఐతే అదే సమయంలో వచ్చిన బ్రో డాడీ సినిమా ఒక విండో ఓపెన్ చేసింది. వెంకటేష్ ఒక 30 సీన్స్ రాసుకుని వచ్చాడు. నాకు చాలా నచ్చాయి. అలా ప్రాజెక్ట్ స్టార్ట్ చేశాం. చూస్తున్నంత సేపు ఆడియన్స్ ఫేస్‌లో ఒక స్మైల్ ఉంటుంది. డైరెక్టర్ వెంకటేష్ నాతో ఐదేళ్లుగా ట్రావెల్ అవుతున్నాడు. మేము ఈ సినిమా కోసం చాలా డిస్కస్ చేశాము. అవన్నీ కూడా మాకు చాలా హెల్ప్ అయ్యాయి. ఈ జనరేషన్ కి ఇది చాలా కొత్త కథ. క్యారెక్టర్‌లో కొత్త ఎగ్జిట్ ఉంది. ఈ క్యారెక్టర్ ని చాలా ఎంజాయ్ చేశాను. సుందరకాండ చాలా క్లీన్ ఫిలిం. సీన్స్ ట్రీట్మెంట్ చాలా ఫ్రెష్‌గా ఉంటుంది. అందరికీ కనెక్ట్ అయ్యే సినిమా. ఇందులో నా క్యారెక్టర్ కి కొన్ని లిమిటేషన్స్ ఉంటాయి. 30 దాటినా కూడా కావలసిన క్వాలిటీస్ ఉన్న అమ్మాయి కోసం వెతకడం అనేది చాలా ఇంట్రెస్టింగ్. కాంప్లికేటెడ్ క్యారెక్టర్. ఆ కాంప్లికేషన్ నుంచే ఫన్ క్రియేట్ అవుతుంది.ఈ ప్రేమ కథలో ఉన్న కనిఫ్లిక్ట్ ఇప్పుడే చెప్పలేను. ఇందులో హీరో కావలసిన ఫైవ్ క్వాలిటీస్ అనేవి చాలా పెక్యులర్. అవి మీరు స్క్రీన్ మీద చూడాలి. ఇందులో హీరో పడే సిచువేషన్ నుంచి సినిమా కామెడీ జనరేట్ అవుతుంది.ఈ సినిమా నా ప్రొడక్షన్ లోనే స్టార్ట్ చేశాను. సంతోష్ నా కజిన్. తను ఎప్పటి నుంచి ఒక మంచి ప్రాజెక్ట్ చేయాలనుకుంటున్నారు. ఈ ప్రాజెక్టుకు జాయిన్ అయ్యారు. గౌతమ్ రాకేష్.. వెంకీ చెప్పిన కథ నచ్చి జాయిన్ అయ్యారు. స్టోరీ కారణంగానే నలుగురం కలిశాం. మ్యూజిక్ డైరెక్టర్ లియాన్ వండర్ఫుల్ పర్సన్. టెరిఫిక్ సాంగ్స్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ఇచ్చాడు. సినిమా చూసిన తర్వాత పాటలు మరింత కనెక్ట్ అవుతాయి. డియర్ ఐరా నా ఫేవరెట్ సాంగ్. పెద్ద నరేష్ క్యారెక్టర్ చాలా బాగుంటుంది. ఆయన చాలా అనుభవం ఉన్న నటుడు. ఏ పాత్రనైనా చాలా అద్భుతంగా చేయగలరు. అలాగే సత్య క్యారెక్టర్ కూడా చాలా ఫ్రెష్‌గా ఉంటుంది. నాకు రొమాంటిక్ కామెడీస్, అలాగే స్పోర్ట్స్ డ్రామాలు ఇష్టం. మంచి స్పోర్ట్స్ డ్రామా, ఇన్స్పిరేషనల్ క్యారెక్టర్ వస్తే ఖచ్చితంగా చేస్తాను.వెంకటేష్ తోనే మరో సినిమా కూడా చేస్తున్నాను.



## యాక్షన్ నేపథ్యంలో మిరాయ్

తేజ సజ్జా పాన్‌ఇండియా సూపర్ హీరో విజువల్ వండర్ 'మిరాయ్'లో సూపర్ యోధ పాత్రలో అలరించబోతున్నారు. ఈ చిత్రానికి కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహించారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. ఈ సినిమా ట్రైలర్ ఆగస్టు 28న లాంచ్ చేయనున్నారు.హీరో, విలన్ పవర్ ఫుల్ గా కనిపించిన ట్రైలర్ పోస్టర్ అదిరిపోయింది. తేజ సూపర్ యోధాగా ఎనర్జీతో మెరుస్తున్న మ్యాజికల్ స్టిక్ తో కనిపించగా, మనోజ్ ఫెరోషియస్ బ్లాక్ స్వోర్డ్‌గా, భారీ ఖడ్గాన్ని పట్టుకుని ఎదురు నిలబడ్డాడు. ఈ పోస్టర్‌తో సినిమా మీద అంచనాలు పెరుగుతున్నాయి. ఈ చిత్రంలో తేజ సజ్జ సరసన రితికా నాయక్ కథానాయికగా నటిస్తుండగా, శ్రీయా శరణ్, జయరామ్, జగపతిబాబు కీలక పాత్రల్లో కనిపించనున్నారు.

## తీవ్ర ప్రభావం

(మొదటి పేజీ తరువాయి)

కొనసాగిస్తానని దేశానికి హామీ ఇస్తున్నానని పేర్కొన్నారు. మంగళవారం ఆయన సమాజ్‌వాదీ పార్టీ ప్రధాన కార్యాలయంలో ఎస్‌పి చీఫ్, కాంగ్రెస్ నాయకుల సమక్షంలో జరిగిన విలేకరుల సమావేశంలో సుదర్శన్‌రెడ్డి మాట్లాడారు. తన అభ్యర్థిత్వానికి ఇండియా కూటమిలో లేని వారు కూడా తనకు మద్దతు ఇవ్వడానికి ముందుకు వస్తున్నందుకు వారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. పార్టీ శ్రేణులకు అతీతంగా తన అభ్యర్థిత్వాన్ని యోగ్యత, సిద్ధాంతం ఆధారంగా పరిగణించాలని సుదర్శన్‌రెడ్డి అన్ని రాజకీయ పార్టీల సభ్యులకు విజ్ఞప్తి చేశారు. 'ప్రతిపక్షం నన్ను విశ్వసించిందని, నన్ను అభ్యర్థిగా ఎంపిక చేశారని మీకు ఇప్పటికే తెలుసు. ఇండియా కూటమి మాత్రమే కాకుండా కూటమి వెలుపల ఉన్న వ్యక్తులు కూడా మద్దతు తెలిపేందుకు ముందుకు వస్తున్నందుకు నేను చాలా కృతజ్ఞుడను. నా స్నేహితుడు అఖిలేష్ యాదవ్ లేకుండా ఇది సాధ్యం అయ్యేది కాదు' అని అన్నారు. పత్రిక సమావేశంలో పాల్గొన్న ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ చీఫ్ అజయ్ రాయ్ తరువాత పిటిఐతో మాట్లాడుతూ తామంతా ఒక్కటేనని, బిజెపిని ఇబ్బంది పెట్టడానికి తమ వద్ద కొన్ని ఆశ్చర్యకరమైన అంశాలు ఉన్నాయన్నారు. కాగా, ఇటీవల ఢిల్లీలో ఆప్ నాయకుడు అరవింద్ కేజ్రీవాల్‌ను, చెన్నైలో తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్‌ను కలిశానని సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా నక్సలిజానికి మద్దతు ఇస్తున్నారనే ఆరోపణపై ఆయన మాట్లాడుతూ దానిపై చర్చను కొనసాగించకూడదన్నారు. ఇటీవల పార్లమెంటులో ప్రవేశపెట్టిన 130వ రాజ్యాంగ సవరణ బిల్లుపై విలేకరులు ప్రశ్నించగా, సుదర్శన్‌రెడ్డి బదులిస్తూ ఈ బిల్లును జాయింట్ పార్లమెంటరీ కమిటీ ముందు ప్రవేశపెట్టినందునఇప్పుడే దానిపై వ్యాఖ్యానించడం సరైనది కాదని అన్నారు. 'నేను రాజకీయ రంగంలోకి ఎందుకు అడుగుపెట్టానని మీలో కొందరు అడగవచ్చు. నేను రాజకీయాల్లోకి అడుగుపెట్టలేదు. ఇది ఉన్నత రాజ్యాంగ పదవి అని నేను చెబుతున్నాను. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, డాక్టర్ జాకీర్ హుస్సేన్, డాక్టర్ కె ఆర్ నారాయణన్, తరువాత శ్రీ హమీద్ అన్సారీ జీ. వంటి తత్వవేత్తలు, జాతీయ నాయకులు, విద్యావేత్తలు దీనిని ఇంతకు ముందు నిర్వహించారు. వారు నాకు స్ఫూర్తినిస్తారు. వారు ఒకప్పుడు నడిచిన మార్గంలో నడవడానికి నన్ను నామినేట్ చేసినందుకు అన్ని ప్రతిపక్ష పార్టీలకు నేను కృతజ్ఞుడను' అని ఆయన అన్నారు. తాను నిరంతరం ఎంపిలతో మాట్లాడుతున్నానని, దాదాపు ప్రతిరోజూ మీడియాతో కూడా సంభాషిస్తున్నానని సుదర్శన్ రెడ్డి అన్నారు. డాక్టర్ రామ్ మనోహర్ లోహియా, ఎస్పీ వ్యవస్థాపకుడు ములాయం సింగ్ యాదవ్ గురించి కూడా రెడ్డి ప్రస్తావించారు, వారి నుండి ఆయన చాలా నేర్చుకున్నారని చెప్పారు. తాను (డాక్టర్ రామ్ మనోహర్) లోహియా జీ, నేతాజీ (ములాయం సింగ్ యాదవ్) నుండి కూడా చాలా నేర్చుకున్నానని, కానీ దక్షిణ భారతదేశం నుండి వచ్చినందున హిందీలో ప్రసంగం ఎలా చేయాలో ఎప్పుడూ సరిగ్గా నేర్చుకోలేదన్నారు.

## రాష్ట్ర ప్రజలకు గణేష్ చతుర్థి శుభాకాంక్షలు

### గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ

ప్రజాపక్షం/హైదరాబాద్: రాజ్‌భవన్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో అధికారులు, సిబ్బందికి సహజ సేంద్రీయ రంగులతో పేయింట్ చేయబడిన పర్యావరణ అనుకూలమైన మట్టి గణేశ విగ్రహాలను గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు గవర్నర్ గణేష్ చతుర్థి శుభాకాంక్షలు తెలిపారు. అడ్డంకులను తొలగించే గణేశుడు తెలంగాణ రాష్ట్రం, దేశం యొక్క ఐక్యత, శాంతి, పురోగతి, శ్రేయస్సు మార్గంలో ఉన్న అన్ని అడ్డంకులను తొలగిస్తాడని తన ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

## ప్రపంచ ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో.. చికితా తానిపర్తికి స్వర్ణం



ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణకు చెందిన 20 ఏళ్ల చికితా తానిపర్తి ప్రపంచ ఆర్చరీ జూనియర్ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం సాధించి చరిత్ర సృష్టించారు. పల్లెటూరి రైతు కుటుంబం నుంచి వచ్చిన చికితా, కెనడాలోని విన్నిపెగ్‌లో జరిగిన వరల్డ్ యూత్ ఛాంపియన్‌షిప్స్‌లో అండర్21 మహిళల కాంపౌండ్ విభాగంలో ఈ ఘనత సాధించారు. దీనితో, జూనియర్ ప్రపంచ ఛాంపియన్‌షిప్ టైటిల్ గెలుచుకున్న భారతదేశపు మొదటి మహిళా కాంపౌండ్ ఆర్చర్‌గా నిలిచారు. పెద్దపల్లి జిల్లా సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన చికితా, తన క్రీడా ప్రయాణంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నారు. ముఖ్యంగా, పోటీలకు వెళ్లే ముందు ఎయిర్‌లైన్ సమ్మె కారణంగా ఆమె విమానం రద్దు కావడంతో పోటీల్లో పాల్గొనడంపై అనిశ్చితి నెలకొంది. అయితే, నిర్మాణ్ ఆర్గనైజేషన్, అలాగే తెలంగాణ ప్రభుత్వ ఐటీ, పరిశ్రమల ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్ తక్షణ జోక్యం చేసుకొని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంతో ఆమె సకాలంలో విన్నిపెగ్ చేరుకోగలిగారు. నిర్మాణ్ ఆర్గనైజేషన్, కె.రహేజా కార్పొరేషన్ వారి సిఎస్ఆర్ కార్యక్రమం ధనుష్ శక్తి ద్వారా చికితాకు చాలా సంవత్సరాలుగా మద్దతు అందిస్తూ వచ్చారు. ఆమె శిక్షణ, అవసరమైన ఆర్చరీ పరికరాలను ఈ సంస్థలు సమకూర్చాయి. కె.రహేజా కార్పొరేషన్ సిఓఓ శ్రావణ్ కుమార్ గోనే మాట్లాడుతూ ప్రస్తుతం చికితా ప్రపంచ యువ ఛాంపియన్‌గా ఉండటం తమకు గర్వకారణమన్నారు. ప్రాజెక్ట్ ధనుష్ శక్తి కింద గత కొన్ని సంవత్సరాలుగా ఆమెకు సహాయం అందించి, ఆమె అంతర్జాతీయ ఛాంపియన్‌గా ఎదగడానికి తోడ్పడ్డామన్నారు. ఈ బంగారు పతకం విజయం భారత్‌ను గర్వపడేలా చేసిందన్నారు. ఇనార్బిట్ మాల్ హైదరాబాద్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ శరత్ బేలవాడి మాట్లాడుతూ ధనుష్ శక్తి ప్రాజెక్టు కింద చికితాకు అనేక సంవత్సరాలుగా అవసరమైన సహాయం అందించామని, ఆమె గెలిచిన ఈ స్వర్ణ పతకం ఆమె పట్టుదలను, సరైన సమయంలో అందించిన సహాయం ఎంత ముఖ్యమో నిరూపించిందని చెప్పారు. నిర్మాణ్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు మయూర్ పత్నాల మాట్లాడుతూ చికితా వరల్డ్ యూత్ ఛాంపియన్‌షిప్స్‌లో బంగారు పతకం సాధించి దేశాన్ని గర్వపడేలా చేశారన్నారు. వెనుకబడిన, గిరిజన యువ క్రీడాకారులకు సహాయం చేయాలనే తమ లక్ష్యం ఈ విజయంతో మరింత బలోపేతం అయిందన్నారు. ఇలాంటి మరెన్నో ప్రతిభావంతులను ప్రోత్సహించడానికి ఈ విజయం తమకు ప్రేరణగా నిలుస్తుందన్నారు. 2019లో తన ఆర్చరీ ప్రయాణాన్ని ప్రారంభించిన చికితా, 2020లో మొదటి జాతీయ పతకాన్ని గెలుచుకున్నారని, అప్పటి నుంచి అనేక అంతర్జాతీయ వేదికలపై పతకాలు సాధించి తన ప్రతిభను చాటుకున్నారని తెలిపారు.

## గాజా యుద్ధం ముగియొచ్చు

(మొదటి పేజీ తరువాయి)

రెండు విడతలుగా 11 మంది ముఖ్యమైన జర్నలిస్టులను, కెమేరామెన్‌ను ఇజ్రాయెల్ సైన్యం దాడుల్లో హతమార్చడంపట్ల ట్రంప్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశార. గాజాలో ఇటీవల సామాన్య ప్రజల మరణాలు తనను కలచివేస్తున్నాయని మానవత్వం ప్రదర్శించారు. ఈ మరణాలపట్ల తాను ఎంతమాత్రం సంతోషంగా లేనన్నారు. దక్షిణగాజాలోని నస్సెర్ ఆసుపత్రిపై ఇజ్రాయెల్ సైనిక దళాలు రెండుసార్లు వరుసగా సోమవారం క్షిపణి దాడులు చేయడంతో ఐదుగురు జర్నలిస్టులు, రోగులు, సహాయ సిబ్బంది మరణించడంపట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. 'గాజాలో అధికారికంగా కరువు దుర్భర పరిస్థితులు ప్రారంభమయ్యాయని ఐక్యరాజ్యసమితి మద్దతుగల సంస్థ ప్రకటించిన నేపథ్యంలో నెతన్యాహూతో మీరు టచ్‌లో ఉండి సంభాషణలు చేస్తున్నారా?' అని పాత్రికేయులు అడిగిన ప్రశ్నకు ట్రంప్ స్పందిస్తూ, ఇజ్రాయెల్ ప్రధానమంత్రితో తనకు ఎంతో మంచి సంబంధాలున్నాయంటూ ఇటీవల ఇరాన్‌పై యుద్ధంలో వారి ఉమ్మడి యుద్ధ సహకార అనుభవాలను గుర్తుచేసుకున్నారు. 'వారు ప్రస్తుతం గాజా సిటీ గురించి మాట్లాడుతున్నారు, వారు ఎప్పుడూ ఏదో ఒకటి మాట్లాడుతూనే ఉంటారు, ఇక ఈ యుద్ధం ఏదో ఒకచోట పరిష్కారం కాక తప్పదు, త్వరలోనే ఈ సమస్య పరిష్కారం కావడం మీరు చూస్తారు' అని ట్రంప్ చెప్పారు. పత్రికాగోష్ఠిలో ట్రంప్‌తోపాలు పాల్గొన్న విదేశాంగమంత్రి మార్కో రుబియో మాట్లాడుతూ, ఈ యుద్ధం ముగిసిపోవాలంటే గాజాలో హమాస్ అధికారం నుండి వైదొలగాలన్న కీలకమైన షరతు ఇంకా మిగిలిపోయిందని అన్నారు. మేం దీని పరిష్కారం కోసం చూస్తున్నాం, ఏదో ఒక పరిష్కారం సాధిస్తాం, ముగింపు తెస్తాం, హమాస్‌ను తుడిచిపెట్టడంతోనే ముగింపు వస్తుంది అని మార్కో రుబియో అన్నారు.

### ట్రంప్‌కు అలవాటుగా మారిన రెండువారాల గడువు ప్రకటన!

రాజకీయాల్లో, విధానపరమైన ప్రకటనలు చేసేటప్పుడు ప్రపంచ ప్రాధాన్యంగల ప్రధానాంశాల విషయంలో మాట్లాడేటప్పుడు డోనాల్డ్ ట్రంప్‌కు రెండు వారాలు గడువు విధించడం ఒక అలవాటుగా మారింది! సమస్యను సాగదీసేటప్పుడు ఆయన రెండు వారాల గడువు పదాన్ని ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. ఉక్రేన్ విషయంలో, పుతిన్ విషయంలో కూడా ఆయన ఇదే వైఖరి అనుసరించారు. వాణిజ్య సంబంధాలు, పన్నుల సంస్కరణలు, ఆరోగ్య సంరక్షణ ప్రకటనలు, బొగ్గు గనులు పునఃప్రారంభం, మౌలిక ప్రాజెక్టులు.. ఇలా దేనికి సంబంధించిన అంశంలోనైనా రెండు వారాల గడువు విషయాన్ని ఆయన ఉపయోగిస్తున్నారు. ఇప్పుడు గాజా యుద్ధం ముగింపు విషయంలో కూడా ట్రంప్ తాజా ప్రకటన చేస్తూ, రెండు మూడు వారాల్లో యుద్ధం ముగిసిపోయే అవకాశాలున్నాయన్నారు.

రష్యా–ఉక్రేన్ యుద్ధ విషయంలో ఇంతకు ముందు రెండు వారాలు డెడ్‌లైన్ విధించారు. పుతిన్ నిర్ణయం చెప్పకపోతే ఆంక్షలు విధిస్తామని హెచ్చరించారు. అనేక అంశాలలో తర్వాత చూద్దాం అనే పదానికి బదులుగా ట్రంప్ ఈ రెండు వారాల గడువు పదం ఉపయోగిస్తున్నారని న్యూయార్క్ టైమ్స్ పత్రిక వ్యాఖ్యానించింది.






Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com